మనం

జనం కోసం అక్షర యజ్ఞం..

HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM | AMARAVATHI | TIRUPATI | KURNOOL | TADEPALLIGUDEM | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA

హైదరాబాద్ | సంపుటి: 3 • సంచిక: 12 • పేజీలు: 8+8 • వెల: రూ.5 బుధవారం • 9-1-2019 www.manamnews.com /manamnews


(ఫైల్)

ముస్లిం రిజర్వేషన కోసం

పోరాడాలి

టీఆర్ఎస్ ఎంపీలకు సీఎం కేసీఆర్ ఆదేశం

హైదరాబాద్, జనవరి 8 (మనం ప్రతినిధి):

ఈబీసీలకు పది శాతం రిజర్వేషన్ కేటాయిస్తూ కేంద్ర ప్రభుత్వం పార్లమెంటులో ప్రవేశపెట్టే బిల్లులో సవరణలు కోరాలని టీఆర్ఎస్ ఎంపీలకు ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశించారు. తెలంగాణ ముస్లింలలో వెనుకబడిన వారికి 12 శాతం రిజర్వేషన్లు, ఎస్టీలకు 10 శాతం రిజర్వేషన్లు కేటాయిస్తూ తెలంగాణ అసెంబ్లీ తీర్మానం చేసి కేంద్రానికి పంపింది. ఈ తీర్మానాన్ని పార్లమెంటులో పెట్టాల్సి ఉంది. ఇప్పుడు కేంద్రం రిజర్వేషన్ల పెంపు అంశాన్ని కూడా చేర్చాలని కోరాలని సీఎం ఆదేశించారు. బిల్లులో సవరణ తెచ్చి, తెలంగాణ రాష్ట డిమాండ్‌ను నెరవేర్చేందుకు పట్టుబట్టాలని సీఎం మిగతా 2లో..

సీతారామకు పర్యావరణ అనుమతి

కేంద్ర అటవీ, పర్యావరణ మంత్రిత్వ శాఖ సీతారామ ప్రాజెక్టుకు పర్యావరణ అనుమతిని మంజూరు చేసింది. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం సీతారామ ప్రాజెక్టు చీఫ్ ఇంజనీర్‌కు లేఖ పంపించింది. దీంతో మరో కీలక మూలురాయిని సీతారామ ప్రాజెక్టు అధిగమించింది. సీతారామ ప్రాజెక్టు కోసం టీఆర్ఎస్ ఎంపీలతో పాటు, సీఎం కేసీఆర్ ప్రత్యేక చొరవ తీసుకుంటున్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ కేంద్రంతో జరిపిన దైత్యం ఫలించిందని అధికార వర్గాలు పేర్కొన్నాయి.

కేంద్రానికి షాక్

సీబీఐ డైరెక్టర్‌గా మళ్లీ అలోక్ వర్మ నియమాకం



- ఆయనను నియమిస్తూ సుప్రీం తీర్పు
- సెలవుపై పంపడాన్ని తప్పబట్టిన కోర్టు
- వెంటనే బాధ్యతలు అప్పగించాల్సిందే..
- ఎలాంటి అధికారాలు మాత్రం ఉండవు
- కేవలం రోజువారీ పరిపాలన మాత్రమే
- సెలెక్ట్ కమిటీ నిర్ణయం తర్వాతే ఫైనల్
- నాగేశ్వరరావు నియామకం ఇక పక్కకే
- సుప్రీం కోర్టు ధర్మాసనం కీలక తీర్పు
- సమర్థించుకున్న మంత్రి అరుణ్ జైట్లీ
- విపక్షాల నుంచి తీవ్రస్థాయిలో విమర్శ

న్యూఢిల్లీ, జనవరి 8:

సార్వత్రిక ఎన్నికలకు ముందు కేంద్రంలోని నరేంద్రమోదీ సర్కారుకు పెద్ద ఎదురుదెబ్బ తగిలింది. సీబీఐ విషయంలో జోక్యం చేసుకున్న కేంద్ర మిగతా 2లో..



పౌరసత్వ బిల్లుకు ఓకే

ఆమోదించిన లోక్‌సభ
విపక్షాల తీవ్ర వ్యతిరేకత
సభ నుంచి కాంగ్రెస్ వాకౌట్



దేశవ్యాప్తంగా స్తంభించిన రవాణా

ఎక్కడికక్కడే నిలిచిన సరకు, ప్రజా రవాణా
కేరళ, బెంగాల్ తీవ్రం.. బస్సులు, రైళ్లు బంద్

5

ఇక.. మోదీ తప్పించుకోలేరు

సీబీఐ విషయంలో సుప్రీం తీర్పుపై రాహుల్

ముహూర్తం

శ్రీ చాంద్రమాన విళంబినామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంత ఋతువు, పుష్య మాసం; తిథి: శుక్లపక్షం తదియ ఉ.11.53 వరకు; తదుపరి: చవితి; నక్షత్రం: ధనిష్ఠ రా.12.32 వరకు; తదుపరి: శతభిషం; వర్జ్యం: లేదు; దుర్ముహూర్తం: ప.11.43 నుంచి 12.28 వరకు; రాహుకాలం: ప.12.00 నుంచి 1.30 వరకు; యమగండం: ఉ.7.30 నుంచి 9.00 వరకు; అమృతఘడియలు: ప.1.03 నుంచి 2.48 వరకు;

వాతావరణం



బుధవారం తెలంగాణలో వాతావరణ పొడిగా ఉంటుంది. పగటి ఉష్ణోగ్రతల్లో ఎలాంటి మార్పు ఉండదు. రాత్రి చలి పెరుగుతుంది.

గరిష్ఠ ఉష్ణోగ్రత: 32 డిగ్రీలు
కనిష్ఠ ఉష్ణోగ్రత: 17 డిగ్రీలు





నినాదాలు.. నిరసనలు.. ఆందోళనలు..

12 డిమాండ్లతో కార్మికులు, ఉద్యోగుల రెండు రోజుల సమ్మె మొదటి రోజు మంగళవారం దేశవ్యాప్తంగా నిరసనలు, ఆందోళనలు చేశారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో జరిగిన సమ్మె దృశ్యాలు...

సీవీసీ పైనా మరక!

కేంద్ర విజిలెన్స్ కమిషన్ నివేదికతోనే సీబీఐపై చర్య

- అలోక్‌వర్మపై సీవీసీకి ఆరోపణలు
- ప్రాథమిక ఆధారాలున్నాయని వెల్లడి
- విజిలెన్స్ కోణంలో విచారణ జరగాలి
- సీవీసీ నోట్‌లో పలు కీలక అంశాలు
- అన్నింటికీ కేంద్రబిందువుగా సీవీసీ



న్యూఢిల్లీ, జనవరి 8:

సీబీఐ చీఫ్ అలోక్‌వర్మను తప్పిస్తూ కేంద్రప్రభుత్వం నిర్ణయం తీసుకోడానికి ప్రధాన కారణం.. కేంద్ర విజిలెన్స్ కమిషన్ (సీవీసీ) నివేదిక అని ఇన్నాళ్లుగా చెబుతూ వస్తున్నారు. అక్టోబరు 23వ తేదీన సీవీసీ ఒక ప్రెస్‌నోట్ విడుదల చేసింది. అందులో అలోక్‌వర్మపై పలు ఆరోపణలు చేసింది.

దాని ఆధారంగానే కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకున్నట్లు చెబుతోంది. ఆగస్టు 24న కేబినెట్ సెక్రటరీ విడుదల చేసిన లేఖలో అలోక్‌వర్మపై వచ్చిన ఆరోపణల నేపథ్యంలో విచారణ జరుపుతున్నట్లు ఉంది. ఆ లేఖను కూడా సుప్రీంకోర్టు ధర్మాసనం క్షుణ్ణంగా పరిశీలించింది. అయితే అన్నింటికీ మాత్రం సీవీసీయే ఇప్పుడు కేంద్రబిందువుగా మారినట్లయింది. అలోక్ వర్మపై వచ్చిన ఫిర్యాదులో ఉన్న ఆరోపణలను తాము పరిశీలించామని, అవన్నీ చాలా తీవ్రంగా ఉండటంతో పాటు ప్రాథమిక ఆధారాలుండటంతో వాటిని విజిలెన్స్ కోణంలో విచారించాల్సిన అవసరం కూడా కనపడుతోందని సీవీసీ తన నోట్‌లో పేర్కొన్నారు. ఫిర్యాదు మిగతా 2లో..

ఇదీలోకం!



ఆగని మరణాలు

కొండగట్టు బస్సు ప్రమాదంలో గాయపడ్డ హారిత మృతి

- 65కు చేరిన మృతుల సంఖ్య
- రెణ్ణెళ్లుగా నరకయాతన పడుతున్న హరిత
- వైద్యచికిత్సలు అందక తుదిశ్వాస
- చావుకు దగ్గరలో బాధితులు
- నొప్పులు భరించలేకున్నం.. చంపెయ్యండని వేడుకోలు
- కాళ్లు చేతులు, ఎముకలు విరిగి జీవచ్ఛవాలైన వైనం
- బాధితులకందని పరిహారం..వైద్య సేవలు
- అపన్నహస్తం కోసం 43 బాధిత కుటుంబాల ఎదురు చూపు


హరిత


కొండగట్టులో ప్రమాదానికి గురైన బస్సు (ఫైల్)

కరీంనగర్ ప్రత్యేక ప్రతినిధి, మనం న్యూస్: గత సంవత్సరం సెప్టెంబర్ 11న జరిగిన కొండగట్టు బస్సు ప్రమాదంలో గాయపడిన మహిళ మంగళవారం మరణించింది. డబ్బు తిమ్మయ్యపల్లికి చెందిన సుర కంటి హరిత(35)కు తీవ్రగాయాలకు చికిత్స పొందుతూ మంగళవారం తనువు చాలించింది, దీంతో కొండగట్టు బస్సు ప్రమాదంలో మృతి చెందిన వారి సంఖ్య 65కు చేరింది. బస్సు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వారికి హైదరాబాదు, కరీంనగర్‌లో చికిత్సలు చేయించినా లాభం లేకపోవడంతో వైద్యులు అలక్ష్యం చూపుతూ ఆసుపత్రి నుండి బయటకు నెట్టివేయడంతో గత్యంతరం మిగతా 2లో..


(ఫైల్)

అటవీ నేరాల నిందితులపై పీడీయాక్ట్

నిరంతరం నిఘా, పోలీసుల సహకారం

కలెక్టర్ల నేతృత్వంలో అటవీ రక్షణ కమిటీ సమావేశాలు

హైదరాబాద్, జనవరి 08 (మనంప్రతినిధి):

అటవీ సంరక్షణ, హరితహారం విషయంలో ముఖ్యమంత్రి సూచనలను వందశాతం అమలు చేయాలి, చెట్ల నరికివేత, మిగతా 2లో..

ఆగని మరణాలు

(మొదటిపేజీ తరువాయి)




లేక ఇంటికి తీసుకువచ్చిన విషయం తెలిసిందే. సుమారు రెండు మాసాల పాటు మంచంలో జీవశ్చవంగా చచ్చిబ్రతుకుతున్న హరిత నరకయాతన అనుభవిస్తూ..మంగళవారం ఉదయం తుదిశ్వాస విడిచింది. ఈసంఘటన తెలుసుకున్న చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ హుటాహుటినా డబ్బు తిమ్మయ్యపల్లికి చేరుకున్నారు. మృతురాలికి పూల మాలవేసి నివాళ్ళు అర్పించారు. ఆమె కుంటుంబ సభ్యులను పరమార్శించి తమ ప్రగాడ సానుభూతిని ప్రకటించారు. ప్రభుత్వ పరంగా ఆ కుంటుంబాన్ని అన్ని విధాలుగా అందుకుంటానని హామీ ఇచ్చారు.

ఈ నరక యాతన మేం భరించలేం..

కొండగట్టు బస్సు ప్రమాదంలో మావోళ్లు చచ్చి స్వర్గం పోయింద్రు.. మేము బ్రతికి చచ్చిపోయినం.. అయ్యో దేవుడా..కొండగట్టు అంజన్నా.. మేమేం పాపం చేతిమి... మావోళ్లలాగా మమ్మల్నీ తీసుకుపో.. మమ్మల్నీ బ్రతికించి భూమికి, మా కుటుంభాలకు భారం చేతివి.. నెల రోజులుగా కాళ్లు, చేతులు విరిగి.. ఎక్కటికక్కడ ఎముకలు విరిగి రక్తపు మరకలతో నరకం అనుభవిస్తున్నాం.. నొప్పులు.. అవస్థలు తట్టుకోలేక తల్లడిల్లిపోతున్నాం.. అంజన్న దర్శనం చేసుకుని వస్తుండగా బస్సుబోల్తాపడి మావోళ్లు 63 మంది అనంతలోకాలకెల్లిపోయింద్రు.. మా తల్లిదండ్రులు, అక్కాచెల్లెళ్లు, అన్నాదమ్ములు, బార్యపిల్లలందరినీ పోగుట్టుకున్నం.. వారంతా మా కళ్ల ముందు రక్తం మడుగుల్లో విలవిల కొట్టుకుంటూ..చచ్చిపోయిన తీరు మా కళ్లముందే..కదలాడుతున్నయి.. బతికున్న మాకు కాళ్లు చేతులు తెగిపోయినయి.. చెవులు, ముక్కులు ఊడిపడ్డయి..శరీరంలోని బాగాలు తెగిపడ్డయి.. పక్కటెముకలు, వెన్నుపూసబొక్కలు పటపట విరిగిపోయినయి. మా చావులు మేం చస్తుంటే.. మీరేమో.. ఎన్నికల సందడిలో సంబరాలు చేసుకుంటన్నరు.. ఎన్నికల పుణ్యాన కొండగట్టు బస్సు ప్రమాద బాధితుల గోడు నాయకులు మరిచిపోయినరు... మీకు చేతిలెత్తి దణ్ణం పెడుతం.. జర మావైపు చూడండయ్యా.. బాధితులు ఎదురు చూపులు చూస్తున్నరు. కొండగట్టు బస్సు ప్రమాదం వంద మంది కుటుంబాలను వల్లకాడు చేసింది. ఐదుఊర్లను స్మశానం వాటికలుగా మార్చేసింది. ఈ బస్సు ప్రమాదంలో 63 మంది అక్కడిక్కడే చనిపోయింద్రు.. ఇందులో జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండలానికి చెందిన వారు 53 మంది ఉన్నారు. మరో 43 మంది గాయాలపాలైన నిరాశ్రయులున్నారు. వారందరినీ... నాయకులు, అధికారులు వైద్యం కోసం పలు ఆస్పత్రుల్లోకి పంపించారు. అన్ని చూసుకుంటామన్నారు.. కానీ వారందరూ ఇప్పుడు కానరావడం లేదని

బాధితులు బోరున విలపిస్తున్నారు. తీవ్రగాయాలై ఆస్పత్రుల్లో చికిత్స పొందుతునోళ్లకు ఇక వైద్య సేవలు అందించలేం అంటూ.. వైద్యులు, ఆస్పత్రుల నిర్వాహకులు చేతులెత్తేసారు. చేతిలో చిల్లిగవ్వలేక అప్పుపుట్టక మాయని గాయాలు, అతకని ఎముకలతో బాధితులు ఇండ్లలో అవస్థలు పడుతున్నరు. ఈ నెత్తుటి గాయానికి నెల రోజులు కా వస్తున్నా.. కానరాని వారు కరువయ్యారు. ఆర్థిక సహాయం అందించి అండగా ఉంటామని హామీలిచ్చిన రాజకీయ నేతలు కనుమరుగయ్యారు. చనిపోయిన పోగా క్షతగాత్రులైన 43 మంది బాధితులలో ఎవరిని కదిలించినా వారి ధీన గాథ ఇలానే ఉంది.

అందని అపన్నహస్తం..

కొండగట్టు బస్సు ప్రమాదంలో మరణించిన, గాయపడ్డ కుటుంబాలకు పరిహారం అందించేందుకు ప్రభుత్వం ముందుకు వచ్చింది. తెలంగాణ ప్రభుత్వం తరుపున రూ.5లక్షలు, ఆర్టీసీ తరుపున రూ.3 లక్షలు పరిహారం అందించేందుకు హామీలు ఇచ్చారు. ఇంటికో ఉద్యోగం ఇస్తామన్నారు. అప్పట్లో వైద్య సేవల కోసం తక్షణం రూ.20 చొప్పున ఆర్థిన సహాయం అందించి చేతులు దులుపుకున్నారు.. ఈ నెత్తుటి గాయమై రెన్నెల్లు కావస్తోంది.. నేటికీ పరిహారం ఆందలేదు. కొందరికీ ఆర్టీసి సంస్థ నుండి పరిహారం ఆందినా.. మరికొందరికీ అందలేదు.. సర్కారు నుండి పరిహారం అందలేదు.. ఇదేంటని అడిగితే.. ఎన్నికల తర్వాత అన్నారు. ఇప్పటికీ రాలేదు. దీంతో దిక్కుతోచని దుస్థితిలో కొండగట్టు బాధితులు అపన్న హస్తాల కోసం ఎదురు చూస్తున్నారు.

అయ్యా.. నా నడుమిరిగింది.. పక్కటెముకలు ఇరిగినయి. నాతో పాటు మా అమ్మకు చెప్పుకోని దెబ్బలు తగిలినయి.. ఆమె శరీరంలోని బొక్కలన్నీ విరిగిఉన్నయి. మా అమ్మను వైద్యం కోసం కన్నారం, పట్నం దావఖాన్లకు తీసుపోయిండ్లు.. నాయకులెవరో డాక్టర్లకు రూ.20 ఇచ్చిండ్లు పోయిండ్లు.. మా వద్ద పైసల్లేవని వైద్యం ఆపేసిండ్లు.. ఇంటికి పంపించుండ్లు.. మా చేతిలో చిల్లి గవ్వ లేక ఇంటికాడ గీ.. మంచం మీద బ్రతికి చచ్చిపోతున్న.. అని డబ్బు తిమ్మయ్యపల్లికి చెందిన విజయ విలపిసుంతంది.

బస్సు ప్రమాదంలో మా అమ్మకు ఒకే కాలు నాలుగు చోట్ల విరిగిపోయిందని శనివారం పేటకు చెందిన లచ్చవ్వ బోరున విలపించింది. ఇప్పటి దాకా లచ్చ అప్పుతెచ్చి పట్నంలో వైద్యం చేయించనం.. ఇంకా ఎముకలు అతకలేదు.. రక్తం కారడం మానలేదు.. పట్నం నిమ్స్ దవఖాన్లలో చాన రోజులున్నా.. ఇక పైల్లేవని డాక్టర్లు ఇంటికెళ్లగొట్టిర్లు.. నా కాలు తీసేసిండ్లు.. తలకు పెద్ద గాయమైంది.. చచ్చినా బావుండు..

దేవుని దర్శనానికి పోతే.. గీ గతైందీ.. హిమ్మత్‌రావుపేటకు చెందిన మల్లమ్మ పేర్కొంది. సర్కారోళ్లు పైసలిత్తలేరని. డాక్లర్లు ఇంటికి పంపించుంద్రు.. దేవుని దర్శనానికి పోతే.. నాకు, నా కోడలుకు కాళ్లు చేతులు పోయినయి. మా శరీరమంతా గాయాలే.. బొక్కలు ఇరిగిన చోటే ఇరిగినయి.. ఏం చేయాలే.. అచ్చన్నర అప్పుల పాలైన.. అయినా.. మా పాణం బాగాలేదాయే.. మేమెంటా బ్రతికేదీ...

ముస్లిం రిజర్వేషన కోసం పోరాడాలి

(మొదటిపేజీ తరువాయి)

వారికి తెలియచేశారు.

ప్రొటెం స్పీకర్‌పై గెజిట్ నోటిఫికేషన్

శాసనసభ ప్రొటెం స్పీకర్‌గా చార్మినార్ ఎమ్మెల్యే ముంతాజ్ అహ్మద్ ఖాన్‌ను నియమిస్తూ ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. జనవరి 16న సాయంత్రం 5 గంటలకు గవర్నర్ ఈ ఎస్ ఎల్ నరసింహన్ ప్రొటెం స్పీకర్‌గా ముంతాజ్ అహ్మద్ ఖాన్‌తో ప్రమాణ స్వీకారం చేయించనున్నారు. శాసనసభ కార్యదర్శి నరసింహాచార్యులు మర్యాదపూర్వకంగా ముంతాజ్ అహ్మద్ ఖాన్‌ను ఆయన నివాసంలో కలిసి పుష్పగుచ్చం అందచేశారు. ఆయన వెంట అసెంబ్లీ చీఫ్ మార్షల్ కరుణాకర్, ఇతర అధికారులు ఉన్నారు.



పండగలోపు కమిటీలు

విజయవాడ, జనవరి 8: సిద్ధాంత బలం లేకుండా కేవలం నాయకుల బలం మీద ఆధారపడి నడిచే పార్టీలు ఎక్కువ కాలం మనుగడ సాధించలేవని జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్ స్పష్టం చేశారు. జనసేన పార్టీ చాలా బలమైన సిద్ధాంతాలున్న పార్టీ అని తెలిపారు. జిల్లా స్థాయి సమీక్షా సమావేశాల్లో భాగంగా కర్నూలు జిల్లాకి చెందిన నాయకులు, కార్యకర్తలకి విడివిడిగా దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా పవన్‌కళ్యాణ్ మాట్లాడుతూ.. ''2019 ఎన్నికలు జనసేనకు మొదటి పోరాటమే. ఇదే ఆఖరి పోరాటం కాదు. రాజకీయాల్లో ఓ స్థాయికి రావాలంటే కనీసం ఓ దశాబ్దం ఓపిక ఉండాలి. కొత్త నాయకత్వం రావాల్సిన సమయం ఆసన్నమైంది. అయితే కొత్తవారు ఎంత వరకు నిలబడతారు అన్నదే అసలు సమస్య. దెబ్బ కొడితే అంతకు మించి బలమైన పోరాటం చేసే శక్తి ఉన్నవారు కావాలి. అలాంటి వారిని గుర్తించాలంటే, తయారు చేయాలంటే సమయం కావాలి. కర్నూలు జిల్లాతో నాకున్న అనుబంధం ఈనాటిది కాదు. హత్తిబెళగళ్ పేలుళ్లు జరిగినప్పుడు బాధితుల్ని పరామర్శించేందుకు బయలుదేరినప్పుడు కర్నూలు వస్తున్నారు.. జనం రారని చెప్పారు. కానీ రోడ్లు పట్టనంత జనం వచ్చినప్పుడు సగటు కుటుంబాలు ఏ స్థాయిలో మార్పు కోరుకుంటున్నాయో అర్థం అయ్యింది. 2009లో ఎక్కువ శాతం సీనియర్ లీడర్లే వచ్చారు. కొత్త వారిలో కసి ఉంటుంది కానీ సరైన వ్యూహం ఉండదు. ప్రవహించే నదిలోనూ పవర్ ఉంటుంది. దాన్ని వెలికి తీయాలంటే టర్బైన్లకి అనుసంధానం చేయాలి, ఓ ప్రక్రియ జరపాలి. ఓ క్రమ పద్ధతిలో వెలికి తీయాలి. వ్యవస్థని మార్చేయాలన్న లక్ష్యంతో ముందుకు వచ్చిన వారిని కూడా ఓ క్రమ పద్ధతిలో అనుసంధానం చేసి వారిలో ఉన్న కసిని వెలికితీయాలి. అది సమాజానికి ఉపయోగపడేలా తయారు చేయాలి. 2001 నుంచే ప్రజలు మార్పు కోరుకోవడాన్ని గమనించా. ప్రస్తుత రాజకీయ వ్యవస్థ మీద విసుగుతో జనం మన వైపు చూస్తున్నారు. మనం ఏదో చేస్తామన్న ఆశతో మన కోసం వస్తున్నారు. వచ్చే జనాన్ని శక్తిగా మలచుకోవాలి. 2014లో అతికొద్ది మందితో పార్టీ ప్రారంభించాక, ఇంత మంది అభిమానం చూరగొనడానికి రాజకీయాలపై ఉన్న వ్యతిరేకతే కారణం. పాలకులు అందుబాటులో ఉన్న వనరుల్ని అందరికీ ఆమోదయోగ్యమయ్యే రీతిలో పంచితే ఇలాంటి పరిస్థితులు ఉత్పన్నం కావు. అందరికీ సమానమైన రీతిలో ఉపాధి అవకాశాలు కల్పించాలన్నదే జనసేన లక్ష్యం. నాయకులకి కోట్ల రూపాయలు దోచేయడంలో ఉన్న తెలివితేటలు, శ్రద్ధ యువతకి ఉపాధి కల్పించడంలో ఉండవు. స్థానిక పరిస్థితులు అర్థం చేసుకోకుండా రాజకీయాలు చేయలేం. కులాల కాన్సెప్ట్‌తో అసలు నడపలేం. 2003 నుంచి రాజకీయాల కోసం పూర్తి స్థాయిలో సంసిద్ధమయ్యా. కొత్త వారికి అవకాశం ఇవ్వాలన్న నిర్ణయానికి వచ్చినప్పుడు మెజారిటీ శాతం కొత్తవారే ఉండాలన్న లక్ష్యంతోనే 60 శాతం సీట్లు ఇస్తానని చెప్పా. సంక్రాంతి పండగ లోపు స్వల్పకాలిక కమిటీలు వేసి బాధ్యతలు అప్పగిస్తాం. అవసరం అనుకుంటే మధ్యలో మార్పుచేర్పులు చేద్దాం. యువతకి రాజకీయంగా ఎదగాలన్న కసి ఉన్నా పొలిటికల్ శక్తులు ఎదగనివ్వవు. కర్నూలు లాంటి జిల్లాల్లో అయితే ప్రజలు కుటుంబాల మధ్య నలిగిపోతున్నారు.

రాజకీయాల్లో రెండు రకాల శక్తులు ఉంటాయి. ఒకటి పాలసీ మేకింగ్ అయితే, రెండోది మాస్ ఫాలోయింగ్. జనసేనకి అన్నీ రెండు రకాల బలం ఉన్నవారు కావాలి. కొత్త పార్టీ అంటే అంతా కొత్త నాయకులే ఉన్నా నిలబడలేం. అనుభవం, మన సిద్ధాంతాలకి దగ్గరగా ఉన్న సీనియర్ల అవసరం కూడా ఉంది. 175 స్థానాల్లో పోటీపై నాకు స్పష్టత ఉంది. ఎన్ని స్థానాల్లో కొత్తవారికి అవకాశాలు ఇవ్వాలి అన్న అంశం మీదా స్పష్టత ఉంది.అన్నింటినీ దృష్టిలో పెట్టుకునే సుదీర్ఘ ప్రయాణానికి సిద్ధమయ్యా. అన్ని స్థానాల్లో గొప్పవారిని నిలబెట్టాలన్న కాంక్ష నాకూ ఉంది. గొప్ప అంటే ఆస్తిలో కాదు. గొప్ప ఆశయాలు ఉన్నవారిని. స్థానికంగా కూడా నాలా ఆలోచించే నాయకుల్ని తయారుచేయాలి. అందుకు కొంత సమయం పడుతుంది. లాంగ్‌టర్మ్ విజన్ ఉంటేనే రాజకీయాల్లో రాణింపు సాధ్యం. ప్రతి సమస్య మీదా నేను బలంగా మాట్లాడుతున్నా, పోరాటం చేస్తున్నా.. దాన్ని జనంలోకి తీసుకెళ్లేందుకు మనకి మీడియా లేదు. ఇన్ని వ్యతిరేక శక్తుల మధ్య పోరాటం చేస్తున్నాం. భావజాలం ఉన్నవాడికి బలం ఉంటుంది. బాంబులు వేసినా చలించనంత బలం ఉంటుంది. అలాంటి బలం నా దగ్గర ఉంది. మన లక్ష్యం కోసం ఇప్పుడు పోరాటం చేద్దాం. అది తగ్గి పోరాటం చేయాల్సిన సమయంలో తగ్గే చేద్దాం. నిజమైన పోరాటం చేయాల్సినప్పుడు మీ అందరి కంటే ముందు నేనే నిలబడతా'' అని పవన్ అన్నారు.

అటవీ నేరాల నిందితులపై పీడీయాక్ట్

(మొదటిపేజీ తరువాయి)



కలపరవాణాపై అత్యంత కఠినంగా వ్యవహారించాలని పీసీసీఎఫ్ పీకే ఝూ అన్నారు. పోలీసుల సహాకారంతో అవసరమైతే పీడీ యాక్ట్ కేసులు పెట్టాలని ఉన్నతాధికారులను ఆదేశించారు. మంగళవారం సచివాలయం నుంచి అటవీ శాఖ అధికారులు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.ఈసందర్భంగా వారు మాట్లాడుతూ అన్ని ప్రాంతాల్లో అటవీ నేరగాళ్లు, స్మగర్లను గుర్తించి, వారిపై నిరంతరం నిఘా పెట్టాలని సూచించారు. అడవులు వాటిని కాపాడటం వల్ల జరిగే లాభాల గురించి ప్రతి ఒకరికి అర్ధమయ్యేలా చెప్పే బాధ్యత కూడా అటవీ సిబ్బందేనన్నారు. అడవులకు నష్టం చేస్తున్న నేరగాళ్ల సమాచారం చెప్పే బాధ్యత చట్టం ప్రకారం ప్రతి పౌరుడు, ప్రభుత్వ ఉద్యోగులపై ఉంటుందని, ఆదిశగా అందరిని జాగృతం చేయాలని సూచించారు. అటవీ చట్టాలు ఎంత కఠినంగా ఉంటాయన్న విషయం ఒకసారి అర్ధమైతే మరోసారి ఈనేరం చేసేందుకు ఎవరు సాహసం చేయరని తెలిపారు. అధికారులు, సిబ్బంది నిత్యం క్షేత్రస్థాయిలో పర్యటిస్తే అడవుల రక్షణ సాధ్యం అవుతుందన్నారు. అటవీ బీట్ల వారిగా నేరాలకు పాల్పడే వారిని గుర్తించి, నిరంతరం నిఘా పెట్టిలన్నారు. అటవీ హక్కు చట్టం కింద భూములను సాగు చేసుకుంటున్న వారికి కూడా పక్కనే ఉన్న అడవిని కాపాడే బాధ్యత ఉంటుందన్న విషయం గుర్తు చేయాలన్నారు. అన్ని జిల్లాల కలెక్టర్ నేతృత్వంలో అటవీ రక్షణ కమిటీ సమావేశం నిర్వహించేలా చూడాలన్నారు. వచ్చే సీజన్‌కు హారితహారం కోసం నర్సరీల్లో మొక్కల పెంపకాన్ని వేగవంతం చేయాలని, వెదురు, టేకు మొక్కలను సిద్ధం చేయాలని, అర్బన్ ఫారెస్టు పార్కుల పురోగతి, అటవీ పునరుజ్జీవన చర్యలు, కంపా నిధుల వినియోగం, వివాదాల్లో ఉన్న అటవీ భూముల విషయంలో రెవెన్యూ శాఖతో సమన్వయంపై సమావేశంలో చర్చించినట్లు చెప్పారు. ఈసమీక్షలో పీసీసీలు రఘువీర్, పృధ్వీరాజ్, సీఎం ఓఎస్డీ ప్రియాంక వర్గీస్, అదనపు పీసీసీఎఫ్‌లు లోకేశ్ జైస్వాల్, ఆర్.ఎం. డోబ్రియల్ ,స్వర్గం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రాహుల్‌తో చంద్రబాబు భేటీ

భవిష్యత్ ఎన్నికల ప్రణాళికపై ప్రధాన చర్చ?

శరద్‌పవార్, ఫరూక్ అబ్దుల్లా, కేజ్రీతోనూ చర్చలు

న్యూఢిల్లీ, జనవరి 8: కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీతో టీడీపీ జాతీయ అధ్యక్షుడు, ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు మంగళవారం భేటీ అయ్యారు. ఢిల్లీలోని రాహుల్ నివాసానికి చేరుకున్న సీఎం ఆయనతో సమావేశమయ్యారు. బీజేపీకి వ్యతిరేకంగా కలిసి వచ్చే పార్టీలను ఏకం చేయాలనే లక్ష్యంతో గతేడాది డిసెంబర్ 9న ఢిల్లీలో 28 రాజకీయ పార్టీలతో జరిగిన భేటీకి కొనసాగింపుగా చంద్రబాబు ఢిల్లీ పర్యటన చేపట్టారు. రాహుల్‌తో భేటీ అనంతరం ఎన్సీపీ అధినేత శరద్ పవార్, నేషనల్ కాన్ఫరెన్స్ అధినేత ఫరూక్ అబ్దుల్లా, ఢిల్లీ సీఎం కేజ్రీవాల్, సీపీఎం ప్రధాన కార్యదర్శి ఏచూరితో చంద్రబాబు సమావేశం కానున్నారు. ఈ నెల 19న కోల్‌కతాలో బహిరంగ సభ తర్వాత దేశవ్యాప్తంగా నిర్వహించే భారీ ర్యాలీలపై నేతలతో చర్చించనున్నారు. ఎన్నికలు సమీపిస్తున్న వేళ కార్యాచరణ ప్రణాళిక రూపొందించడం, ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన ఎజెండాను పూర్తిస్థాయిలో ఖరారు చేసే లక్ష్యంతో చంద్రబాబు ఢిల్లీ పర్యటనకు వెళ్లినట్టు సమాచారం. భవిష్యత్తు కార్యాచరణ ఎలా ఉండాలి? జనవరి 19 తర్వాత ఎక్కడ ఎలాంటి సమావేశాలు పెట్టాలి? ఎవరు ఎక్కడ హాజరు కావాలి? ఆయా చోట్ల ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన అంశాలేమిటి? తదితర అంశాలపై చర్చించనున్నట్టు తెలుస్తోంది.

సీవీసీ పైనా మరక!

(మొదటి పేజీ తరువాయి)



ఎవరు చేశారన్న విషయం తాము వెల్లడించబోమని అన్నారు. తూర్పుగోదావరి జిల్లా కాకినాడ ప్రాంతానికి చెందిన సానా సతీష్‌బాబు అనే వ్యక్తి సీబీఐ డైరెక్టర్‌కు రూ. 2 కోట్ల లంచం ఇచ్చారని, మొయిన్ ఖురేషీ, ఇతరులపై తదుపరి చర్యలు తీసుకోకుండా ఉండేందుకు ఇది ఇచ్చారని వాటిలో ఒక ఆరోపణ ఉంది. అలాగే ఐఆర్‌సీటీసీ కేసులో రాకేష్ సక్సేనా అనే వ్యక్తిని తప్పించడానికి సీబీఐ డైరెక్టర్ అతిగా కల్పించుకుని ప్రయత్నాలు చేశారన్నది మరో ఆరోపణ. లాలు ప్రసాద్ ఇళ్లలో సోదాలు చేయొద్దని జాయింట్ డైరెక్టర్ వినీత్ వినాయక్‌ను సీబీఐ డైరెక్టర్ ఆదేశించారని కూడా ఆరోపణలున్నాయి. సీబీఐ డైరెక్టర్ పనితీరుపై మరికొన్ని తీవ్రమైన ఆరోపణలున్నాయని ఆ నోట్‌లో పేర్కొన్నారు. ఆరోపణల తీవ్రత దృష్ట్యా అలోక్ వర్మకు మూడు నోటీసులు ఇచ్చి, వాటికి సంబంధించిన ఫైళ్లను విజిలెన్స్ కమిషన్ ఎదుట ఉంచాలని ఆదేశించారు. తమ ప్రత్యేక డైరెక్టర్ రాకేశ్ ఆస్థానా విషయంలో కొన్ని అనుమానాలున్నాయంటూ సీబీఐ స్వయంగా విజిలెన్స్ కమిషన్‌కు తెలిపిందని కూడా అన్నారు. కనీసం ఆరు కేసుల్లో ఆస్థానా నేరపూరితంగా వ్యవహరించారనడానికి తమవద్ద సాక్ష్యాలున్నాయని, ఆ విషయం ఆస్థానాకు కూడా తెలుసని సీబీఐ చెప్పింది. అంటే, అలోక్‌వర్మపై ఆస్థానా చేసిన ఫిర్యాదును.. కేవలం ఒక అవినీతి అధికారి సీబీఐలోని వివిధ స్థాయిలకు చెందిన అధికారులను భయపెట్టేందుకు చేసిన ప్రయత్నంగా మాత్రమే చూడాలని విజిలెన్స్ కమిషన్‌ను సీబీఐ కోరినట్లు స్పష్టమవుతోంది. కానీ, సీవీసీ మాత్రం ఆస్థానాపై అలోక్‌వర్మ చేసిన ఆరోపణల మీద ఒక నివేదిక ఇవ్వాలని సీబీఐని గత సంవత్సరం అక్టోబరు 21న నిర్వహించిన సెలెక్ట్ కమిటీ సమావేశంలో కోరింది. ఆస్థానాను స్పెషల్ డైరెక్టర్‌గా నియమించేందుకే ఆ కమిటీ సమావేశం జరిగింది! ఆస్థానపై వర్మ చేసిన ఆరోపణలను 2017 నవంబరు 9న సీబీఐకి పంపి, ఒక నివేదిక కోరామని, ఎన్నిసార్లు అడిగినా సీబీఐ మాత్రం నివేదిక పంపలేదని సీవీసీ తన నోట్‌లో పేర్కొంది. ఇదంతా చూస్తుంటే సీబీఐ వ్యవహారంలో సీవీసీ పాత్ర ఏంటన్నది కూడా అనుమానాస్పదంగా కనిపిస్తోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. సీబీఐ వివాదం కాస్తా చివరకు సీవీసీ మీద కూడా మరక వేసే స్థాయికి చేరినట్లయింది.

కేంద్రానికి షాక్

(మొదటిపేజీ తరువాయి)



ప్రభుత్వం.. తొలిసారి తలవంచాల్సి వచ్చింది. సీబీఐ డైరెక్టర్‌గా అలోక్ వర్మనే తిరిగి కొనసాగిస్తూ సుప్రీంకోర్టు ధర్మాసనం మంగళవారం సంచలన తీర్పు వెల్లడించింది. ఆయనను తిరిగి పదవిలో పున:ప్రతిష్టిస్తూ ఉత్తర్వులు వెలువరించినా, వర్మకు ఎలాంటి విధానపరమైన నిర్ణయాలు తీసుకునే అధికారాలు ఉండవని సుస్పష్టం చేసింది. కేవలం రోజువారీ పరిపాలనా పరమైన నిర్ణయాలను మాత్రమే తీసుకోవచ్చునని వెల్లడించింది. ఈ అంశంపై సుప్రీంకోర్టు ప్రధాన న్యాయ మూర్తి జస్టిస్ రంజన్‌గొగోయ్ నేతృ త్వంలో జస్టిస్ సంజయ్ కిషన్ కౌల్, జస్టిస్ కేఎం జోసెఫ్‌లతో కూడిన ధర్మాసనం విచారణ జరిపిన విషయం తెలిసిందే. ప్రధానమంత్రి నేతృత్వంలో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి, లోక్‌సభలో అతిపెద్ద ప్రతిపక్ష పార్టీ నాయకుడు సభ్యులుగా గల కమిటీ వర్మపై వచ్చిన ఆరోపణలను పరిశీలించి ఆయనను పదవిలో కొనసాగించాలా, వద్దా అన్న విషయం నిర్ణయించేవరకు అలోక్ నామమాత్ర సీబీఐ చీఫ్‌గా మాత్రమే ఉంటారు. సీబీఐ డైరెక్టర్ అలోక్‌వర్మ, స్పెషల్ డైరెక్టర్ రాకేశ్ ఆస్థానాలు పరస్పరం అవినీతి ఆరోప ణలు చేసుకోవడంతో వారిని ఇద్దరినీ కేంద్ర ప్రభుత్వం సెలవులో పంపిన విషయం తెలిసిందే. దీనిని సవాల్ చేస్తూ అలోక్‌వర్మ సుప్రీంకోర్టును ఆశ్రయించగా ధర్మాసనం మంగళవారం తీర్పువెలువరించింది. అలోక్‌వర్మపై వచ్చిన ఆరోపణలపై కేంద్ర విజిలెన్స్ కమిషన్ (సీవీసీ) విచారణ పూర్తయ్యేవరకూ ఆయన పరిపాలనాపరమైన విధులు మాత్రమే నిర్వహించాల్సి ఉంటుందని కోర్టు తన ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది. అలాగే.. ఈ నెల 31న అలోక్‌వర్మ పదవీ విరమణ చేయనున్న నేపథ్యంలో కొత్త సీబీఐ డైరెక్టర్‌ను ప్రధాని, ప్రతిపక్ష నేత, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తితో కూడిన సెలెక్ట్ కమిటీ ఎంపిక చేయాలని కూడా కోర్టు స్పష్టం చేసింది. సీవీసీ సమర్పించిన నివేదిక ఆధారంగా కొత్త డైరెక్టర్ ఎంపిక ఉండాలంది. అలోక్ వర్మను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని ఆదేశించిన సుప్రీంకోర్టు... కేంద్రం ఆయనకు అధికారాలు లేకుండా చేసి సెలవుపై పంపడాన్ని తప్పుపట్టింది. ఆయనను అలా సెలవులో పంపడం సరికాదని, వెంటనే బాధ్యతలు అప్పగించాలని స్పష్టంచేసింది. ఈ అంశంపై ప్రధాని, ప్రతిపక్ష నేత, ప్రధాన న్యాయమూర్తితో కూడిన అత్యున్నత కమిటీ వారంలో నిర్ణయం తీసుకోవాలని పేర్కొంది. ఈ సమయంలో ఆలోక్‌వర్మ విధానపరమైన, ప్రధాన నిర్ణయాలు తీసుకోవద్దని సూచించింది. అలాగే సీబీఐ తాత్కాలిక డైరెక్టర్‌గా ఎం.నాగేశ్వరరావు నియామకాన్ని కూడా సుప్రీం పక్కన పెట్టింది. అలోక్ వర్మపై చర్యలు తీసుకోవడానికి ముందు కేంద్రం సెలక్ట్ కమిటీని సంప్రదించి ఉండాల్సిందని న్యాయమూర్తి పేర్కొన్నారు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రంజన్ గొగోయ్ సెలవులో ఉండటంతో తీర్పును మరో న్యాయమూర్తి జస్టిస్ కౌల్ చదివి వినిపించారు.

ప్రభుత్వ విధానాన్నిచెప్పారు: జైట్లీ

సుప్రీంకోర్టు ప్రభుత్వ విధానాన్ని పునర్నిర్వచించిందని కేంద్ర మంత్రి అరుణ్ జైట్లీ అన్నారు. అలోక్‌వర్మ, రాకేష్ ఆస్థానాలను తప్పనిసరి సెలవుపై పంపాలన్న నిర్ణయం కేంద్ర విజిలెన్స్ కమిషన్ ప్రతిపాదన ఆధారంగా తీసుకున్నదేనని ఆయన అన్నారు. సీబీఐ విశ్వసనీయతను కా పాడేందుకు, సంస్థ విస్తృత ప్రయోజనాలను కాపాడేందుకు ఈ నిర్ణయం తీసుకోవాల్సి వచ్చిందని పార్లమెంటు వెలుపల విలేకరులతో మాట్లాడుతూ వ్యాఖ్యానించారు. సీబీఐ డైరెక్టర్‌కు ఇచ్చిన 'ఇమ్యూనిటీ'ని కోర్టు బలోపేతం చేసిందని, అదే సమయంలో ఒక బాధ్యతాయుతమైన వ్యవస్థను కూడా నెలకొల్పిందని ఆయన అన్నారు. కోర్టు సూచనలను తప్పనిసరిగా పాటిస్తామని తెలిపారు.


ప్రధానిని ఎవరూ కాపాడలేరు: రాహుల్

ప్రధానమంత్రి నరేంద్రమోదీని రఫేల్ స్కాం నుంచి ఇక ఎవరూ కాపాడలేరని కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ అన్నారు. రఫేల్ ఒప్పందంపై విచారణ ప్రారంభిస్తున్నారనే అర్ధరాత్రి ఒంటిగంట సమయంలో సీబీఐ చీఫ్‌ను సాగనంపారని, ఇప్పుడు ఆయనను తిరిగి కుర్చీలో కూర్చోబెట్టడంతో కొంతయినా న్యాయం జరిగిందని అన్నారు. అనిల్ అంబానీకి ప్రధాని మోదీ రూ. 30వేల కోట్ల మేర సాయం చేశారన్నది స్పష్టంగా తెలుస్తోందని, ఇందులో చిన్న అనుమానం కూడా లేదన్న విషయం జాతికి తెలుసని ఆయన చెప్పారు.

తప్పుబట్టడమే: కేజ్రీవాల్

అలోక్‌వర్మను మళ్లీ సీబీఐ డైరెక్టర్‌గా నియమిస్తూ సుప్రీంకోర్టు తీర్పు చెప్పడం నేరుగా ప్రధానమంత్రిని తప్పుబట్టడమేనని ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ అన్నారు. మోదీ సర్కరు మన దేశంలో ప్రజాస్వామ్యంతో పాటు వ్యవస్థలన్నింటినీ సర్వనాశనం చేసిందని ఆయన విమర్శించారు. రఫేల్ స్కాంలో నేరుగా ప్రధాని హస్తం ఉండటంతో దానిపై విచారణను ఆపడానికి అర్ధరాత్రి అక్రమంగా సీబీఐ డైరెక్టర్‌ను తొలగించలేదా అని ప్రశ్నించారు.

అఖిలప్రియ డుమ్మా!



కర్నూలు, జనవరి 8 (మనం న్యూస్‌బ్యూరో): ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కర్నూలు జిల్లాలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న జన్మభూమి మా ఊరు కార్యక్రమానికి మంగళవారం పాణ్యం, మంత్రాలయం నియోజకవర్గాల్లో పర్యటించారు. ఈ కార్యక్రమానికి జిల్లాకు చెందిన ఉపముఖ్యమంత్రి కేఈ కృష్ణమూర్తి, వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ హాజరైనా జిల్లాకే చెందిన మరో మంత్రి.. పర్యాటక శాఖను చూస్తున్న భూమా అఖిలప్రియ మాత్రం ఇంత పెద్ద కార్యక్రమానికి డుమ్మా కొట్టారు. ప్రభుత్వ కార్యక్రమాల్లో ఎక్కడా పాల్గొనకుండా ఆమె సర్కారు తీరుపై అలక ప్రదర్శించినట్లు తెలుస్తోంది. జనసేన పార్టీకి సంబంధించిన కీలకమైన నేతలతో జిల్లాలో 3 సీట్ల కోసం ఆమె ప్రయత్నం చేస్తున్నట్లు విశ్వసనీయమైన సమాచారం. ఇప్పటికే జనసేన పార్టీకి దరఖాస్తు కూడా చేసుకున్నట్లు రాజకీయవర్గాల ద్వారా తెలిసింది. జిల్లాలో ఈ అంశంపై తెలుగుదేశం పార్టీకి చెందిన పలువురు సీనియర్ నేతలు, కార్యకర్తలు ప్రత్యేకంగా చర్చించుకుంటున్నారు. త్వరలో ఆమె పార్టీ మారడం ఖాయమని వినిపిస్తోంది.



మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌తో టీఆర్ఎస్ ఎంపీ జోగినపల్లి సంతోష్ కుమార్



రాజ్‌భవన్‌లో గవర్నర్ నరసింహన్‌ను కలిసిన రాజస్థాన్ గవర్నర్ మార్గరెట్ అల్వా



కేటీఆర్‌కు నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలుపుతున్న మీడియా అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ

సివిల్ సప్లైస్ కార్పొరేషన్ చైర్మన్‌గా
మారెడ్డి శ్రీనివాసరెడ్డి

- ఉత్తర్వులపై సంతకం చేసిన సీఎం కేసీఆర్



హైదరాబాద్,జనవరి 08, (మనం ప్రతినిధి): తెలంగాణ రాష్ట్ర సివిల్ సప్లైస్ కార్పొరేషన్ ఛైర్మన్‌గా సిద్దిపేట నియోజకవర్గానికి చెందిన టీఆర్ఎస్ నేత మారెడ్డి శ్రీనివాసరెడ్డిని ప్రభుత్వం నియమించింది. దీనికి సంబంధించిన ఉత్తర్వులపై ముఖ్యమంత్రి కేసీఆర్ మంగళవారం సంతకం చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసరెడ్డిని పలువురు అభినందించారు.

సాయి కృష్ణకు అండగా ఉంటం

- కేటీఆర్‌ను కలిసిన బాధితుని కుటుంబ సభ్యులు

హైదరాబాద్,జనవరి 08, (మనం ప్రతినిధి): అమెరికాలో దుండగుల చేతిలో తీవ్రమైన కాల్పులకు గురై చికిత్స పొందుతున్న మహబూబాబాద్ కు చెందిన విద్యార్థి సాయి కృష్ణకు అండగా ఉంటామని కేటీఆర్ తెలిపారు. సాయి కృష్ణ కుటుంబ సభ్యులు మంగళవారం బేగంపేట క్యాంపు కార్యాలయంలో కేటిఆర్ ని కలిశారు. తమకు సాయం చేయాలని వారు కోరారు. సాయి కృష్ణ తల్లిదండ్రులు వెంటనే అమెరికాకు వెళ్లేందుకు అవసరమైన అన్ని రకాల సహాయ సహకారాలను అందిస్తామని కేటీఆర్ వారికి హామీ ఇచ్చారు.

సాయి కృష్ణ ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం సాయి కృష్ణ ప్రాణాపాయ స్థితి నుంచి బయటపడ్డారని అయితే పలు శస్త్ర చికిత్సలు ఆయనకు అవసరమని అక్కడ ఉన్న సాయి కృష్ణ మిత్రులు తమకు తెలియజేశారని తల్లిదండ్రులు కేటీఆర్ కు తెలిపారు. అవసరమైన తక్షణ వైద్య సహాయం గురించి అమెరికాలోని కాన్సల్ జనరల్ ఆఫ్ ఇండియా కార్యాలయానికి తమ ఎన్ఆర్ఐ శాఖ అధికారులు సమాచారం అందించారని కేటీఆర్ తెలిపారు. అవసరమైతే విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి సుష్మాస్వరాజ్‌తో మాట్లాడుతామని హామీ ఇచ్చారు. ఈ మేరకు మహబూబాబాద్ పార్లమెంట్ సభ్యులు సీతారాం నాయక్ నేరుగా సుష్మాస్వరాజ్ గారిని కలిసిన్నట్లు కేటీఆర్ తెలిపారు. సాయి కృష్ణ వైద్య సహాయం ప్రస్తుతం ఎలాంటి ఆటంకాలు లేకుండా అందుతుందని, అయితే ఆయనకు బీమా సౌకర్యం లేకపోవడంతో తమకు ఆర్థిక సహాయం అవసరమవుతుందని ఈ సందర్భంగా కేటిఆర్‌ను సాయి కృష్ణ కుటుంబ సభ్యులు కోరారు. సాయి కృష్ణ ను అన్ని విధాల ఆదుకుంటామన్న కేటీఆర్, ముందుగా కుటుంబ సభ్యులు అమెరికా వెళ్లేందుకు అవసరమైన ఆర్థిక సహాయాన్ని తక్షణం అందించాలని ముఖ్యమంత్రి కార్యాలయ స్పెషల్ సెక్రటరీ రాజశేఖర్ రెడ్డి కి కేటీఆర్ విజ్ఞప్తి చేశారు. సాయి కృష్ణ కుటుంబ సభ్యులు అమెరికా వెళ్లేందుకు అవసరమైన అత్యవసర వీసాలను జారీ చేయాల్సిందిగా హైదరాబాద్లోని అమెరికా కాన్సుల్ జర్నల్ కేథరిన్ హెడ్డా తోనూ కేటీఆర్ ఫోన్లో మాట్లాడారు.



పీఆర్టీయూ క్యాలెండర్ ఆవిష్కరించిన హోంమంత్రి



హైదరాబాద్,జనవరి 08, (మనం ప్రతినిధి): పీఆర్టీయూ 2019 క్యాలెండర్, డైరీని హోంమంత్రి మహమూద్ అలీ ఆవిష్కరించారు. ఈ సంద్దర్భంగా శాసన మండలి చీఫ్ విప్ పాతూరి సుధాకర్ రెడ్డి, ఉపాధ్యాయ సంఘ నేతల సమక్షంలో ఈ ఆవిష్కరణ కార్యక్రమం మంగళవారం జరిగినట్లు పీఆర్టీయూ నేతలు తెలిపారు.

టీఆర్ఎస్ ఢిల్లీ పార్టీ కార్యాలయ నిర్మాణానికి
రూ. ఐదు లక్షల విరాళం



హైదరాబాద్, జనవరి 08, (మనం ప్రతినిధి):తెలంగాణ రాష్ట్ర సమితి పార్టీ దేశ రాజధాని ఢిల్లీలో త్వరలో పార్టీకి కార్యాలయ భవనాన్ని నిర్మించాలని తలపెట్టింది. ఇందుకు సంబంధించి ఢిల్లీలో నిర్మించబోయే కార్యాలయ నిర్మానాణికి టీఆర్ఎస్ కి చెందిన రంగారెడ్డి జిల్లా టీఆర్ఎస్ ఉపాధ్యక్షులు వసిలి చంద్రశేఖర ప్రసాద్ పార్టీకి ఐదు లక్షల రూపాయల విరాళాన్ని ప్రకటించారు. ఈ మేరకు తెలంగాణ రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షులు కేటీఆర్ కి మంగళవారం రు. 5 లక్షల చెక్కును అందచేశారు. ఈ కార్యక్రమంలో చంద్రశేఖర్ వెంట శేర్లింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీతో పాటు పలువురు టీఆర్ఎస్ నేతలు కూడా ఉన్నారు.

కులమతాలకు అతీతంగా
ఈబీసీ రిజర్వేషన్లు

- గ్రామాలు, కుటుంబాల వారీగా అభివృద్ధి ప్రణాళికలు
- తెలంగాణ బీసీ కమిషన్ ఛైర్మన్ బీఎస్‌రాములు

హైదరాబాద్, జనవరి 8 (మనం ప్రతినిధి): ఈబీసీ రిజర్వేషన్లు అన్ని కులాలకు, అన్ని మతాలకు వర్తిస్తాయని, కుల పత్రాలు లేని వారికి బీసీ,ఎస్సీ, ఎస్టీ,మైనార్టీ అనే తేడా లేకుండా అందరికీ నూతన అవకాశాలు పెరుగుతాయని బీసీ కమీషన్ ఛైర్మన్ బిఎస్ రాములు పేర్కొన్నారు. మంగళవారం ఆయన ఒక ప్రకటనలో పేర్కొంటూ బీసీలందరికి ఈబీసీ రిజర్వేషన్ల ద్వారా క్రిమిలేయర్ పరిమితిలో అవకాశాలు పెరుగుతాయని, బీసీ,ఎస్సీ,ఎస్టీ, మైనార్టీలకు దేశంలో 70శాతం , తెలంగాణలో 85నుంచి 89 శాతం జనాభా ఉన్నారు. 20నుంచి 25శాతం ఉన్న సామాజికంగా, చారిత్రకంగా గౌరవాలు పొందుతున్న కులాలు 20నుంచి 25 శాతం మాత్రమే వీరిలో పేదలు ఈబీసీ రిజర్వేషన్ల ద్వారా కొంత లబ్దిపొందే అవకాశం ఉందన్నారు. జనరల్ కేటగిరీలోని ఈబీసీ రిజర్వేషన్లు ఎస్సీ, ఎస్టీ,బీసీ, మైనార్టీల సామాజిక వర్గాలందరికి వర్తిసాయి.పేదరికానికికులం, మతం, ప్రాంతం, భాషలకు అతీతంగా పరిగణనలోకి తీసుకోవడం జరుగుతుందన్నారు. సబ్సిడీ బియ్యం రేషన్ కార్డున్న వారంతా ఈబీసీ రిజర్వేషన్లుకు అర్హులని వివరించారు. జనాభా ప్రాతిపదికపై బీసీరిజర్వేషన్లు పెంచాల్సి ఉన్నదని, బీసీ (ఇ) గ్రూపు కు పెంచిన రిజర్వేషన్లు కూడా కేంద్రం ఆమోదించడం ద్వారా సామాజిక సామరస్యం వెల్లివిరుస్తుందని, ఇవి అందరికి వర్తిసాయి.దీంతో అగ్రకుల రిజర్వేషన్ ఉద్యమాల సృష్టించే సంఘర్షణలకు ఒక ముగింపు లభిస్తుందని ఆశిద్దామన్నారు. 25శాతం ఈబీసీ క్రీమీలేయర్ పెట్టాలని, ప్రస్తుతం 10శాత పెట్టారు. ఇంకా 15శాతం కూడా క్రీమీలేయర్ పరిధిలోకి తెస్తేనే గ్రామీణ, పట్టణ పేదలకు న్యాయం జరుగు తుందని పేర్కొన్నారు. వీరు వందల వేల కోట్ల సంపన్నులతో జనరల్ కేటగిరీలో పోటీ పడలేక దశాబ్దాలుగా వెనకబడిపోతున్నారు. ఇది అమలైతే కొంత స్వాంతన లభి స్తుంది. తద్వారా రిజర్వేషనలను వ్యతిరేకించే ప్రస్తుత దశ నుంచి రిజర్వేషనలను సమర్థించే దిశగా ఎదుగుతారు. అలాగే చట్టసభల్లో, న్యాయవ్యవస్థలో బీసీలకు, మహిళలకు రిజర్వేషన్లు, అవసరమని వెల్లడించారు.



ప్రొటెం స్పీకర్‌ను కలిసిన అసెంబ్లీ కార్యదర్శి
నరసింహాచార్యులు



హైదరాబాద్, జనవరి 08, (మనం ప్రతినిధి): రెండవసారి అధికారం లోకి వచ్చిన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వంలో ప్రోటెం స్పీకర్‌గా నియమితులైన ఎంఐఎం సీనియర్ ఎమ్మెల్యే ముంతాజ్ అహ్మద్ ఖాన్‌ను అసెంబ్లీ కార్యదర్శి నరసింహచార్యులు మంగళవారం మర్యాద పూర్వకంగా కలి శారు. ఈ సందర్భంగా ప్రోటెం స్పీకర్‌ని కలిసిన నరసింహ చార్యులు నూతన సంవత్సర శుభా కాంక్షలు తెలియజేశారు.

సర్వే సమస్య సదురుకుంటుంది

- టీఆర్ఎస్‌తో ఉత్తమ్ కుమ్మక్కు అవాస్తవం

హైదరాబాద్, జనవరి08(మనంప్రతినిధి) : కేంద్ర మాజీ మంత్రి సర్వే సత్యనారాయణ సమస్య సద్దుమణుగుతుందని, ఎఐసీసీ నాయకులు ఈ విషయం చర్చిస్తున్నారని టీపీసీసీ అధికార ప్రతినిధి మల్లు రవి చెప్పారు. అయితే, టీఆర్ఎస్ పార్టీతో టీపీసీసీ అధ్యక్షులు ఎన్ ఉత్తమ్ కుమార్ రెడ్డి, పార్టీ రాష్ట్ర ఇంచార్జి డాక్టర్ రామచంద్రకుంతియా కుమ్మక్కు కావడం వల్లే శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఓడిపోయిందని సర్వే సత్యనారాయణఆరోపించడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. టీఆర్ఎస్ పార్టీ అధికార దుర్వినియోగం, విచ్చలవిడిగా మద్యం,డబ్బు పంపిణీ, ఈవీఎంల ట్యాంపరింగ్, రిగ్గింగ్‌వల్ల కాంగ్రెస్ పార్టీ ఓడిపోయిందని చెప్పారు. పార్టీ ఓడిపోయిన పరిస్థితుల్లో కార్యకర్తల మనోభావాలను దెబ్బతీసే విధంగా నాయకులు వ్యవహరించరాదని మల్లు రవి సూచించారు. సమస్యలు ఉంటే సామరస్యపూర్వకంగా పరిష్కరించుకోవాలని విజ్ఞప్తిచేశారు.

ఈబీసీ రిజర్వేషన్లను ఆహ్వానిస్తున్నాం

- ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లు పెంచాలి
- బీసీ జనాభా లెక్కలు ప్రకటించి రిజర్వేషన్లపై చర్యలు చేపట్టాలి
- ఎన్నికల్లో ఓట్ల కోసమే రిజర్వేషన్లు : ఏపీసీసీ అధ్యక్షులు ఎన్ రఘువీరారెడ్డి

హైదరాబాద్, జనవరి08(మనంప్రతినిధి) : ఆర్థికంగా పేదలైన అగ్రవర్ణాలకు 10 శాతం రిజర్వేషన్లు కల్పించాలని కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (ఏపీసీసీ) సమర్థించింది. అయితే, పార్లమెంట్ ఎన్నికల్లో ఓట్లకోసమే బీజేపీ సర్కార్ రిజర్వేషన్లను కల్పిస్తోందని ఏపీసీసీ అధ్యక్షులు ఎన్ రఘువీరా రెడ్డి విమర్శించారు. మంగళవారం ఇందిరాభవన్ లో ఆయన విలేఖరుల సమావేశంలో మాట్లాడారు. ఆర్థికంగా పేదలైన అగ్రవర్ణాలకు నిజంగా రిజర్వేషన్లు ఇవ్వాలనుకుంటే నాలుగేళ్లపాటు ఏం చేశారని ప్రశ్నించారు. ఎస్సీ ,ఎస్టీల జనాభా పెరిగిందని, రాజ్యాంగం ప్రకారం పెరిగిన జనాభా ప్రకారం ఈ వర్గాలకు రిజర్వేషన్లు కల్పించాల్సి ఉంటుందని, ఇప్పుడున్న ఎస్సీ రిజర్వేషన్లు 15 శాతం నుంచి18.46 శాతం, ఎస్టీ రిజర్వేషన్ల 7.5 శాతం నుంచి 10.97 శాతానికి పెంచాలని డిమాండ్ చేశారు. అదే విధంగా బీసీ జనాభాను ప్రకటించి రిజర్వేషన్లు పెంచేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. పీవీ నర్సింహారావు ప్రధాన మంత్రిగా ఉన్నప్పుడే ఆర్థికంగా బలహీనులైన వారికి రిజర్వేషన్లు కల్పించేందుకు చర్యలు తీసుకున్నారని గుర్తు చేశారు. ఇంటింటికి కాంగ్రెస్ పేర ఆంధ్రప్రదేశ్‌లో తాముచేపట్టిన కార్యక్రమం సందర్భంగా కాంగ్రెస్ పార్టీ కేంద్రంలో అధికారంలోకి వస్తే ఈబీసీ రిజర్వేషన్లు కల్పిస్తామని హామీ ఇచ్చిందని, ఈ మేరకు సంబంధించిన కరపత్రాలను రఘువీరారెడ్డి మీడియాకు విడుదల చేశారు. జీఎస్టీ, పెద్దనోట్ల రద్దు, రైతుల ఆగ్రహం తదితర విషయాల్లో ప్రజల నుంచి వ్యతిరేకత రావడంతో దాన్నుంచి తప్పించుకునేందుకే 10 శాతం రిజర్వేషన్ల పెంపు నాటకమని మండిపడ్డారు.



మోడీకి సుప్రీం మొట్టికాయలు....

సీబీఐ డైరెక్టర్ అలోక్ వర్మను రాత్రికి రాత్రే తొలగించిన ఘటనకు సంబంధించి ఆయన్ను తిరిగి నియమించాలని సుప్రీంకోర్టు ఉత్తర్వులు జారీ చేసి ప్రధానమంత్రి నరేంద్రమోడీకి సుప్రీం కోర్టు మొట్టికాయలు కొట్టిందని రఘువీరారెడ్డి ఆరోపించారు. విలేఖరుల సమావేశంలో పార్టీ అధికార ప్రతినిధి గౌతమ్, సీనియర్ నేత నాయక్ తదితరులు పాల్గొన్నారు.

అశ్వరావుపేట ఎమ్మెల్యే మచ్చాతో
మాజీ మంత్రి తుమ్మల చర్చలు

టీఆర్ఎస్‌లో చేరేందుకు సుముఖత వ్యక్తం చేసిన మచ్చా

త్వరలోనే సండ్ర, మచ్చా టీఆర్ఎస్‌లో చేరే అవకాశం

హైదరాబాద్, జనవరి 8 (మనం ప్రతినిధి): ఖమ్మం జిల్లా రాజకీయాలు మారబోతున్నాయి. త్వరలోనే ఇద్దరు టీడీపీ ఎమ్మెల్యేలు టీఆర్ఎస్ లో చేరబోతున్నారు. ఈ పనిని మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు అప్పగించారు. ఆయన గత కొంత కాలంగా అంతర్గత చర్చలు జరుపుతున్నారు. సత్తుపల్లి టీడీపీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య టీఆర్ఎస్‌లో చేరడానికి ఇప్పటికే సిద్ధపడ్డారు. అశ్వారావుపేట టీడీపీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు మాత్రం ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. మంగళవారం మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరావుతో ఆయన ప్రత్యేకంగా భేటీ అయ్యారు. టీఆర్ఎస్‌లో చేరే విషయంపైనే ప్రధానంగా చర్చించారు. తుమ్మల నాగేశ్వరరావుతో చర్చించన తర్వాత ఆయన మనసు మార్చుకున్నారని తెలిసింది. నియోజక వర్గం అభివృద్ధికి కట్టుబడి టీఆర్ఎస్‌లో చేరడం ఉత్తమం అనే అభిప్రాయానికి వచ్చారని అంటున్నారు. దీంతో ఖమ్మం జిల్లా నుండి గెలిచిన ఇద్దరు టీడీపీ ఎమ్మెల్యేలు త్వరలోనే కారెక్కబోతున్నారని తెలుస్తోంది. ఇప్పటికే టీఆర్ఎస్ బలం 91కి చేరింది. ఈ ఇద్దరి చేరికతో 93కు చేరుకుంటుంది. మెచ్చానాగేశ్వరరావు, సండ్రవెంకటవీరయ్యలలో ఎవరోఒకరికి ప్రభుత్వంలో గౌరవ ప్రధమైనస్థానం లభించేఅవకాశం ఉందంటున్నారు. టీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఖమ్మం జిల్లా రాజకీయాలపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించారు.ఈజిల్లాలో టీఆర్ఎస్‌జెండా రెపరెపలాడాలనే ఆలోచనతో వ్యూహాత్మకంగావ్యవహరిస్తున్నారు. ఇప్పటికే నల్లగొండ, మహబూబ్‌నగర్ జిల్లాలపై దృష్టి కేంద్రీకరించి పార్టీని బలోపేదం చేసే ప్రక్రియను వేగవంతం చేశారు.

మనం

జనం కోసం.. అక్షర యజ్ఞం..

బుధవారం, జనవరి 9

కేంద్రానికి చెంపపెట్టు

సీబీఐ డైరెక్టర్ కేసులో మంగళవారం సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు కేంద్రానికి నిజంగా చెంపపెట్టుగానే భావించాలి. సీబీఐ డైరెక్టర్ అలోక్ వర్మను తొలగిస్తూ కేంద్రం జారీ చేసిన ఉత్తర్వులను సుప్రీంకోర్టు కొట్టేసింది. అలోక్ వర్మతో పాటు సీబీఐ ప్రత్యేక డైరెక్టర్ రాకేశ్ ఆస్థానాను సెలవుపై పంపించడంతో పాటు ఆ సంస్థ డైరెక్టర్‌గా నాగేశ్వరరావును నియమిస్తూ కేంద్రం అక్టోబర్ 23న ఉత్తర్వులు జారీచేసింది. కాగా, అలోక్ వర్మ ఈ నెల 31న పదవీ విరమణ చేయనున్నారు. తనపై కేంద్రం జారీచేసిన ఉత్తర్వులపై వర్మ అత్యున్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రంజన్ గోగొయ్, జస్టిస్ ఎస్.కె.కౌల్, జస్టిస్ కె.ఎం జోసెఫ్‌లతో కూడిన బెంచ్ విచారణ జరిపి మంగళవారం కేంద్రం ఉత్తర్వులను తోసిపుచ్చింది. అలోక్ వర్మనే సీబీఐ డైరెక్టర్‌గా నియమించాలని ఆదేశించింది.

ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో ఇటువంటి వివాదాస్పద నిర్ణయాలతో నియంతలా వ్యవహరిస్తున్న ప్రధాని నరేంద్ర మోదీకి ఇది నిజంగా తీవ్రమైన ఎదురుదెబ్బే. సీబీఐ చరిత్రను పరిశీలిస్తే పోలీసు చట్టం, 1861 మేరకు మొదట్లో సీబీఐ పనిచేసేది. తదనంతరం సీబీఐ గణనీయమైన పాత్ర పోషించే దిశగా పని చేస్తోందని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. దాని వ్యవహారశైలితోను, అధికారంతోను ప్రస్తుతం దేశంలో కీలక దర్యాప్తు సంస్థగా రూపుదిద్దుకుంది. రాజ్యాంగ పరమైన ఇలాంటి సంస్థలను తన అధీనంలోకి తెచ్చుకునేందుకు మోదీ నాయకత్వంలోని కేంద్రం ప్రభుత్వం చేసిన ప్రయత్నాలను మంగళవారం నాటి తీర్పు ద్వారా అత్యున్నత న్యాయస్థానం అడ్డుకున్నది. రాజ్యాంగ సంస్థలను నిర్వీర్యం చేసే చర్యలు ఆదినుంచి చేపట్టిన మోదీ, ఇప్పటికే ఆర్‌బీఐని, ఎన్నికల సంఘాన్ని గుప్పెట్లో పెట్టుకునేందుకు చేసిన యత్నాలు విదితమే.


కేంద్రంలో అధికారంలోకి వచ్చిన ప్రతి రాజకీయపార్టీ కూడా సీబీఐని తన జేబుసంస్థగా వినియోగించడం సర్వసాధారణమైంది. ప్రతిపక్షాలపై, తమ ప్రభుత్వాన్ని వ్యతిరేకించే పారిశ్రామికవేత్తలు, ఇతర వర్గాలకు చెందిన ప్రత్యర్థులపై దాడులకు సీబీఐని ప్రయోగించడం మామూలై పోయింది. గతంలో ప్రధానిగా ఉన్న ఇందిరాగాంధీ హయాం నుంచి సీబీఐని తమ చెప్పుచేతల్లో ఉంచుకునే ప్రయత్నాలు ఆరంభం కాగా, అవి నేడు వెర్రితలలు వేసే దిశగా కొనసాగుతున్నాయి.

నరేంద్ర మోదీ తీసుకున్న చట్టవ్యతిరేక ఉత్తర్వులను సుప్రీంకోర్టు పక్కనపెట్టిందని కాంగ్రెస్ విమర్శలకు జవాబు చెప్పడంలో కేంద్ర ప్రభుత్వం లేదు. సుప్రీం తీర్పుతో కేంద్రంలోని ప్రముఖులంతా దిద్దుబాటు చర్యలు తీసుకునేందుకు ఆపసోపాలు పడుతున్నారు. విజిలెన్స్ కమిటీ దర్యాప్తు నివేదిక వచ్చేంతవరకు కేంద్ర ప్రభుత్వ ఉత్తర్వులను పక్కన పెడుతున్నట్టు సుప్రీంకోర్టు ప్రకటించడం గమనార్హం. అలోక్ వర్మ అంశంలో తరువాతి నిర్ణయాలన్నీ సీబీఐ డైరెక్టర్‌ను నియమించే ఉన్నతస్థాయి కమిటీ తీసుకుంటుందని కూడా న్యాయస్థానం ప్రకటించింది. సీబీఐ డైరెక్టర్‌ను నియమించే ఉన్నత స్థాయి కమిటీలో ప్రధాని, ప్రతిపక్ష నేత, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి సభ్యులుగా ఉంటారు. ఈ కమిటీ నిర్ణయం లేకుండా అలోక్ వర్మను నియమించడాన్ని న్యాయస్థానం తప్పుపట్టినట్లయింది. అందుకే భవిష్యత్తు సీబీఐ డైరెక్టర్ ఎంపిక ఈ ముగ్గురితో కూడిన ఉన్నత స్థాయి కమిటీ నిర్ణయించాలని ఆదేశించింది. దీంతో రాజ్యాంగ పరమైన సంస్థల అధిపతులను నియమించడంలో ఒంటెత్తు పోకడలు కూడవని కేంద్రాన్ని హెచ్చరించినట్లయింది. ఈ కమిటీ ముందస్తు అనుమతి లేకుండా అలోక్ వర్మను తొలగిస్తూ కేంద్రం తీసుకున్న నిర్ణయం చెల్లుబాటుకాదని ప్రముఖ న్యాయవాది నారిమన్ వాదించారు.


ఇప్పటికే అనేక తొందరపాటు నిర్ణయాలతో మసకబారిన మోదీ ప్రభుత్వానికి నేటి సుప్రీంకోర్టు తీర్పుతో సంయమనంతో చర్యలు చేపట్టవలసిన అవసరాన్ని నొక్కి చెబుతోంది. పెద్దనోట్ల రద్దు, జీఎస్‌టీ విధానం అమలులను ఎటువంటి సమీక్షలు లేకుండా చేపట్టిన ఫలితం కేంద్రంపై గణనీయంగా పడింది. ప్రజా వ్యతిరేక నిర్ణయాలకు చూపుతున్న వేగిరపాటును ప్రజా సమస్యల పరిష్కారంలో చూపితే మోదీ ఆశిస్తున్నట్టు రెండోసారి కూడా బీజేపీ విజయపథంలో నడిచేది. కానీ, ఇలాంటి తొందరపాటు నిర్ణయాలు తీసుకుని తరువాత నాలిక్కరుచుకోవడం మోదీ ప్రభుత్వానికి అలవాటుగా మారింది. ఒక అడుగు వేసే ముందు ఒకటికి పదిసార్లు ఆలోచించి మరీ అడుగు వేయడం విజ్ఞులు చేసే పని. అలా వ్యవహరించే వారికే భవిష్యత్తు ఉంటుంది. అంతేగానీ, చేతులు కాలిన తరువాత ఆకులు పట్టుకుంటే ఫలితం ఉండదని మోదీ వంటి సీనియర్ రాజకీయ నాయకులకు తెలియని విషయం కాదు. రాజ్యాంగ నిర్మాతల ఆశయాలు, లక్ష్యాలకు వ్యతిరేకంగా పనిచేసే ప్రభుత్వాల మనుగడ తాత్కాలికమేనని మన చరిత్ర చెబుతోంది. అలాంటి నిర్ణయాలు తీసుకున్న ఫలితాన్నే నేడు కాంగ్రెస్ పార్టీ అనుభవిస్తోంది. ప్రజాశ్రేయస్సు కోసం మేమున్నామంటూ ఉత్తర ప్రగల్భాలు పలికే నాయకులు ఇది గ్రహిస్తే ప్రజల ఆశీసులు పొందుతారనడంలో అతిశయోక్తి లేదు.

ఎడిట్ పేజీకి వ్యాసాలు, లేఖలు పంపేవారు పీడీఎఫ్, ఓపెన్ ఫైల్ రెండు ఫార్మాట్‌లలో హామీపత్రాన్ని జతచేస్తూ పంపవలసిందిగా సూచన.

e-mail: manamlekhalu@gmail.com



మంచిమాట



అందరినీ నమ్మడం లేదా ఎవ్వరినీ నమ్మకపోవడం రెండూ ప్రమాదకరమే.

- అబ్రహం లింకన్

వరుస ఎన్నికలతో విద్యార్థుల పరిస్థితి

అగమ్యగోచరం

పలు పాఠశాలల్లో పూర్తిస్థాయిలో సబ్జెక్టు ఉపాధ్యాయులు లేరు. పంచా యతీ, స్థానిక సంస్థల ఎన్నికల విధుల నిర్వహణలో బాధ్యతలు వెరసి పది ఫలితాలకు ప్రతిబంధకంగా మారనున్నాయి. అన్నింటిని అధిగమిస్తేనే సత్ఫలితా లు వచ్చే అవకాశం ఉంది. కానీ ఎలా అన్నదే మెజారిటీ ఉపాధ్యాయుల ప్రశ్న?

విద్యార్థులకు పదవతరగతి అనేది ఒక చక్కని అనుభూతి. ఎందుకంటే మారిన విద్యా విధానం వలన ఒకటి నుండి తొమ్మిదవ తరగతి వరకు ప్రశాంతంగా ,పట్టింపు లేనట్లుగా ఉండే తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పదిలోకి రాగానే ఎక్కువ శ్రద్ధ తీసుకోవడం, వారిని పదే పదే అప్రమత్తం చేస్తూ ప్రాముఖ్యత ఇవ్వడం వలన, అందరి దృష్టి వారిపైన ఉండడం వలన వారు కూడా అదో తరహా అనుభూతికి లోనవుతారు. ఇంకొకటి పది తర్వాత జీవితానికి సంబంధించి ఇంజనీరా లేకా డాక్టరా లేక వేరొకటా అనే నిర్ణయాలు తీసుకోవలసి రావడం వలన పదవ తరగతి అనేది వారి జీవితాల్లో అతి ముఖ్యమైన దశగా చెప్పుకోవచ్చు. కాబట్టి ఉపాధ్యాయులు కూడా వారి పట్ల అంతే బాధ్యతను తీసుకుంటారు. సకాలంలో సిలబస్ మొదలు పెట్టడం, వీలైనంత తొందరలో పూర్తి చేసి మళ్ళీ కొంత భాగం రివిజన్ చేసి వెనకబడ్డ వారిని బాగా చదివిస్తూ పరీక్షలకు తయారు చేస్తారు. ఈ క్రమంలో డిసెంబర్ చివరి నాటికి సిలబస్ ముగించాల్సి ఉంటుంది. కానీ మారిన పరిస్థితుల నేపథ్యంలో ఇపుడు పది ఫలితాల గురించి విద్యార్థులు, వారి తల్లితండ్రులే కాకుండా ఉపాధ్యాయులు కూడా వారి కంటే ఎక్కువ బెంగ పెట్టు కోవడం తప్పని సరైంది. నిజం చెప్పాలంటే ఉపాధ్యాయులకు ఎన్నికల బెంగ పట్టుకుంది.

అడుగడుగునా అడ్డంకులు.. ఆరంభంలోనే ఉపాధ్యాయుల బదిలీలు.. అసెంబ్లీ ఎన్నికలు.. తిరిగి పంచాయతీ ఎన్నికల కోసం ప్రారంభమైన సన్నాహాలు. ఆపై ముంచుకొస్తున్న పదో తరగతి పరీక్షలు.. అందరినీ గందరగోళానికి గురిచేస్తున్నాయి.

మార్చి 16 నుంచి పదో తరగతి పరీక్షలు నిర్వహించాలని ప్రభుత్వం షెడ్యూల్ విడుదల చేయడం, గడువు కేవలం 80 రోజులే ఉన్నప్పటికీ ఇందులో ఆదివారాలు, రెండో శనివారాలు, సంక్రాంతి పండుగల సెలవులు మినహాయిస్తే దాదాపు 60కి మించి పని దినాలు దక్కే అవకాశాలు లేవు, కాబట్టి ఈ లెక్కన సిలబస్ ఎప్పుడు పూర్తవుతుంది? అనే అనుమానం ఇటు ఉపాధ్యాయుల్లో, విద్యార్థులలో కనిపిస్తుంది. సిలబస్ పూర్తి కాకపొతే మరి పరీక్షలకు ఎలా సిద్ధమవుతారనే ఆందోళన తల్లిదండ్రుల్లో కనిపిస్తోంది. రాష్ట్రంలో ఈ మధ్య నెలవారీగా రిటైర్ అవుతున్న ఉపాధ్యాయ స్థానాలు భర్తీ కాకపోవడంతో వాలంటీర్లను ఇచ్చినప్పటికీ నగరాలకు, పట్నాలకు దగ్గరగా ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో చాలా వరకు పరిస్థితి బాగానే ఉన్నా శివారు గ్రామాల్లో, మారుమూల ప్రాంతాల్లో ఉపాధ్యాయుల కొరత వేదిస్తూ ఉండడం వల్ల సకాలంలో సిలబస్ పూర్తి కావడానికి కొంత ఇబ్బందికర పరిస్థితులు ఉన్నాయి.

సిలబస్ పూర్తి కాకపోవడానికి కారణాలు : కర్ణుడి చావుకి కారణాలనేకమన్నట్లు పదో తరగతి సిలబస్ పూర్తి కాకపోవడానికి పలు కారణాలు కనిపిస్తున్నాయి. ఉపాధ్యాయుల కొరత, ఉన్న వారిలో కొందరు పదేపదే సెలవులు పెట్టడం, మరికొందరు సంఘాల నాయకత్వాల పేరుతో విధులను విస్మరిస్తుండడం ,కీలకమైన స్కూల్ అసిస్టెంటు పోస్టులు భారీగా ఖాళీగా ఉండడం కూడా సమస్యగా మారింది. ఈ ఏడు మాసాల కాలంలో దాదాపు 1000 మంది పైగా టీచర్లు ఉద్యోగ విరమణ చేసినట్లు గణాంకాల ద్వారా తెలుస్తోంది. అయితే గతేడాది వరకు హైస్కూళ్లలో టీచర్ల పోస్టులు ఖాళీగా ఉంటే, సంబంధిత విద్యా కమిటీ ఆమోదం మేరకు అర్హులైన వారిని విద్యా వలంటీర్లుగా నియమించుకునేవారు. అయితే వారు కూడా పెద్ద నగరాల్లో అయితే దొరుకుతారు కానీ పల్లెటూళ్ళలో సరిగా అందుబాటులో ఉండరు. దీంతో టీచర్ల కొరత బోధనపై తీవ్ర ప్రభావం చూపుతుంది. వీటన్నింటి ప్రభావంతో పదో తరగతి సిలబస్ పూర్తి కాని విషయం స్పష్టమవుతోంది.

లక్ష్యం బారెడు.. సమయం మూరెడు..: పదో తరగతి విద్యార్థుల లక్ష్యం గొప్పదిగా ఉండగా పరీక్షలకు సన్నద్ధమయ్యేందుకు వారికి ఉన్న సమయం మాత్రం చాలా తక్కువ ఉండడం. ఉపాధ్యాయులకు పెద్ద పరీక్షగా మిగిలిపోయింది. ఈ విద్యా సంవత్సరం ఆరంభమైనప్పటి నుంచి విద్యాబోధనకు అవాంతరాలు తలెత్తుతున్నాయనటంలో అతిశయోక్తి లేదు. వేసవి సెలవులు పూర్తయి పాఠశాలలు పునఃప్రారంభం కాగానే ఉపాధ్యాయులు బడిబాట కార్యక్రమంలో నిమగ్నమయ్యారు. బడిబాట కొనసాగుతుండగానే ఉపాధ్యాయుల బదిలీల సందడి నెలకొంది. బదిలీ ప్రక్రియ జూలై 15వ తేదీ వరకు కొనసాగింది. దీనితో నెలన్నర పాటు సమయం వృథాగా పోయింది. కొద్ది రోజులు తరగతులు నడిచాయో లేదో అసెంబ్లీ ఎన్నికల హడావుడి మొదలయ్యింది. ఎన్నికల ప్రక్రియ, ఎన్నికల విధులతో దాదాపు నెల రోజుల సమయం ఇలానే గడిచిపోయింది. పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాల నమోదుకు పాఠశాలల్లో చివరి మూడు మాసాల్లో ప్రత్యేక కార్యాచరణ అమలయ్యేది. ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహించడం, వెనకబడ్డ విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించడం లాంటి కార్యక్రమాలు చేపట్టడం వల్ల విద్యార్థులకు చక్కని తర్ఫీదు ఇచ్చి వారిలో ఆత్మస్థైర్యాన్ని నింపి పరీక్షలకు బాగా తయారయ్యేవారు. కానీ ఈసారి అంట సమయం లేదు ,కొన్నిచోట్ల ఏదో మొక్కుబడిగా సిలబస్ కానిచ్చేస్తున్నారు. దీని ప్రభావం విద్యార్థుల ఫలితంపై ఉంటుందనేది నిర్వివాదాంశం.

ముందస్తు ప్రభావం : రాజకీయ ఇతరేతర కారణాలతో అధికార పక్షం సెప్టెంబర్ నెలలో అసెంబ్లీ రద్దు అయ్యేవరకు పాఠశాలలు సక్రమంగా జరిగి ఆ నెల వరకు సిలబస్ దాదాపు పూర్తి చేయగలిగి నప్పటికీ ఎప్పుడైతే అసెంబ్లీ రద్దు ప్రకటన వచ్చిందో దాని ప్రభావం ఉపాధ్యాయులతో పాటు అన్ని వర్గాల మీద పడడం వలన విద్యార్థుల మీద చాల ఎక్కువగా పడింది. ఎంత వద్దనుకున్నా పాఠశాలల్లో ఎన్నికల వాతావరణం రావడం ఒకింత గందరగోళానికి దారి తీసింది. మామూలుగా ఏప్రిలు నెలలో రావాల్సిన ఎన్నికలు డిసెంబర్‌లో రావడం, నవంబర్, డిసెంబర్ ఉపాధ్యాయులకు సంబంధించి కీలకం కావడంతో ఈ విద్యా సంవత్సరం గవర్నమెంట్ ఉపాధ్యాయులకు పరీక్ష కాలమని చెప్పొచ్చు. ఒకవైపు సిలబస్ పూర్తికాకపోవడం, రెండో వైపు ఎన్నికలు. ఎన్నికల కోసం ప్రభుత్వ ఉపాధ్యాయులకు కేటాయించిన ఎన్నికల విధులు విద్యార్థులకు శాపంగా మారుతోంది. విద్యార్థులకు చదువు చెప్పడం అట్లుంచితే.. ఎన్నికల విధులతో సతమతమవుతున్నారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో కొన్ని రోజుల పాటు పాఠశాలలకు రాకుండా ఉపాధ్యాయులు ఎన్నికల విధుల్లో ఉండిపోవడం, వలన విద్యార్థులు నాణ్యమైన విద్యకు దూరం కావాల్సిన



పరిస్థితులు ఏర్పడడం అందరికీ తెలిసిన విషయమే. ఎన్నికల ముచ్చట్లు, శిక్షణలు, విధులు, గెలుపు, ఓటములు ఇవన్నీ అయిపోయేసరికి చూస్తుండగానే రెండు నెలలు పూర్తి అయినాయి. సరే జరిగిందేదో జరిగింది ఇప్పటికైనా శ్రద్ధ పెడదాం అనుకునేటంతలో అనుకోని శరాఘాతంలా కోర్టు తీర్పుతో వరుసగా గ్రామ పంచాయతీ, సహకార, ఎమ్మెల్సీ ఎన్నికలు జరగనున్నాయి. ఈ ఎన్నికల వల్ల విద్యార్థులకు మరింత నష్టం జరిగే పరిస్థితి కనిపిస్తోంది. గ్రామ పంచాయతీ ఎన్నికలలో ఎన్నికల విధులకు కావాల్సిన ఉద్యోగుల సంఖ్య కన్నా తక్కువ ఉపాధ్యాయులు అందుబాటులో ఉండడం చేత దాదాపు ప్రతీ ఉపాధ్యాయుడికి ఎన్నికల విధులు తప్పవు. ఒకవైపు పంచాయతీలకు ప్రత్యేక అధికారులుగా మరోవైపు ఎన్నికల్లో ఎన్నికల అధికారులుగా విధులు నిర్వహిస్తున్న నేపథ్యంలో విద్యార్థులకు విద్యను బోధించేందుకు వీలు లేకుండా పోతుంది. నిజం చెప్పాలంటే పాఠశాలల్లో ఎన్నికల వాతావరణం ఏర్పడుతుంది. ముఖ్యంగా గ్రామ పంచాయతీ ఎన్నికలలో విధులు కొంచెం కత్తిమీద సామే ఎందుకంటే ఏమాత్రం తేడా వచ్చినా చాలా ఇబ్బందులు ఎదుర్కోక తప్పదు. కాబట్టి ఎంత కాదనుకున్న మనసుని దాని నుంచి చదువు మీదకు లగ్నం చేయడం ఉపాధ్యాయులకు ఒకింత విషమ పరీక్షే. గ్రామ పంచాయతీ ఎన్నికలు పూర్తి అయ్యేనాటికి పుణ్య కాలం గడిచి ఫిబ్రవరి మొదటి వారంలో పడతాం.

ఎన్నికల విధుల్లో ఉపాధ్యాయులు..: గ్రామపంచాయతీ ఎన్నికలకు సంబంధించి రాష్ట్ర ఎన్నికల సంఘం నోటిఫికేషన్ విడుదల చేసి ఎన్నికలకు ఏర్పాట్లు చేస్తోంది. గ్రామపంచాయతీ ఎన్నికలకు ఆర్‌ఓలు, ఏఆర్‌ఓలుగా గెజిటెడ్ అధికారులను నియమించాలి. కానీ గెజిటెడ్ అధికారులు ఎక్కువగా లేకపోవడంతో స్కూల్ అసిస్టెంట్లను నియమించారు. ఆర్‌ఓ, ఏఆర్‌ఓలతో పాటు, ఇతర పోలింగ్ సిబ్బందిగా ఏదో రకమైన విధులను ఉపాధ్యాయులు నిర్వహించాల్సి వస్తోంది. గ్రామ పంచాయతీ ఎన్నికల్లో ఉపాధ్యాయులు నిమగ్నమవడంతో ప్రభుత్వ పాఠశాలల విద్య అటకెక్కిందని చెప్పవచ్చు మూడు నాలుగు గ్రామపంచాయతీలకు కలిపి ఒక క్లస్టర్ చేసి ఆర్‌ఓ, ఏఆర్‌ఓలను నియమిస్తారు. వీళ్లు స్టేజ్-1లో గ్రామ పంచాయతీ ఎన్నికల నోటిఫికేషన్ నుంచి మొదలు నామినేషన్లు స్వీకరణ, పరిశీలన, విత్‌డ్రా, అభ్యర్థులకు గుర్తుల కేటాయింపు పనులు చేయాలి. స్టేజీ-2లో ఆర్వోలు ఎన్నికల పోలింగ్, ఓట్లు లెక్కింపు, విజేతల ప్రకటన, ఉపసర్పంచ్ నియామకం వంటి పనులు చేయాలి. ఇతర సిబ్బంది పోలింగ్ కేంద్రాల్లో విధులు నిర్వహించాల్సి ఉంటుంది. ఎన్నికల విధుల్లో పాల్గొనే అధికారులకు శిక్షణ, విధుల నిర్వహణ వంటి పనుల కోసం శిక్షణ కార్యక్రమాలు ఉంటాయి. ఇన్ని రోజులు బోధనా పనిదినాలు విద్యార్థులు నష్టపోతే, అది విద్యార్థుల సిలబస్ పూర్తిచేయడంపై, వారిని పరీక్షకు తయారు చేయడంపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉంటుంది. పంచాయతీ ఎన్నికల సన్నా హాలు మొదలు కావడం. మరోవైపు మార్చి 16 నుంచి పదో తరగతి పరీక్షలు. ఫిబ్రవరిలో ప్రీ ఫైనల్ పరీక్షల నిర్వహణ కోసం విద్యాశాఖ సన్నద్ధమవడం ఉపాధ్యాయలోకాన్ని తీవ్ర గందరగోళంలో నెట్టి వేయబడుతున్నది. ఖచ్చితంగా పంచాయతీ ఎన్నికల్లో ఉపాధ్యాయులు పనిచేయాల్సి ఉంటుంది. దీంతో విద్యార్థుల చదువులు ఎలా గాడిన పెట్టాలో అర్థం కావడం లేదని చాలా మంది ఉపాధ్యాయులు వాపోతున్నారు.

సవాళ్లను అధిగమిస్తేనే సత్ఫలితాలు...: ఈ ఏడాది ఉపాధ్యాయ బదిలీలు. విద్యా వాలంటీర్ల నియామక ప్రక్రియ. అసెంబ్లీ, పంచాయతీ స్థానిక సంస్థల ఎన్నికల విధులు పలు పాఠశాలలో ఉద్యోగ విరమణ తర్వాత ఏర్పడిన ఖాళీలు పదో తరగతి ఫలితాలపై ప్రభావం చూపనున్నాయి. విద్యార్థుల సంఖ్య ప్రకారం అత్యంత ఆవశ్యకం ఉన్న పాఠశాలల్లో వాలంటర్లను సర్దుబాటు చేశారు. డిసెంబర్ నెలాఖరులోగా సిలబస్ పూర్తి చేయడం చాలా ప్రశ్నార్థకంగా మారింది. ఎన్నికల నిర్వహణ విధుల్లో ఉపాధ్యాయులదే ప్రధాన పాత్ర. ఎన్నికల ప్రకటన వెలువడినప్పటి నుంచి ఆ ప్రభావం బోధన పై పడింది. ఎక్కువ మంది ఎన్నికల విధులలో ఉంటే మిగిలిన కొంత మంది పిల్లల్ని కంట్రోల్ చేస్తూ అధికారులకు ఎప్పటికప్పుడు కావాల్సిన సమాచారం ఇవ్వడం తోటే సరిపోతుంది. ఇక పిల్లలకు పాఠాలు చెప్పాలని అనుకున్నా చెప్పలేని పరిస్థితి. శాసనసభ ఎన్నికల ప్రక్రియ ముగియడంతో పదో తరగతి విద్యార్థుల సన్నద్ధత పై ఉపాధ్యాయుల బాధ్యత పెరిగింది. పలు పాఠశాలల్లో పూర్తిస్థాయిలో సబ్జెక్టు ఉపాధ్యాయులు లేరు. పంచాయతీ, స్థానిక సంస్థల ఎన్నికల విధుల నిర్వహణలో బాధ్యతలు వెరసి పది ఫలితాలకు ప్రతిబంధకంగా మారనున్నాయి. అన్నింటిని అధిగమిస్తేనే సత్ఫలితాలు వచ్చే అవకాశం ఉంది. కానీ ఎలా అన్నదే మెజారిటీ ఉపాధ్యాయుల ప్రశ్న?

కాలంరాజు వేణుగోపాల్
8106204412


ఓటు సద్వినియోగమే ప్రజా శ్రేయస్సు

ఎన్నికలు ప్రజాస్వామ్యానికి ఆయువుపట్టు. ప్రజాస్వామ్యం ప్రజల చేతుల్లోనే ఉంటుంది. విజయవంతమైన లేదా విజయవంతం కాని ప్రజాస్వామ్య వ్యవస్థలను మనం గమనిస్తే ఎన్నికలు శిఖరంపైన అయినా కూర్చోని పెట్టగలవు లేదా మరణ శాసనం అయినా రాయగలవు. ప్రజాస్వామ్య ప్రక్రియలో ప్రజలు చురుగ్గా పాల్గొంటే ప్రజాస్వామ్య వ్యవస్థ విజయవంతమవుతుంది. ప్రజలు ఎన్నికల్లో పాల్గొనకపోతే ప్రజాస్వామ్య వ్యవస్థ సంక్షోభానికి దారి తీస్తుంది. ఓటుకు ఉన్న బలం, ఓటరుపై ప్రేమ నాయకులకు ఎన్నికల సమయంలోనే గుర్తుకొస్తుంది. కానీ ఆ నాయకుల తలరాతను మార్చే ఓటు అస్త్రం ఓటరు చేతుల్లోనే ఉంటుంది. ఓటరు వేసే ఓటును కుల మత వర్గాలకు భిన్నంగా వేయాలి. నిస్వార్థమైన నేతలను ఎన్నుకోవాలి.

ప్రతి ఒక్కరు ఓటు హక్కును సద్వినియోగం చేసుకొని ప్రజల అభివృద్ధి కోసం, దేశ అభివృద్ధి కోసం పాటుపడే వారిని ఎన్నుకోవాలి. అలా ప్రతి ఒక్కరు ఓటు హక్కును వినియోగించుకున్న నాడే దేశం వృద్ధి చెందుతుంది. కాబట్టి నేటి యువత సమాజ అభివృద్ధికి నడుం బిగించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. సమాజ సేవే లక్ష్యంగా పేదలకు న్యాయం చేస్తారనే భావన కలిగిన మంచి నాయకులను ఎన్నుకోవడం కేవలం ఓటు ద్వారా సాధ్యమవుతుంది. విద్యార్థులు, యువత ఓటు హక్కును న్యాయబద్ధంగా వేసేలా ప్రతిన పూని నేటి రాజకీయాలను మార్చాల్సిన సమయం ఆసన్నమైంది. నేటి తరం రాజకీయాలు స్వార్థపూరితంగా తయారయ్యాయి. నాయకులు, ప్రజాప్రతినిధులు దేశాభివృద్ధికి కాకుండా సొంత ప్రయోజనాల కోసమే రాజకీయాలు వాడుకుంటున్నారు. అందువల్ల దేశాభివృద్ధి వెనకబడిపోతుంది.

మంచి నాయకులను ఎన్నుకుంటే మంచి సమాజం ఏర్పడుతుంది. ఓటు హక్కు గల ప్రతి ఒక్కరూ వినియోగించుకొని నిజాయితీగల నేతలని ఎంపిక చేసుకోవాలి. ప్రజలకు సేవచేసే నాయకుడిని ఎన్నుకోవడం ద్వారా మాత్రమే సమాజ అభివృద్ధి జరుగుతుంది. నేటి నాయకులకు తన స్వార్థ ప్రయోజనాలు తప్ప దేశ ప్రయోజనాలు పట్టడం లేదు. నేటి రాజకీయాలలో వారసత్వ రాజకీయాలు నడుస్తున్నాయి. రాజకీయాలలో వారసులు కాకుండ సమాజ సేవకు పాటుపడే వారిని ఎన్నుకోవాలి. అప్పుడే అన్ని వర్గాల ప్రజలకు సమన్యాయం పెరుగుతుంది. పూర్తిస్థాయిలో పేదవాడికి న్యాయం జరుగుతుంది.

నేటి యువత ఓటు హక్కు నమోదు చేసుకోవడంలో అలసత్వం వహిస్తోంది. పూర్తిస్థాయిలో ఓటరు నమోదు కావటం లేదు. అందువల్ల అత్యధిక శాతం మంది ఓటు హక్కును కోల్పోతున్నారు. తద్వారా సేవా తత్పరత కలిగిన నాయకులు ఎన్నిక కావడం లేదు. ఓటు హక్కు నమోదు చేసుకోవడంలో విద్యార్థులు, యువత వెనుకంజలో ఉన్నారు. ఇప్పటికైనా అర్హులు అందరూ ఓటరుగా నమోదు కావాలి. 100 శాతం నమోదు చేయాలి. విద్యార్థులును చైతన్య పరచి ఓటర్లును నమోదు చేయించటం మన అందరి బాధ్యత. ఓటరుగా నమోదు కాని వ్యక్తి జీవం లేని వ్యక్తితో సమానం. అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటు హక్కును పొంది



దేశాన్ని అభివృద్ధి చేసే నాయకుడును ఎన్నుకుంటే అప్పుడు దేశం అభివృద్ధి పథంలో నడుస్తుంది. నేటి యువత ఓటు వినియోగం, నమోదుపై నిర్లక్ష్యం చేసి ఓటు నమోదు చేసుకోవడం లేదు. దానివల్ల అవగాహన లేని ఓటర్ల కారణంగా సేవ చేసే నాయకులు బదులు స్వార్థపూరితమైన రాజకీయ నాయకులు ఎన్నికకాబడుతున్నారు. కాబట్టి విద్యార్థులలో యువతలో చైతన్యం వహించి ఓటరుగా నమోదు కావాలి. ఓటును వినియోగించుకోవాలి.

రాజకీయ నాయకుల ప్రలోభాలకు గురికాకుండా ప్రజలు తమ విలువైన ఓటును వినియోగించుకోవాలి. ఓటుకు నోటు ద్వారా అటు ప్రజల భవిష్యత్తు, ఇటు దేశ భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారుతోంది. కావున దేశం కోసం కృషి చేయాలనే తపన, పేదలకు సేవ చేయాలన్న ఆలోచన కలిగిన నాయకులను నిజాయితీగా గెలిపించుకోవడం ద్వారా ప్రజలందరూ సంతోషంగా జీవించగలరు.


అర్హత కల్గిన ప్రతి ఒక్కరూ ఓటుహక్కు పొందటమే కాదు, ఓటు ప్రాధాన్యతను తెల్సుకోవాలి. ఎన్నికల సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకొని ప్రజాసేవకు అంకితమయ్యే నాయకులనే ఎన్నుకోవాలి. అప్పుడే సుపరిపాలన సాధ్యమవుతుంది. అది ఒక్క ఓటుతోనే సాధ్యమవుతుంది.

ప్రజాస్వామ్య పరిరక్షణ కొరకు, రాజకీయ ప్రక్రియలో యువకులు భాగస్వామ్యం పెంచేందుకు వీలుగా ప్రతి సంవత్సరం జనవరి 25న జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని నిర్వహించాలని కేంద్ర ప్రభుత్వం 2011 సంవత్సరంలో నిర్ణయించి అప్పటి నుంచి ప్రతి ఏటా జాతీయ ఓటర్ల దినోత్సవం జరుపుతూవుంది. ఈ సందర్భంగా 18 సంవత్సరాలు దాటిన యువతీ యువకులను గుర్తించడం, వారినందరినీ ఓటర్లుగా నమోదు చేయించి, ప్రతి ఏటా పేర్లు నమోదు చేసుకున్న ఓటర్లకు జనవరి 25 నాటికి ఫోటో గుర్తింపు కార్డులిచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. 1950 జనవరి 25వ తేదీన భారత ఎన్నికల సంఘాన్ని ఏర్పాటు చేయడం జరిగింది. దీన్ని గుర్తుకు తెచ్చేలా, ఓటు హక్కు విలువను చాటి చెప్పేలా ఈ జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు.జాతీయ ఓటర్ల దినోత్సవం జనవరి 25న ప్రతి సంవత్సరం అనేక కార్యక్రమాలు స్థానిక అధికారులచే నిర్వహిస్తారు. ఓటరుగా బాధ్యత నిర్వహించుటకే ఓటరు గుర్తింపు కార్డుల పంపిణీ, ఓటు హక్కును వినియోగించుకొని ప్రజాస్వామ్యాన్ని పటిష్టపర్చాలని పిలుపునివ్వడం, అదే రోజు ఓటర్ల దినోత్సవ వేడుకల్లో కొత్తగా నమోదైన ఓటర్లను సన్మానించడం, ఓటర్ల దినోత్సవం రోజున

భారత దేశ పౌరుడు అయిన నేను ప్రజాస్వామ్యంపై విశ్వాసంతో, మన దేశ ప్రజాస్వామ్య సాంప్రదాయాలను, స్వేచ్ఛాయుత, నిష్పక్షపాత, ప్రశాంత ఎన్నికల ప్రభావాన్ని నిలబెడుతానని, మతం, జాతి, ప్రాంతం, కులం, వర్గం, భాష లేదా ఎటువంటి వత్తిడికి లోనుకాకుండా ప్రతీ ఎన్నికల్లో నిర్భయంగా ఓటు వేస్తానని ఓటర్ల చేత ప్రతిజ్ఞ చేయిస్తారు, ఈ విధంగా ప్రజాస్వామ్య పటిష్టతకు కృషి చేసేలా పిలుపునిస్తారు. విద్యార్థులను ఓటర్లుగా నమోదు చేయించేందుకు వారిలో స్ఫూర్తిని కలిగించే విధంగా ప్రతి కళాశాలలోనూ విద్యార్థులకు ఓటరుగా నమోదు, ఓటు హక్కు విలువ, ప్రజాస్వామ్య పరిరక్షణ వంటి అంశాలతో కూడిన పలు పోటీలు నిర్వహిస్తారు. ఇందులో భాగంగా విద్యార్థులకు వ్యాస రచన, చిత్రలేఖనం, వక్తృత్వ పోటీలు నిర్వహించి ప్రతిభావంతులకు 25వ తేదీన జాతీయ ఓటర్ల దినోత్సవ సందర్భంగా ప్రశంసా పత్రాలు, నగదు బహుమతులు అందజేస్తారు. అంతేకాకుండా, ఓటరుగా ఉన్నందుకు గర్వపడుతున్నా- ఓటు వేయడానికి సిద్ధంగా ఉన్నా అనే నినాదంతో బాడ్జీలను కూడా అందజేస్తారు.

ఓటు వేసే హక్కు, ఎన్నుకునే హక్కు, ఎన్నికయ్యే హక్కు అందరూ కలిగి ఉంటారు. దీన్ని పరిరక్షించే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉంది. కాబట్టి ఓటు హక్కును సద్వినియోగపరచుకొని సమాజ శ్రేయస్సుకు పాటుపడాలి.

వాసిలి సురేష్
9494615360



పౌరసత్వ బిల్లుకు ఓకే

- ఆమోదించిన లోక్‌సభ
- విపక్షాల తీవ్ర వ్యతిరేకత
- సభ నుంచి కాంగ్రెస్ వాకౌట్

న్యూఢిల్లీ, జనవరి 8: పాకిస్థాన్, బంగ్లాదేశ్, అఫ్ఘానిస్థాన్ దేశాలకు చెందిన ముస్లిమేతరులకు భారత పౌరసత్వం కల్పించేందుకు ఉద్దేశించిన పౌరసత్వ ముసాయిదా బిల్లును లోక్‌సభ మంగళవారం ఆమోదించింది. కాంగ్రెస్, వామపక్షాల తీవ్ర వ్యతిరేకత నడుమ ఈ బిల్లును సభ ఆమోదించింది. బిల్లును సెలెక్ట్ కమిటీకి పంపనందుకు నిరసనగా సభ నుంచి కాంగ్రెస్ వాకౌట్ చేసింది. కాగా, ఈ బిల్లును ముఖ్యంగా ఈశాన్య రాష్ట్రాలకు చెందిన పార్టీలు.. బీజేపీ మిత్రపక్షాలు కూడా ఈ బిల్లును తప్పుబట్టాయి. ఇది రాజ్యాంగంలోని ప్రాథమిక అంశాలకు విరుద్ధమైన బిల్లు అని వాదించాయి. అసోంల ఈ బిల్లుకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున ఆందోళనలు జరుగుతున్నాయి. బీజేపీ మిత్రపక్షంగా ఉన్న అసోం గణ పరిషద్ కూడా బిల్లును వ్యతిరేకిస్తూ కమలానికి దూరం జరిగింది. ఈ బిల్లును హోంమంత్రి రాజ్‌నాథ్ సింగ్ సభలో ప్రవేశపెట్టగానే కాంగ్రెస్ వాకౌట్ చేసింది. ఈ బిల్లు విభజనకు, హింసకు కారణమవుతుందని తృణమూల్ కాంగ్రెస్ వాదించింది. ముస్లింలు కాకుండా ఆరు ఇతర మతాల వాళ్లకు భారత పౌరసత్వం ఇవ్వాలన్నది ఈ బిల్లు ప్రధాన ఉద్దేశం. అయితే దేశంలో ఎవరు ఆశ్రయం కోరినా ఇవ్వాలని, ఇందులో ముస్లింలను కూడా చేర్చాలని టీఎంసీ డిమాండ్ చేసింది. బిల్లును ప్రవేశపెట్టిన సందర్భంగా రాజ్‌నాథ్ సింగ్ మాట్లాడుతూ.. అసోంతో పాటు ఈశాన్య రాష్ట్రాల్లో పౌరసత్వ బిల్లుపై తప్పుడు వార్తలను ప్రచారం చేస్తున్నారని అన్నారు. అక్రమ వలసదారుల వల్ల ఆ రాష్ట్రం ఎదుర్కొంటున్న సమస్యలు తమకు తెలుసు అని, పౌరసత్వ బిల్లుతో ఎవరూ వివక్షకు గురికారు అని రాజ్‌నాథ్ తెలిపారు. పౌరసత్వ బిల్లును సవరించేందుకు దేశవ్యాప్తంగా ఎన్జీవోలు, ఇతర సంస్థలు సర్వేలు నిర్వహించినట్లు మంత్రి తెలిపారు. అయితే బిల్లును సెలెక్ట్ కమిటీకి పంపాలని కాంగ్రెస్ పక్ష నేత మల్లిఖార్జున్ ఖర్గే డిమాండ్ చేశారు. ప్రభుత్వం అంగీకరించకపోవడంతో.. కాంగ్రెస్ పార్టీ సభ నుంచి వాకౌట్ చేసింది. మరోవైపు ఈ బిల్లును వ్యతిరేకిస్తూ ఇప్పటికే ఈశాన్య రాష్ట్రాలు భగ్గుమంటున్నాయి.



నార్వే ప్రధానితో మోదీ చర్చలు

- భారత పర్యటనలో ఉన్న సోల్‌బర్గ్

న్యూఢిల్లీ, జనవరి 8: నార్వే ప్రధాని ఎర్న్ సోల్‌బర్గ్‌తో ప్రధాని నరేంద్ర మోదీ ద్వైపాక్షిక చర్చలు జరిపారు. భారత పర్యటనలో భాగంగా సోమవారం న్యూఢిల్లీ చేరుకున్న సోల్‌బర్గ్‌కు మంగళవారం ఉదయం రాష్ట్రపతి భవన్‌లో సాదర స్వాగతం లభించింది. సుస్థిర అభివృద్ధి, ద్వైపాక్షిక సంబంధాల పునరుద్ధరణకు సరికొత్త దిశానిర్దేశం చేసే రీతిలో వీరిద్దరి మధ్య కీలక భేటీ జరిగింది. తమ మధ్య సాగిన చర్చలు సఫలవంతమైనట్టు, ఇరు దేశాల మధ్య ఏఏ అంశాలపై సమన్వయం జరగాల్సి ఉందో విశ్లేషించినట్టు మోదీ తెలిపారు. ఐక్యరాజ్య సమితి భద్రతా మండలిలో భారత్‌కు శాశ్వత సభ్యత్వం కల్పించే విషయం మొదలు పలు అంశాలపై ఇరు దేశాలు అంతర్జాతీయ వేదికపై సన్నిహితంగా మెలుగుతున్నాయి. విదేశాంగ మంత్రి సుష్మా స్వరాజ్ కూడా నార్వే ప్రధానితో భేటీ అయ్యారు.

చైనాలో భారత రాయబారిగా విక్రం మిశ్రీ



బీజింగ్, జనవరి 8: చైనాలో భారత రాయబారిగా ఇండియన్ ఫారిన్ సర్వీస్ అధికారి విక్రం మిశ్రీ బాధ్యతలు చేపట్టారు. అంతకుముందు మయాన్మార్‌లో విక్రం రాయబారిగా పనిచేశారు. సోమవారం బాధ్యతలు చేపట్టిన అనంతరం చైనా అధికారులతో ఇండో–సైనా అంశాలపై విక్రం చర్చలు నిర్వహించారు. ఈమేరకు ఇక్కడి ఇండియన్ ఎంబసీ ట్వీట్ చేసింది. భారత్–చైనాల మధ్య విభేదాలు తారాస్థాయికి చేరిన ప్రస్తుత పరిస్థితుల్లో 54 ఏళ్ల విక్రం కీలక పదవి చేపట్టడంతో అందరి కళ్లు ఇప్పుడు ఈయన మీదే ఉన్నాయి. శ్రీనగర్‌లో పుట్టి, గ్వాలియర్, ఢిల్లీ, జెంషెడ్‌పూర్‌లో విద్యాభ్యాసం పూర్తి చేసిన విక్రం.. 1989 బ్యాచ్ ఐఎఫ్ఎస్ ఆఫీసర్‌గా ప్రధాని కార్యాలయంతో పాటు విదేశాంగ శాఖ ప్రధాన కార్యాలయంలోనూ పలు హోదాల్లో సేవలందించారు. యూరప్, ఆఫ్రికా, ఆసియా, ఉత్తర అమెరికాల్లో మనదేశం చేపట్టిన పలు మిషన్లలో ఈయన పనిచేశారు. గతేడాది నవంబరులో పదవీ విరమణ చేసిన గౌతం బంబావాలే స్థానంలో విక్రం నియమితులయ్యారు.

నేడు అయోధ్యపై సుప్రీం విచారణ

న్యూఢిల్లీ, జనవరి 8: అయోధ్య వివాదంపై సుప్రీంకోర్టు ఐదుగురు జడ్జీలతో కూడిన రాజ్యాంగ ధర్మాసనం గురువారం విచారణ జరపనుంది. అయోధ్యలో వివాదాస్పద 2.7 ఎకరాల భూమిపై సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ రంజన్ గగోయ్ నేతృత్వంలోని ధర్మాసనం పిటిషన్‌ను విచారించనుంది. అయోధ్య రామ మందిరం– బాబ్రీ మసీదు కేసును విచారణకు స్వీకరించాలా? వద్దా? అనే అంశంపై కోర్టు నిర్ణయం తీసుకోనుంది.

సైన్యంలో 15శాతానికి మహిళలు

- లోక్‌సభలో కిరణ్ రిజిజు ప్రకటన

న్యూఢిల్లీ, జనవరి 8: సీఆర్‌పీఎఫ్, సీఐఎస్ఎఫ్‌లో మహిళల ప్రాతినిధ్యం 15 శాతానికి పెంచనున్నట్టు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి కిరణ్ రిజిజు లోక్‌సభలో ప్రకటన చేశారు. పారామిలిటరీ బలగాల్లో మహిళా ఉద్యోగుల సంఖ్య క్రమంగా పెరగనున్నట్టు రిజిజు వివరించారు. ఇందులో భాగంగా బీఎస్ఎఫ్, ఐటీబీపీ, ఎస్ఎస్‌బీల్లో 5శాతం మేర మహిళల ప్రాతినిధ్యం పెంచేలా కేంద్ర ప్రభుత్వం కృషిచేస్తోందన్నారు. మహిళా సాధికారతకు ఊతమిచ్చేలా పార్లమెంటరీ కమిటీ 6వ నివేదికలో చేసిన సూచనల మేరకు ఈ మార్పులు చేసేందుకు అనుగుణంగా ఆదేశాలు జారీచేసినట్టు లోక్‌సభ ప్రశ్నోత్తరాల్లో వెల్లడించారు.

10 శాతం కోటాకు ఓకే

- అగ్రకులాల్లోని పేదలకు 10 శాతం రిజర్వేషన్లు
- వాడివేడి చర్చ అనంతరం ఆమోదించిన లోక్‌సభ



న్యూఢిల్లీ, జనవరి 8: అగ్రకులాల్లోని పేదలకు 10 శాతం రిజర్వేషన్ల బిల్లును వాడివేడి చర్చ అనంతరం లోక్‌సభ మంగళవారం ఆమోదించింది. 124వ రాజ్యాంగ సవరణ బిల్లును మంగళవారం కేంద్ర మంత్రి థావర్ చంద్ గెహ్లాట్ లోక్‌సభలో ప్రవేశపెట్టారు. అగ్ర వర్ణ పేదలకు పది శాతం రిజర్వేషన్లు ఇవ్వాలన్న ప్రతిపాదనకు సోమవారమే కేంద్ర కేబినెట్ ఆమోదం తెలుపగా.. మంగళవారం బిల్లును మంత్రి తాపర్ చంద్ గెహ్లాట్ లోక్‌సభలో ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..వెనుకబడిన వర్గాలకు న్యాయం చేయడానికే ఈ బిల్లును తీసుకొచ్చినట్లు ఈ సందర్భంగా గెహ్లాట్ స్పష్టం చేశారు. అగ్రవర్ణ పేదలకు న్యాయం చేయడానికి చాలా కాలంగా ప్రయత్నాలు జరుగుతున్నాయని, రిజర్వేషన్లు కాకుండా వేర్వేరు మార్గాల్లో వారికి ఊరట కలిగించే ప్రయత్నాలు కూడా జరిగాయన్నారు. ఆర్థిక స్థోమత లేక, రిజర్వేషన్ల పరిధిలోకి రాక చాలా ఇబ్బందులు పడుతున్నారని, సామాజిక సమానత్వం కోసమే ఈ చారిత్రక నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. సబ్‌కా సాత్.. సబ్‌కా వికాస్ నినాదాన్ని పరిపూర్ణం చేయడానికే.. ఈ రిజర్వేషన్ల రాజ్యాంగ సవరణ బిల్లు ప్రవేశపెట్టామన్నారు. రాజ్యాంగంలోని అధికరణం 15, 16లను సవరణలను ప్రతిపాదిస్తూ బిల్లును తీసుకొచ్చామన్నారు. ఇప్పటికే జరిగిన రాజ్యాంగ సవరణలు ప్రభుత్వానికి కొంత వెసులుబాటు కలిగించాయన్నారు.



రాష్ట్రాల అనుమతి అక్కర్లేదు: జైట్లీ

ఈబీసీ కోటా బిల్లుపై చర్చ సందర్భంగా కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ మాట్లాడుతూ.. దీనికి రాష్ట్రాల అనుమతి అవసరం లేదని తేల్చి చెప్పారు. 50 శాతం పరిమితి అనేది కేవలం కుల రిజర్వేషన్లకే అని ఆయన తేల్చి చెప్పారు. సుప్రీం కోర్టు తీర్పును ప్రస్తావిస్తూ.. వెనుకబాటుతనానికి కులమే అత్యుత్తమ ప్రాతిపదిక అని అన్నారు. అలాగే 50 శాతం రిజర్వేషన్ పరిమితి అన్నది ఆర్టికల్ 16 (4) ప్రకారం నిర్ణయించారని చెప్పారు. అందుకే తాము ఆర్టికల్ 15, 16 ఆర్టికల్స్‌కు సవరణ చేసి ఆర్థిక పరమైన రిజర్వేషన్లకు న్యాయపరమైన అడ్డంకులు లేకుండా చూస్తామని తెలిపారు. ప్రతి పార్టీ తన ఎన్నికల మేనిఫెస్టోలో అగ్రవర్ణ పేదలకు రిజర్వేషన్లు కల్పిస్తామని చెప్పిందని, కానీ అవన్నీ చట్టం వెనుక దాక్కున్నాయని జైట్లీ అన్నారు. ఈ అంశంలో రాజకీయాలకు అతీతంగా ఆలోచించాల్సిన అవసరం ఉన్నదని ఆయన స్పష్టం చేశారు.

సమాజంలో ఆర్థికంగా అణగారిన వర్గాలు వెనుకబడుతున్నారని, వాళ్లను పైకి తీసుకురావడమే ప్రభుత్వ ఉద్దేశమని చెప్పారు. ఈబీసీ రిజర్వేషన్ బిల్లు రాజ్యాంగ సవరణకు ఎలాంటి ఇబ్బందుల్లేవని, దేశంలోని పేదలకు మేలు చేసేందుకే ఈ బిల్లు తీసుకొచ్చామన్నారు.

దేశంలోని అన్ని వర్గాల ప్రజలకు న్యాయం చేసేందుకే తమ ఈ ప్రయత్నమని తెలిపారు. ఆర్థికంగా వెనుకబడిన వర్గాల వారిని పైకి తీసుకురావా లన్నదే ఈ బిల్లు ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. ఎయిడెడ్, అన్ ఎయిడెడ్ అన్న అంశాన్ని 15వ అధికరణ క్లాజ్(5) సవరణ సమయంలోనే చేర్చారని, అదే ప్రకారం ఇప్పుడు వెనుకబడిన వర్గాలకు రిజర్వేషన్లను కల్పించాలని ప్రయత్నిస్తున్నామన్నారు. పీవీహయాంలో ప్రత్యేక చట్టం ఏమీ చేయలేదని, అందుకే కోర్టు కొట్టివేసిందన్నారు. చాలా మంది రిజర్వేషన్లు 50శాతం దాటితే కోర్టు కొట్టివేస్తుందని అంటున్నారని, ఆ ఆందోళన నిజమే అయితే ఇప్పటివరకు రిజర్వేషన్లకు ఆర్టికల్ 15, 16 కల్పించిన వెసులుబాటులే మూలమని చెప్పుకొచ్చారు. ఆర్టికల్ 16(4)లో కులాల ఆధారంగా రిజర్వేషన్ల ప్రస్తావన ఉందని జైట్లీ వెల్లడించారు.

ఇదో రాజకీయ జిమ్మిక్కు: టీఎంసీ

రిజర్వేషన్ల రాజ్యాంగ సవరణ బిల్లు ఓ రాజకీయ జిమ్మిక్కని తృణముల్ కాంగ్రెస్ ఎంపీలు కొట్టిపారేశారు. ఈ సవరణ బిల్లును సెలెక్ట్ కమిటీకి పంపాలన్నారు. మహిళా రిజర్వేషన్ల బిల్లుకు ఎందుకు ఇంత ప్రాధాన్యత ఇవ్వలేదని ప్రశ్నించారు.

ఈబీసీ బిల్లు ఉద్దేశం మంచిది: శివసేన


ఈబీసీ బిల్లును తీసుకొస్తున్న ఉద్దేశం చాలా మంచిదని, అన్ని రాష్ట్రాల్లోను రిజర్వేషన్ల కోసం ఆందోళన చేస్తున్నారన్నారని శివసేన ఎంపీలు పేర్కొన్నారు. అర్హత ఉండి రిజర్వేషన్లు కోల్పోయిన వారికి అవకాశాలు కల్పించాలని సూచించారు.



ఈబీసీ కోటా ఇవ్వొద్దు: తంబిదురై

రిజర్వేషన్ బిల్లును అన్నాడీఎంకే ఎంపీ తంబిదురై వ్యతిరేకించారు. ఆర్థిక హోదా బట్టి రిజర్వేషన్లు ఇవ్వరాదని, పేదల కోసం తగినన్ని పథకాలున్నాయని ఆయన అన్నారు. అగ్రవర్ణాల్లో ఆర్థికంగా వెనుకబడిన వారికి 10 శాతం రిజర్వేషన్ కల్పించే బిల్లుపై లోక్‌సభలో జరిగిన చర్చలో అన్నాదురై పాల్గొంటూ, పేదలకు ఉద్దేశించిన ప్రభుత్వ పథకాలు విఫలమయ్యాయా అని ప్రశ్నించారు. ఉండటానికి పేదల కోసం చాలా పథకాలే పేదలకు ఉన్నాయని చెప్పారు. ప్రభుత్వం తీసుకు వచ్చే రిజర్వేషన్ బిల్లును సుప్రీంకోర్టు కొట్టేస్తుందని ఆయన అన్నారు. తమిళనాడులో సామాజికంగా వెనుకబడిన వారికి 70 శాతం రిజర్వేషన్లకు అన్నాడీఎంకే డిమాండ్ చేస్తున్నట్టు చెప్పారు. 'రాజ్యాంగ సవరణను తీసుకురండి. 9వ షెడ్యూల్ రక్షణ శాశ్వత పరిష్కారాన్ని ఇవ్వదు' అని తంబిదురై పేర్కొన్నారు.

మద్దతిస్తాం.. కానీ తొందరెందుకు?: థామస్



ఈ బిల్లును ఇంత అర్జెంటుగా సభలో ప్రవేశపెట్టడాన్ని కాంగ్రెస్ ఎంపీ కేవీ థామస్ తప్పుబట్టారు. ఇంత ముఖ్యమైన రాజ్యాంగ సవరణ బిల్లుపై తొందరపాటు పనికి రాదని ఆయన సూచించారు. తాము బిల్లుకు వ్యతిరేకం కాదని, అయితే ప్రభుత్వం దానిని ప్రవేశపెట్టిన తీరుపైనే అభ్యంతరం వ్యక్తం చేస్తున్నామని చెప్పారు. ఇంత హడావిడిగా బిల్లును తీసుకురావడం చూస్తుంటే.. మీడియా అనుమానం వ్యక్తం చేసినట్లు ఇది కేవలం పోల్ జిమ్మిక్కుగానే కనిపిస్తున్నదని ఆయన ఆరోపించారు. 1991లోనూ పీవీ సర్కార్ ఇలాగే చట్టం తీసుకురావాలని చూస్తే సుప్రీంకోర్టు అడ్డుకున్న విషయాన్ని గుర్తుచేశారు. దీనిని కచ్చితంగా జేపీసీకి పంపించాలని ఆయన డిమాండ్ చేశారు. నోట్ల రద్దు, జీఎస్టీలాగే ప్రభుత్వం ఒకదాని తర్వాత మరొక తప్పిదం చేస్తున్నదని థామస్ విమర్శించారు. అగ్రవర్ణాల పేదల రిజర్వేషన్ల విషయంలో ప్రభుత్వం తొందరపాటుగా వ్యవహరిస్తోందన్నారు. ఈ తరహా నిర్ణయాలు.. అనేక సమస్యలకు దారి తీస్తాయన్నారు. ఎన్డీయేకు ఇంకా మూడు నెలల సమయం మాత్రమే ఉందని, తొందరపాటుతో తీసుకున్న ఈ నిర్ణయాన్ని ఎలా అర్థం చేసుకోవాలని ప్రశ్నించారు. తప్పులను కప్పిపుచ్చుకోవడానికే ఎన్డీయే తప్పుల మీద తప్పులు చేస్తోందన్నారు. అన్ ఎయిడెడ్ విద్యాసంస్థల్లో ఈ రిజర్వేషన్లను ఎలా అమలు చేస్తారో చెప్పాలన్నారు.

ఇక.. మోదీ తప్పించుకోలేరు



- ఆయనకు రఫేల్ ఉచ్చు తప్పదు
- సీబీఐ విషయంలో సుప్రీం తీర్పుపై రాహుల్

న్యూఢిల్లీ, జనవరి 8: రఫేల్ వివాదం నుంచి ప్రధాని నరేంద్రమోదీ తప్పించుకోలేరని కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ అన్నారు. సీబీఐ డైరెక్టర్‌గా అలోక్‌వర్మను తిరిగి నియమిస్తూ సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిన నేపథ్యంలో ఆయన ఇలా స్పందించారు. ''రఫేల్ నుంచి ప్రధాని మోదీని ఇక ఎవరూ రక్షించలేదు. ఇందుకు తగిన బహిర్గత ఆధారాలు ఉన్నాయి'' అని రాహుల్ వ్యాఖ్యానించారు. రఫేల్ కుంభకోణానికి సంబంధించిన సమాచారాన్ని సేకరిస్తున్నందునే సీబీఐ డైరెక్టర్ అలోక్‌వర్మను అర్ధరాత్రి దాటిన తర్వాత ఒంటిగంటకు కేంద్ర ప్రభుత్వం సెలవుపై పంపిందని ఆరోపించారు. అలోక్ వర్మను తిరిగి నియమించడం ద్వారా న్యాయం జరిగినట్లయిందన్నారు. రఫేల్ ఒప్పందంలో అనిల్ అంబానీ జేబుల్లోకి రూ.30 వేల కోట్ల ప్రజాధనం దోచిపెట్టేందుకు ప్రధాని మోదీ సహాయపడ్డారని, ఇందులో ఎలాంటి అనుమానాలు లేవని అన్నారు. ఈ విషయం దేశ ప్రజలకు తెలియాల్సి ఉందన్నారు. రాఫెల్‌పై దర్యాప్తు మొదలుపెట్టబోయిన అలోక్‌వర్మను రాత్రికిరాత్రే తొలగించారని, ఇప్పుడు సుప్రీంకోర్టు ఆయనను తిరిగి నియమించినందున ఇక అన్నీ బయటకు వస్తాయని రాహుల్ పేర్కొన్నారు. ప్రధానిని ఎవరూ కాపాడలేరని, అన్నీ స్పష్టంగా ఉన్నాయని తెలిపారు. ఓవైపు అధికధరకు రాఫెల్ యుద్ధ విమానాలను కొనడమే కాకుండా రాఫెల్ ఒప్పందంలో ఇండియా భాగస్వామిగా హెచ్ఏఎల్‌ను తొలగించి అనుభవం లేని అనిల్ అంబానీ స్థాపించిన రిలయన్స్ డిఫెన్స్ కంపెనీకి చోటు కల్పించారని కాంగ్రెస్‌తో సహా విపక్షాలు ఆరోపిస్తున్నాయి.

మమ్మల్ని తక్కువ అంచనా వేయొద్దు..


కాంగ్రెస్‌ను ఎవరూ తక్కువగా అంచనా వేయొద్దని రాహుల్‌గాంధీ హితవు పలికారు. అలా అంచనా వేయడం పెద్ద పొరపాటని అన్నారు. ఉత్తరప్రదేశ్‌లో సమాజ్‌వాదీ పార్టీ, బహుజన్ సమాజ్ పార్టీ కలిసి రానున్న లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసేందుకు పొత్తు కుదుర్చుకున్న నేపథ్యంలో ఆయన ఇలా స్పందించారు. ఈనెల 11న యూఏఈలో పర్యటించనున్న నేపథ్యంలో గల్ఫ్ న్యూస్‌తో రాహుల్ మాట్లాడారు. యూపీలో ఒంటరిగానే పోటీ చేస్తామని పరోక్షంగా సంకేతాలిచ్చారు. యూపీలో కాంగ్రెస్ చేయగలిగిన ఆసక్తికర కార్యక్రమాలు చాలా ఉన్నాయన్నారు. ఆ రాష్ట్రం కాంగ్రెస్ ఆలోచన చాలా శక్తిమంతమైనదని చెప్పారు. అక్కడ తమ సామర్థ్యం పట్ల చాలా ఆత్మ విశ్వాసంతో ఉన్నామని, ఆశ్చర్యపరిచే ఫలితాలు సాధిస్తామని చెప్పారు. తమ లక్ష్యం ప్రధాన మంత్రి నరేంద్ర మోదీని ఓడించడమని చెప్పారు. ప్రతిపక్షాలను ఏకం చేసేందుకు కృషి చేస్తున్నామన్నారు. మిగతా రాష్ట్రాల్లో విపక్షాలను ఏకతాటిపైకి తెచ్చేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు. ఎస్పీ–బీఎస్పీ పొత్తు నేపథ్యంలో ఎస్పీ జాతీయ ఉపాధ్యక్షుడు కిరణ్మయి నంద మాట్లాడుతూ.. కాంగ్రెస్ వంటి బలహీనశక్తితో పొత్తు పెట్టుకునే ప్రసక్తేలేదని పేర్కొన్న నేపథ్యంలో రాహుల్ ఇలా స్పందించారు.

తప్పుబట్టడమే: కేజ్రీవాల్

అలోక్‌వర్మను మళ్లీ సీబీఐ డైరెక్టర్‌గా నియమిస్తూ సుప్రీంకోర్టు తీర్పు చెప్పడం నేరుగా ప్రధానమంత్రిని తప్పుబట్టడమేనని ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ అన్నారు. మోదీ సర్కారు మన దేశంలో ప్రజాస్వామ్యంతో పాటు వ్యవస్థలన్నింటినీ సర్వనాశనం చేసిందని ఆయన విమర్శించారు. రఫేల్ స్కాంలో నేరుగా ప్రధాని హస్తం ఉండటంతో దానిపై విచారణను ఆపడానికి అర్ధరాత్రి అక్రమంగా సీబీఐ డైరెక్టర్‌ను తొలగించలేదా అని ప్రశ్నించారు.

సీబీఐ సమగ్రతను కాపాడేలా తీర్పు

- సీవీసీ నిర్ణయం మేరకే సెలవుపై అలోక్‌వర్మ
- సుప్రీంకోర్టు తీర్పుపై అరుణ్‌జైట్లీ స్పష్టం



న్యూఢిల్లీ, జనవరి 8: సీబీఐ సమగ్రతను కాపాడేలా సుప్రీంకోర్టు తన తీర్పును వెలువరించిందని కేంద్ర ఆర్థికశాఖ మంత్రి అరుణ్‌జైట్లీ పేర్కొన్నారు. అలోక్‌వర్మ విషయంలో సుప్రీంకోర్టు చాలా బ్యాలెన్స్‌డ్‌గా తీర్పు వెలువరించిందని అన్నారు. సీబీఐ డైరెక్టర్‌గా అలోక్‌వర్మను కొనసాగించాలని సుప్రీంకోర్టు తీర్పు వెలువరించిన నేపథ్యంలో ఆయన స్పందించారు. కేంద్ర విజిలెన్స్ కమిషన్ (సీవీసీ) సూచన మేరకే సీబీఐ డైరెక్టర్ అలోక్ వర్మను సెలవుపై పంపాలనే నిర్ణయం తీసుకున్నామని జైట్లీ అన్నారు. అత్యున్నత దర్యాప్తు సంస్థను పరిరక్షించడమే ప్రభుత్వ ఉద్దేశమని స్పష్టం చేశారు. సీబీఐ ఉన్నతాధికారులు అలోక్ వర్మ, రాకేష్ ఆస్థానాల పరస్పర ఆరోపణల నేపథ్యంలో సీవీసీ సిఫార్సు మేరకు ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందన్నారు. సీబీఐ విశ్వసనీయత, నిష్పాక్షిక విచారణను కొనసాగించే క్రమంలో దర్యాప్తు సంస్థ విస్తృత ప్రయోజనాలను ప్రభుత్వం దృష్టిలో పెట్టుకుని వ్యవహరించిందన్నారు. సీబీఐ డైరెక్టర్‌గా తిరిగి అలోక్ వర్మను నియమించాలని సుప్రీం కోర్టు మంగళవారం స్పష్టం చేసిన క్రమంలో జైట్లీ ఈ వ్యాఖ్యలు చేశారు.

దేశవ్యాప్తంగా స్తంభించిన రవాణా

- ఎక్కడికక్కడే నిలిచిన సరకు, ప్రజా రవాణా
- కేరళ, బెంగాల్ తీవ్రం.. బస్సులు, రైళ్లు బంద్



న్యూఢిల్లీ, జనవరి 8: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా 48 గంటల సమ్మెలో భాగంగా మంగళవారం తొలిరోజు రవాణా సమ్మె విజయవంతమైంది. కొన్ని రాష్ట్రాల్లో సమ్మె ప్రభావం తీవ్రంగా ఉండగా.. మరికొన్ని రాష్ట్రాల్లో పాక్షికంగా కనిపించింది. కేరళ, పశ్చిమబెంగాల్, ఒడిశాలో పలుచోట్ల హింసాత్మక ఘటనలు చోటు చేసుకున్నాయి. దేశవ్యాప్తంగా 20 కోట్ల మంది కార్మికులు సమ్మెలో పాల్గొన్నాయని కార్మిక సంఘాలు తెలిపాయి. సమ్మె కారణంగా ఉద్యోగులు, విద్యార్థులు ఇబ్బందులు పడ్డారు. సమ్మెకు కార్మిక, ఉద్యోగ, రైతు సంఘాలు మద్దతు ప్రకటించడంతో దేశవ్యాప్తంగా ర్యాలీ, రాస్తారోకోలు, ధర్నాలు జరిగాయి. చాలా రాష్ట్రాల్లో విద్యా సంస్థలు మూతపడ్డాయి. సమ్మె ప్రభావం తెలుగు రాష్ట్రాలపై కూడా పడింది. కార్మిక సంఘాలు, వామపక్ష పార్టీలు భారీ ఎత్తున నిరసన ర్యాలీలు జరిపాయి. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా ఏఐటియుసి, సిఐటియు, ఐఎఫ్‌టియు ఆందోళన కార్యక్రమాలు చేపట్టాయి. ఆర్టీసీ డిపోల ఎదుట ధర్నాలు నిర్వహించాయి. దేశ రాజధాని ఢిల్లీలోనూ ఆందోళనలు మిన్నంటాయి. కార్మిక సంఘాల ఆందోళనలకు పలు రాజకీయ పార్టీలు సంఘీభావం తెలిపాయి. పశ్చిమ బెంగాల్‌లో తృణమూల్ కాంగ్రెస్, సీపీఎం కార్యకర్తల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. కేరళలో కార్మిక సంఘాలు రోడ్డెక్కడంతో ప్రజాజీవనం స్తంభించింది. ఒడిశాలోనూ రవాణా వ్యవస్థ స్తంభించింది.

ప్రసాదంతోపాటు మందు బాటిళ్లు!

- యూపీ బీజేపీ ఎంపీ నిర్వాకం



హర్దోయ్, జనవరి 8: ఓ గుడిలో పూజాదికాలు నిర్వహించిన బీజేపీ ఎంపీ, పూజ అనంతరం ఆహార పొట్లాలు పంచిపెట్టారు. తీరా అవి తెరిచి చూస్తే ఇందులో ఆహారంతో పాటు మందు బాటిళ్లు కూడా దర్శనమిచ్చి అందరికీ షాక్ ఇచ్చింది. ఆహార పొట్లాలు అందుకున్న వారిలో పెద్ద ఎత్తున చిన్నపిల్లలుండడం విశేషం. ఉత్తర్‌ప్రదేశ్‌లోని హర్దోయ్‌లో బీజేపీ ఎంపీ నితిన్ అగర్వాల్, ఆయన తండ్రి నరేష్ అగర్వాల్ స్థానిక శ్రవణా దేవి మందిరంలో పూజ నిర్వహించాక.. కార్యక్రమానికి పెద్ద ఎత్తున తరలివచ్చిన వారందరికీ ఆహారం డబ్బాలు అందించారు. ఇందులో పూరి, కూర, మిఠాయితో పాటు మందు బాటిళ్లు కనిపించడం వివాదాస్పదంగా మారింది. దీనిపై బీజేపీ నేతలు మండిపడుతూ.. మొత్తం విషయాన్ని సీఎం ఆదిత్యానాథ్‌తో పాటు పార్టీ పెద్దలకు లేఖ ద్వారా చేరవేశారు. దురదృష్టకరమైన ఈ ఘటనపై ఎక్సైజ్ అధికారులకు ఫిర్యాదు చేయనున్నట్టు, ఇంత పెద్ద ఎత్తున మందు బాటిళ్లు పంపిణీ చేయడం సంబంధిత అధికారుల దృష్టికి ఎలా రాలేదంటూ బీజేపీ ఎంపీ అన్షుల్ వర్మ ఆగ్రహం వ్యక్తంచేశారు. గతంలో చిన్న పిల్లలకు పుస్తకాలు, పెన్నులు విస్తృతంగా పంచేవారని వర్మ గుర్తుచేశారు. మరోవైపు ఆహార పొట్లాల పంపిణీపై వేదిక నుంచి వివరంగా ప్రకటన చేసిన నితిన్ అగర్వాల్ వీడియో ఇప్పుడు వైరల్‌గా మారింది. ఇటీవలే సమాజ్‌వాదీ పార్టీ నుంచి బీజేపీలో చేరిన తండ్రీ కొడుకులు ఈ ఘటనపై ఇంకా స్పందించలేదు.



సం(క్రాంతికి పర్‌ఫెక్ట్ ఫ్యామిలీ మూవీ 'ఎఫ్2'

వెంకటేష్, వరుణ్‌తేజ్ హీరోలుగా తమన్నా, మెహరీన్ హీరోయిన్లుగా శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌పై దిల్‌రాజు నిర్మాణంలో రూపొందుతోన్న చిత్రం 'ఎఫ్2'. 'ఫన్ అండ్ ఫ్రస్టేషన్' ట్యాగ్ లైన్. అనిల్ రావిపూడి దర్శకుడు. జనవరి 12న ఈ సినిమా విడుదలవుతుంది. ఈ సందర్భంగా సోమవారం హైదరాబాద్‌లోని రామానాయుడు స్టూడియోలో ట్రైలర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా వెంకటేష్ మాట్లాడుతూ ''ముందుగా అనీల్‌కి థాంక్స్. చాలా రోజుల తర్వాత ఇంట్లో ఇల్లాలు వంటింట్లో ప్రియురాలు, మల్లీశ్వరి, నువ్వు నాకు నచ్చావ్ తర్వాత ఫుల్ ప్లెజ్డ్ కామెడీ మూవీ చేయలేదు. చాలా గ్యాప్ తర్వాత అలాంటి మూవీ చేశాను. దిల్‌రాజుగారు, అనీల్ గారు నేను కామెడీతో మెప్పిస్తానని నమ్మకంతో నా వద్దకు రావడంతో ఎఫ్ 2 సినిమా చేశాను. వరుణ్ చక్కగా చేశాడు. తమన్నా, మెహరీన్ సహా అందరితో నటించడం హ్యాపీగా ఉంది. క్యారెక్టర్స్ అన్నీ చక్కగా డిజైన్ చేశారు. సంక్రాంతికి పర్‌ఫెక్ట్ ఫ్యామిలీ ఫన్ మూవీ'' అన్నారు. వరుణ్‌తేజ్ మాట్లాడుతూ ''నా కెరీర్‌లో ఎంత కామెడీ చేయాలనుకున్నానో దాన్ని అంతా అనిల్ ఒక సినిమాలో చేయించేశాడు. వెంకీగారు కామెడీ అంటే ఇరగదీస్తారు. ఆయనతో చేయడమంటే కాస్త టెన్షన్ పడ్డాను. ఆయనతో వర్క్ చేయడం అదృష్టంగా భావిస్తున్నాను'' అన్నారు. దర్శకుడు అనిల్ రావిపూడి మాట్లాడుతూ ''శ్రీవెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌లో ఇది నా మూడో సినిమా. దిల్‌రాజు, లక్ష్మణ్, శిరీష్‌తో మంచి అనుబంధం ఉంది. మా కాంబినేషన్‌లో ఇది హ్యాట్రిక్ హిట్ కావాలని.. వారితో అనుబంధం ఇలాగే కొనసాగాలని కోరుకుంటున్నాను'' అన్నారు. దిల్‌రాజు మాట్లాడుతూ ''రాజాదిగ్రేట్ తర్వాత ఏ సినిమా చేద్దామని అనుకున్నప్పుడు అనీల్ ఈ ఐడియా చెప్పాడు. అప్పటి నుండి 15 నెలల పాటు ఈ జర్నీని ఎంజాయ్ చేస్తూ వచ్చాం. వెంకటేష్‌గారు, వరుణ్, తమన్నా, మెహరీన్ సహా ప్రతి ఒక క్యారెక్టర్‌లో ఎంటర్‌టైన్‌మెంట్ కనపడుతుంది. థియేటర్‌లో 2గంటల 26 నిమిషాల్లో గంటన్నర పాటు నవ్వుతూనే ఉంటారు. సంక్రాంతికి 'ఎఫ్ 2' అందరికీ ఫన్ ఇస్తూ సక్సెస్ అవుతుందనే నమ్మకంతో ఉన్నాం'' అన్నారు.

అవసరమైతే విధ్వంసం సృష్టిస్తాను - రామ్‌చరణ్



గత సంవత్సరం 'రంగస్థలం' చిత్రంలోని నటనతో తన రేంజ్‌ని మరింత పెంచుకున్న రామ్‌చరణ్ ఇప్పుడు 'వినయ విధేయ రామ' చిత్రంతో మరోసారి ప్రేక్షకుల ముందుకు వస్తున్నారు. బోయపాటి శ్రీను దర్శకత్వంలో రూపొందిన ఈ సినిమాను డి.వి.వి.దానయ్య నిర్మించారు. సంక్రాంతి సందర్భంగా ఈ చిత్రాన్ని జనవరి 11న విడుదల చేస్తున్నారు. ఈ నేపథ్యంలో హీరో రామ్‌చరణ్ చిత్రం గురించి మాట్లాడుతూ ''నలుగురు అన్నదమ్ముల కథ 'వినయ విధేయ రామ'. వారి కుటుంబంలోని ఎమోషన్స్ ఎలా ఉంటాయో బోయపాటి తెరపై చూపించారు. కుటుంబంతో కలిసి ఎంజాయ్ చేసేలా ఈ చిత్రం ఉంటుంది. మీరు అనుకున్నంత రక్తపాతం ఇందులో ఉండదు. సెన్సార్ వాళ్లు ఒక్క కట్ కూడా లేకుండా యు/ఎ సర్టిఫికెట్ ఇచ్చారు. బయటివారు ఈ చిత్రాన్ని 'గ్యాంగ్ లీడర్'తో పోల్చడంలో అర్థం లేదు. నాకు 'గ్యాంగ్ లీడర్' అంటే ఇష్టం.. అలాంటి కథలో చేయాలి అనుకున్నా. కానీ ఆ కథ వేరు, ఈ కథ వేరు. 'వినయ విధేయ రామ' టైటిల్ సాఫ్ట్‌గా ఉంది. బోయపాటి సినిమాల్లో నాకు 'జయ జానకి నాయక' టైటిల్ అంటే ఇష్టం. ఇప్పుడు 'వినయ విధేయ రామ' టైటిల్ విన్న తర్వాత అదే అనుభూతి కలిగింది. ఈ కథను బోయపాటి నాలుగేళ్ల క్రితమే చెప్పారు. ఈ సినిమాలో నా పాత్ర పేరు రామ్. ప్రతి ఇంటిలోనూ ఇలాంటి క్యారెక్టర్ ఒకటి ఉండాలని చెప్పే పాత్ర. రాముడిలా వినయంగా ఉంటూనే దుష్ట శిక్షణ కోసం ఎంతటి విధ్వంసాన్ని అయినా సృష్టించే క్యారెక్టర్ అది. ఇంతకుముందు సినిమా 'రంగస్థలం'లో ఒక తరహా క్యారెక్టర్ చేశాను. అలాంటి క్యారెక్టర్స్‌కే పరిమితం కాకుండా అన్ని జోనర్స్‌లో సినిమాలు చెయ్యాలన్నదే నా లక్ష్యం. 1980లో నాన్నగారు కూడా అన్ని రకాల సినిమాలు చేశారు. అయితే ఇక్కడ నేను జోనర్ గురించి ఆలోచించలేదు. ఒక సెన్సిబుల్ సినిమా చెయ్యాలనుకున్నాను. బోయపాటిగారి సినిమాల్లో క్యారెక్టర్స్ చాలా స్ట్రాంగ్‌గా ఉంటాయి. దానికి తగ్గట్టుగానే నా క్యారెక్టర్‌ని మలిచారు. అయితే నాకు ఇంకొంత సమయం ఉంటే బాగుండేది అనిపించింది. 'రంగస్థలం' షూటింగ్ పూర్తయిన తర్వాత 25 రోజుల గ్యాప్‌లోనే ఈ సినిమా స్టార్ట్ చేశాం. నాకు ఉన్న కమిట్‌మెంట్స్,బోయపాటిగారికి ఉన్న కమిట్‌మెంట్స్‌ని దృష్టిలో పెట్టుకొని ఈ సినిమాను త్వరగా స్టార్ట్ చేశాం. ఈ సినిమా విషయంలో, నా క్యారెక్టర్ విషయంలో డైరెక్టర్‌కి ఉన్న క్లారిటీ వల్ల ఈ సినిమా చేయడం నాకు పెద్దగా కష్టం అనిపించలేదు. ఈ సినిమా తర్వాత రాజమౌళిగారి 'ఆర్ఆర్ఆర్'లో చేస్తున్నాను. 'రంగస్థలం' తర్వాత మరోసారి డీ గ్లామరైజ్డ్ క్యారెక్టర్ చేస్తున్నాను. ఈ పాత్ర ఆడియన్స్‌కి బాగా కనెక్ట్ అవుతుంది. ఈ సంవత్సరం అంతా 'ఆర్ఆర్ఆర్'కే కేటాయించాను. ఎన్టీఆర్ నాకు చాలా క్లోజ్ ఫ్రెండ్. ఈ సినిమాలో మా ఇద్దరి కాంబినేషన్ సీన్స్ చాలా బాగా వస్తున్నాయి. ఎన్టీఆర్‌తో నటించడం మంచి అనుభూతిని కలిగిస్తోంది'' అన్నారు.



ప్రభాస్

జపాన్ అభిమానుల కోసం..

'బాహుబలి' సిరీస్‌తో ప్రపంచవ్యాప్తంగా అభిమానుల్ని సంపాదించుకున్నారు హీరో ప్రభాస్. ముఖ్యంగా ప్రభాస్‌కి జపాన్‌లో ఫ్యాన్ ఫాలోయింగ్ ఎక్కువ. నూతన సంవత్సరం సందర్భంగా జపాన్‌లోని తన అభిమానుల్ని సర్‌ప్రైజ్ చేశారు ప్రభాస్. 'మీరంతా సంతోషంగా నూతన సంవత్సర వేడుకలు జరుకుంటారని ఆశిస్తున్నాను' అంటూ జపనీస్ భాషలో స్వయంగా రాసి పంపించారట ప్రభాస్. అలాగే ఫోటోషూట్‌లో భాగంగా కొత్తగా తను దిగిన ఫోటోలను కూడా పోస్ట్ చేశారు. ప్రస్తుతం ప్రభాస్ 'సాహో' చిత్రం షూటింగ్‌లో బిజీగా ఉన్నారు ప్రభాస్. సోమవారం ఈ చిత్రం షూటింగ్ చాలా అద్భుతంగా జరిగిందట. ఈ విషయాన్ని విలన్‌గా నటిస్తున్న నీల్ నితిన్ ముఖేశ్ ఇన్‌స్టాగ్రామ్ ద్వారా తెలియజేశారు. అంతేకాదు ప్రభాస్, దర్శకుడు సుజిత్‌తో కలిసి దిగిన ఫోటోను కూడా పోస్ట్ చేశారు. భారీ బడ్జెట్‌తో యు.వి. క్రియేషన్స్ నిర్మిస్తున్న ఈ సినిమా ఆగస్ట్ 15న ప్రపంచవ్యాప్తంగా పలు భాషల్లో విడుదల కానుంది..

త్రివిక్రమ్ సినిమాలో మరోసారి...



సునీల్

త్రివిక్రమ్ రచయితగా, దర్శకుడుగా పనిచేసిన సినిమాల్లో సునీల్ కమెడియన్‌గా మంచి పాత్రలు చేశారు. కమెడియన్ నుంచి హీరోగా టర్న్ అయిన తర్వాత సునీల్‌కి త్రివిక్రమ్ సినిమాల్లో నటించే అవకాశాలు రాలేదు. హీరో నుంచి మళ్ళీ కమెడియన్‌గా, క్యారెక్టర్ ఆర్టిస్టుగా మారిన తర్వాత సునీల్ నటించిన సినిమా 'అరవింద సమేత'. ఈ చిత్రంలో నీలాంబరిగా అందర్నీ మెప్పించారు. ఇప్పుడు మళ్ళీ మరోసారి త్రివిక్రమ్ సినిమాలో సునీల్ నటించబోతున్నారని వార్తలు వస్తున్నాయి. అల్లు అర్జున్, త్రివిక్రమ్ కాంబినేషన్‌లో రూపొందే సినిమాలో సునీల్ ఓ కీలక పాత్ర పోషిస్తారని తెలుస్తోంది.



సాయిపల్లవి

'పెళ్లిచూపులు', 'మెంటల్ మదిలో' చిత్రాలను నిర్మించి నేషనల్ అవార్డ్, ఫిల్మ్‌ఫేర్ అవార్డులని పొందిన రాజ్ కందుకూరి.. ఇప్పుడు ధర్మపథ క్రియేషన్స్‌పై మరో లెడీ డైరెక్టర్‌ని సినిమా రంగానికి పరిచయం చేస్తున్నారు. ఈ సినిమాతో తన తనయుడు శివ కందుకూరిని హీరోగా పరిచయం చేస్తున్నారు రాజ్ కందుకూరి. ప్రముఖ దర్శకులు సుకుమార్, క్రిష్‌ల వద్ద అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేసిన శేష సింధురావ్‌ని ఈ చిత్రంతో దర్శకురాలుగా పరిచయం అవుతున్నారు. గోపీసుందర్ సంగీతం అందిస్తున్నారు. తమిళంలో ఇటీవలే విడుదలై ఘన విజయం సాధించిన '96' చిత్రం ఫేం వర్ష ఈ చిత్రంతో తెలుగులో హీరోయిన్‌గా పరిచయమవుతోంది. 'మహానటి' చిత్రానికి స్క్రీన్‌ప్లే, మాటలు అందించిన పద్మావతి విశ్వేశ్వర్ ఈ చిత్రానికి దర్శకురాలితో కలిసి కథ, స్క్రీన్‌ప్లే, మాటలు అందించారు. రవితేజ గిరజాల ఈ చిత్రానికి ఎడిటర్. వేద రామన్ సినిమాటోగ్రఫీ అందిస్తున్నారు. ప్రముఖ నిర్మాతలు దగ్గుబాటి సురేష్‌బాబు, మధుర శ్రీధర్‌లు ఈ చిత్ర నిర్మాణంలో ప్రముఖ పాత్ర పోషిస్తున్నారు.

రాజ్ కందుకూరి తనయుడు శివ హీరోగా సినిమా



శివ, వర్ష

కొత్త లుక్‌లో..



నయనతార

ఇప్పుడు కోలీవుడ్ టాప్ స్టార్‌గా వెలుగొందుతున్న హీరోయిన్ నయనతార. విభిన్నమైన సినిమాలు చేస్తూ తన ప్రత్యేకతను చాటుకుంటోంది. తను చేసే క్యారెక్టర్ కోసం ఎలాంటి లుక్‌లోకి మారిపోవడానికైనా నయనతార సిద్ధం. తాజాగా 'ఐరా' సినిమా కోసం ఒక కొత్త లుక్‌లో కనిపిస్తోంది నయన్. ఈ సినిమాలో ఆమె రెండు విభిన్నమైన పాత్రలు పోషిస్తోంది. ఒక పాత్రలో నల్ల పిల్లలా కనిపించనున్నారు. ఈ ఫొటో ఆ పాత్రకు సంబంధించినదే. ఈ ఫోటో చూసిన ఎవరైనా నయన్‌ను త్వరగా గుర్తుపట్టలేరు. 'ఐరా' అనేది సినిమాలో ఆమె పాత్ర కాదు. ఇంద్రుడి వాహనం ఐరావతం పేరుని ఈ సినిమాకి పెట్టారు. ఐరావతం అంత శక్తిమంతంగా ఈ చిత్రంలో నయనతార పాత్ర ఉంటుందని, అందుకే ఈ టైటిల్ పెట్టారట.



క్యాన్సర్ బారిన రాకేష్ రోషన్

ఒకప్పుడు హీరోగా మంచి పేరు తెచ్చుకొని ఆ తర్వాత విజయవంతమైన సినిమాలను రూపొందించిన దర్శకుడు, బాలీవుడ్ హీరో హృతిక్ రోషన్ తండ్రి రాకేష్ రోషన్. ఆయన కొంతకాలంగా క్యాన్సర్‌తో బాధపడుతున్నట్టు హృతిక్ రోషన్ ఇన్‌స్టాగ్రామ్ ద్వారా తెలిపారు. రాకేష్ త్వరగా కోలుకోవాలని ఆయన అభిమానుంతా కోరుకుంటూ కామెంట్లు పెడుతున్నారు. హృతిక్ నటించిన దాదాపు అన్ని చిత్రాలకు రాకేశ్ నిర్మాతగా, దర్శకుడుగా వ్యవహరించారు. హిందీలో బ్లాక్‌బస్టర్ విజయం అందుకున్న 'క్రిష్' సిరీస్ నుంచి నాలుగో చిత్రాన్ని తెరకెక్కించే పనిలో రాకేశ్ బిజీగా ఉన్నారు. ఇంతలో ఆయనకు క్యాన్సర్ ఉందని తెలిసింది. దాంతో 'క్రిష్ 4'కు సంబంధించిన ప్రీ ప్రొడక్షన్ పనులు వాయిదా వేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

సినిమా ఫ్లాప్ అయ్యిందని..

ఎన్నో అంచనాల మధ్య ఇటీవల విడుదలైన 'పడి పడి లేచె మనసు' చిత్రం ఆశించిన స్థాయిలో విజయం సాధించలేదు. ఈ చిత్రంలో శర్వానంద్, సాయిపల్లవి జంటగా నటించారు. రొమాంటిక్ ఎంటర్‌టైనర్‌గా రూపొందిన ఈ సినిమా చిత్ర యూనిట్‌ను నిరాశ పరిచింది. తను నటించిన సినిమా వల్ల నిర్మాతలకు నష్టం వాటిల్లిన నేపథ్యంలో సాయిపల్లవి తను తీసుకున్న రెమ్యునరేషన్‌ను వెనక్కి ఇచ్చేసిందని తెలుస్తోంది. సాధారణంగా స్టార్ హీరోలు మాత్రమే అలా రెమ్యునరేషన్ వెనక్కి ఇచ్చిన సందర్భాలు ఉన్నాయి. కానీ, ఒక హీరోయిన్ తను నటించిన సినిమా ఫ్లాప్ కావడంతో రెమ్యునరేషన్ వెనక్కి ఇచ్చేయడం ఇదే ప్రథమం కావచ్చు.

కొనసాగిన బుల్ రన్

10,800 మార్క్‌కు పైన నిఫ్టీ

- 130 పాయింట్లు పెరిగిన సెన్సెక్స్
- 52 వారాల గరిష్టానికి ఐసీఐసీఐ బ్యాంక్



ముంబై: ఇండియన్ స్టాక్ మార్కెట్ మంగళవారం కూడా లాభాల్లోనే ముగిసింది. బెంచ్‌మార్క్ ఇండెక్స్‌లైన సెన్సెక్స్ 131 పాయింట్ల లాభంతో 35,980 వద్ద ముగిసింది. ఇక నిఫ్టీ 30 పాయింట్ల లాభంతో 10,802 వద్ద క్లోజయ్యింది.

లాభాల్లో ప్రారంభమైన మార్కెట్ సూచీలు తర్వాత వెంటనే నష్టాల్లోకి వెళ్లిపోయాయి. అంతర్జాతీయ మార్కెట్లు ప్రతికూలముగా ఉండటం ఇందుకు కారణం. అయితే బ్యాంక్ షేర్లలో కొనుగోలు జోరు కారణంగా ఇండెక్స్‌లు మళ్లీ లాభాల బాట పట్టాయి. అమెరికా మార్కెట్ ఫ్యూచర్లు పాజిటివ్‌గా ఉండటం కూడా సానుకూల ప్రభావం చూపింది. సెన్సెక్స్ ఇంట్రాడేలో 35,753 పాయింట్ల కనిష్ట స్థాయిని, 36,037 గరిష్ట స్థాయిని తాకింది. ఇక నిఫ్టీ ఇంట్రాడేలో 10,733 పాయింట్ల కనిష్ట స్థాయిని, 10,818 పాయింట్ల గరిష్ట స్థాయిని నమోదు చేసింది. నిఫ్టీ 50 లో సన్ ఫార్మా, ఐసీఐసీఐ బ్యాంక్, ఎస్‌బీఐ, టాటా మోటార్స్, యస్ బ్యాంక్,





యాక్సిస్ బ్యాంక్ షేర్లు ఎక్కువగా లాభపడ్డాయి. సన్ ఫార్మా 4 శాతానికి పైగా పెరిగింది. ఐసీఐసీఐ బ్యాంక్, ఎస్‌బీఐ షేర్లు 3 శాతానికి పైగా లాభపడ్డాయి. అదే సమయంలో జీ ఎంటర్‌టైన్‌మెంట్ 3 శాతం మేర పడిపోయింది. యూపీఎల్, కోటక్ మహీంద్రా బ్యాంక్, బీపీసీఎల్, హెచ్‌పీసీఎల్, ఎన్‌టీపీసీ, గెయిల్, హిందాల్కో షేర్లు 1 శాతానికి పైగా నష్టపోయాయి. ఐసీఐసీఐ బ్యాంక్ షేర్లు 52 వారాల గరిష్ట స్థాయిని తాకాయి. సెక్టోరల్ ఇండెక్స్‌లు మిశ్రమంగా ముగిశాయి. నిఫ్టీ ఎఫ్‌ఎంసీజీ, నిఫ్టీ ఐటీ, నిఫ్టీ మీడియా, నిఫ్టీ రియల్టీ ఇండెక్స్‌లు నష్టపోయాయి. నిఫ్టీ పీఎస్‌యూ బ్యాంక్ ఇండెక్స్ గరిష్టంగా 2.5 శాతానికి పైగా ర్యాలీ చేసింది. దీని తర్వాత నిఫ్టీ ఫార్మా ఇండెక్స్ 1.5 శాతానికి పైగా పెరిగింది.



పన్ను ఆదా కోసం ఈ ఫండ్స్ వైపు చూడండి

న్యూఢిల్లీ: పన్ను భారమనేది పన్ను చెల్లించే వారికే తెలుస్తుంది. ప్రస్తుతం మార్కెట్‌లో పన్ను మినహాయింపు అందించే సాధనాలు చాలానే ఉంటాయి. అయితే ఈఎల్‌ఎస్‌ఎస్‌కు ప్రత్యేక గుర్తింపు ఉంది. వీటిల్లో పన్ను ఆదాతోపాటు రాబడి కూడా పొందొచ్చు. 80సీ సెక్షన్ కింద పన్ను మినహాయింపు కల్పించే ఈక్విటీ లింక్డ్ సేవింగ్ స్కీమ్స్ (ఈఎల్‌ఎస్‌ఎస్) కోసం ఇన్వెస్టర్లు ఇప్పటికే వేట ప్రారంభించి ఉంటారు. సుదీర్ఘ కాలంలో అధిక రాబడులు అందిస్తాయనే లక్ష్యంతో ఈఎల్‌ఎస్‌ఎస్‌లలో ఇన్వెస్ట్ చేయవద్దంటున్నారు మార్కెట్ నిపుణులు. ఈక్విటీ స్కీమ్స్‌లలో ఇన్వెస్ట్ చేస్తే రిస్క్ ఉంటుందనే విషయాన్ని గుర్తు పెట్టుకోవాలని సూచించారు. ఈక్విటీ అనేది రిస్క్‌తో కూడుకున్న అంశమని, స్వల్ప కాలంలో ఒడిదుడుకులు ఉండొచ్చని హెచ్చరించారు. అదే సమయంలో దీర్ఘకాలంలో మంచి రాబడులను అందుకోవచ్చని పేర్కొన్నారు. అయితే కేవలం అధిక రాబడులే లక్ష్యంగా ఈఎల్‌ఎస్‌ఎస్‌లలో ఇన్వెస్ట్ చేయడం సరైన నిర్ణయం కాదని తెలిపారు. రిస్క్ తీసుకోవడానికి ఇష్టపడని వారు ఈఎల్‌ఎస్‌ఎస్‌లకు దూరంగా ఉండటం ఉత్తమమని పేర్కొన్నారు. ఈ ఫండ్స్ ఎక్కువగా స్టాక్స్‌లోనే పెట్టుబడులు పెడతాయని తెలిపారు. దీనివల్ల రిస్క్ తీసుకోలేని వారు వీటికి బదులు పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్, బ్యాంక్ డిపాజిట్లు వంటి ఇతర సాధనాల వైపు మొగ్గు చూపడం ఉత్తమమని సూచించారు. ఈఎల్‌ఎస్‌ఎస్‌లలో 3 ఏళ్ల లాకిన్ పీరియడ్ ఉంటుందనే విషయాన్నిగుర్తు పెట్టుకోవాలని నిపుణులు తెలిపారు. లాకిన్ పీరియడ్ మూడేళ్లే కాదా అని వీటిల్లో పెట్టుబడులు పెట్టకూడదని, కనీసం 5-7 ఏళ్ల లక్ష్యంతో ఇన్వెస్ట్ చేయాలని పేర్కొన్నారు. దీర్ఘకాల ఆర్థిక లక్ష్యాలను చేరుకోవడానికి ఈఎల్‌ఎస్‌ఎస్ మంచి ఇన్వెస్ట్‌మెంట్ సాధనమని తెలిపారు. లాకిన్ పీరియడ్ ముగిసిన వెంటనే వీటి నుంచి ఇన్వెస్ట్‌మెంట్లను వెనక్కు తీసుకోవలసిన అవసరం లేదన్నారు. స్కీమ్ మంచి పనితీరు కనబరిచే వరకు మీ పెట్టుబడులను కొనసాగించాలని సలహా ఇచ్చారు.ఈఎల్‌ఎస్‌ఎస్‌లో ఇన్వెస్ట్ చేయాలని భావిస్తే.. మోతీలాల్ ఓస్వాల్ లాంగ్ టర్మ్ ఈక్విటీ ఫండ్, ఆదిత్య బిర్లా సన్ లైఫ్ ట్యాక్స్ రిలీఫ్ 96, ఎల్‌అండ్‌టీ ట్యాక్స్ అడ్వాంటేజ్, హెచ్‌డీఎఫ్‌సీ లాంగ్ టర్మ్ అడ్వాంటేజ్ ఫండ్, ఇన్వెస్కో ఇండియా ట్యాక్స్ ప్లాన్, యాక్సిస్ బ్యాంక్ టర్మ్ ఈక్విటీ ఫండ్ వంటి వాటిల్లో ఇన్వెస్ట్ చేయవచ్చని నిపుణులు వివరించారు.



ఆకర్షణీయంగా పీఎస్‌యూ బ్యాంకు షేర్లు!



న్యూఢిల్లీ: ప్రస్తుత మార్కెట్లో పీఎస్‌యూ బ్యాంకు షేర్లు ఆకర్షణీయంగా కనిపిస్తున్నాయని అజ్కాన్ గ్లోబల్ అనలిస్టు ఆకాశ్ జైన్ చెప్పారు. భూషన్ పవర్ సహా పలు కేసుల్లో విచారణ పూర్తయి బ్యాంకులకు త్వరలో పెద్ద మొత్తంలో రుణాలు వసూలు కానున్నాయని ఇటీవల ఆర్థిఖ మంత్రి అరుణ్ జైట్లీ తెలిపారు. దీనికితోడు ఇప్పటికే ఎన్‌సీఎల్‌టీలో దాదాపు66 కేసులు పరిష్కారమై సుమారు రూ.80వేల కోట్లు బ్యాంకులకు రికవరీ అయ్యాయి. ఇదే సమయంలో బ్యాంకుల ఎన్‌పీఏలు కూడా క్రమంగా తగ్గుతూవస్తున్నాయి. బ్యాంకులు రుణాలిచ్చే విధివిధానాల్లో కీలక మార్పులు వస్తున్నాయి. ఇవన్నీ కలిసి పీఎస్‌యూ బ్యాంకులను ఉత్సాహంగా ముందుకు నడిపిస్తాయని ఆకాశ్ అంచనా వేశారు. మరికొన్నాళ్లు మార్కెట్లలో తీవ్ర కదలికలే ఉంటాయని, ఇకపై క్యూ3 సీజన్, అంతర్జాతీయ పరిణామాలను మార్కెట్ వర్గాలు పరిశీలిస్తుంటాయని చెప్పారు. క్యూ2తో పోలిస్తే క్యూ3 బలంగా ఉంటుందని అంచనా వేశారు. డిసెంబర్‌లో ఆటో కంపెనీల గణాంకాలు పేలవంగా ఉండడంతో ఆటో కంపెనీల షేర్లపై ఒత్తిడి ఉందన్నారు. వచ్చే నెల్లో ప్రవేశపెట్టే సాధారణ బడ్జెట్ మార్కెట్లలో కీలక మార్పులకు నాంది పలకవచ్చన్నారు. మూడు అసెంబ్లీల్లో ఓటమితో కేంద్రంలోని బీజేపీ ఇకపై ప్రజాకర్షక విధానాలను తీసుకువచ్చే ఛాన్సులున్నాయన్నారు. ఈ దశలో రాజకీయాలతో సంబంధం లేని, బలమైన మేనేజ్‌మెంట్, ఎర్నింగ్స్ ఉన్న నాణ్యమైన కంపెనీల షేర్లలో క్రమానుగత పెట్టుబడులు పెట్టాలని సలహా ఇచ్చారు. కార్పొరేట్ గవర్నెన్స్ సహా క్వాలిటీ మేనేజ్‌మెంట్ ఉన్న చిన్న, మధ్యతరహా స్టాకులను వాల్యూయేషన్ల ఆధారంగా ఎంపికచేసుకోవాలని ఆకాశ్ సూచించారు. ఇలాంటి పలు నాణ్యమైన స్టాకులు గతేడాది గరిష్టాలతో పోలిస్తే దాదాపు 50 శాతం వరకు డిస్కౌంట్‌తో ట్రేడవుతున్నాయని, వీటిలో మంచి వాటిని ఎంచుకోవాలని చెప్పారు. క్రూడాయిల్ ధరల పతనం పెయింట్ కంపెనీలకు కలిసివస్తుందని అంచనా వేశారు. ఇదే సమయంలో చమురు ధరల పతనం ఓఎంసీలను కుంగదీస్తుందన్నారు.





బంధన్‌బ్యాంక్‌పై బ్రోకరేజ్‌లు ఏమంటున్నాయ్?

న్యూఢిల్లీ: ఫైనాన్స్‌ను విలీనం చేసుకుంటున్నట్లు ప్రకటించిన నేపథ్యంలో బంధన్ బ్యాంక్ షేర్లు మంగళవారం ట్రేడింగ్‌లో దాదాపు 2 శాతం పతనమయ్యాయి. ఈ విలీనంపై బ్రోకరేజ్ సంస్థలు న్యూట్రల్‌గా ఉన్నాయి. ఇప్పటికిప్పుడు బ్యాంకు రేటింగ్‌పై ఎలాంటి నిర్ణయం తీసుకోవట్లేదని బ్రోకరేజ్‌లు తెలిపాయి. అయితే ఒప్పంద అనంతరం ఇరు కంపెనీల సమన్విత సహవాసంపై కొన్ని అనుమానాలు వ్యక్తం చేస్తున్నాయి. గృహ ఫైనాన్స్ క్రమానుగతంగా లాభదాయక కంపెనీగా ఎదిగింది. అందువల్ల దీన్ని కొనుగోలు చేయడం బంధన్‌కు మంచిదేనని నిపుణుల అభిప్రాయం. దీంతో పాటు బంధన్‌బ్యాంకు ఎక్కువగా తూర్పు భారతంలో కార్యకలాపాలు నిర్వహిస్తుండగా, గృహ ఫైనాన్స్ ఎక్కువ పశ్చిమ భారతంలో కార్యకలాపాలు కొనసాగిస్తోంది. ఈ రెండిటి కలయికతో రెండు ప్రాంతాలను కవర్ చేసే అవకాశం కలగనుంది.

విలీన నేపథ్యంలో బంధన్ బ్యాంకుపై వివిధ బ్రోకరేజ్‌ల అంచనాలు ఇలా ఉన్నాయి..

1. న్యూట్రల్ రేటింగ్. టార్గెట్ రూ. 540. గృహ ఫైనాన్స్ విలీనం మైనార్టీ స్టాక్‌హోల్డర్ల ద ష్ట్యా మంచి నిర్ణయం కాదు. ముఖ్యంగా గ హ్ ఫైనాన్స్‌కు చెల్లించే ధర అభ్యంతరకరం. ఒప్పందం ప్రకారం ప్రతి వెయ్యి గృహ షేర్లకు 568 బంధన్‌షేర్లు లభిస్తాయి. దీనివల్ల మైనార్టీషేరు హోల్డర్లకు సరైన న్యాయం జరగదు. విలీనానంతరం బంధన్‌లో ప్రమోటర్ల వాటా 82.3 శాతం నుంచి 61 శాతానికి దిగిరానుంది.

2. న్యూట్రల్ రేటింగ్. టార్గెట్ రూ. 525. గృహ కొనుగోలు చాలా ఖరీదైనది. విలీనానంతరం ఇరు కంపెనీల సమన్విత సహవాసం సులభం కాకపోవచ్చు. అయితే విలీనంతో కంపెనీ మైక్రోఫైనాన్స్, రూరల్ హౌసింగ్ రంగాల్లో అగ్రగామిగా మారుతుంది. దీంతో వాల్యూయేషన్లు పెరుగుతాయి. విలీనంతో హెచ్‌డీఎఫ్‌సీకి ఎక్కువ ప్రయోజనం దక్కుతుంది. సంయుక్తకంపెనీలో హెచ్‌డీఎఫ్‌సీకి దాదాపు 15 శాతం వాటా ఉంటుంది. ఆర్‌బీఐ ఆంక్షల నుంచి తప్పించుకుని ప్రమోటర్ వాటా తగ్గించుకునేందుకు ఈ కొనుగోలు బంధన్‌కు ఉపకరిస్తుంది.

3. విలీనంతో గృహలో వాటాలను మంచి లాభాలకు అందుకునే అవకాశం హెచ్‌డీఎఫ్‌సీకి లభిస్తుంది. కేవలం 5 శాతా వాటా విక్రయించినా హెచ్‌డీఎఫ్‌సీకి దాదాపు రూ. 4వేల కోట్లు వస్తాయి. విలీనం ఖరీదు కాస్త ఎక్కువే.

4. విలీనం తర్వాత సంయుక్త కంపెనీ ఆర్‌ఓఏ కుంచించుకుపోవచ్చు. గృహ కొనుగోలు బంధన్‌కు ఖరీదైన డీల్. ఆర్‌బీఐ నియమావళికి అనుగుణంగా ప్రమోటర్ వాటా ఆశించిన స్థాయికి దిగిరాదు. నియమాలను అందుకునేందుకు బ్యాంకు ప్రమోటర్లు మరింత వాటా తగ్గించుకోవాల్సి ఉంది. రుణాల పరంగా విలీనం బంధన్‌కు మేలు చేయవచ్చు.



'బంగారు' భవిష్యత్తుకు సేవింగ్స్



'మనీ మేక్స్ మెనీ థింగ్స్' అంటారు. అలా డబ్బుతో కొనదగ్గ వాటిల్లో బంగారం ఒకటి. గ్రాము బంగారం దాచిపెట్టుకున్నా.. అది ఆపద సమయంలో ఆదుకుంటుంది.. అని నమ్మి.. బంగారంపై పెట్టుబడులు పెట్టేవారూ ఎక్కువే. పొదుపు చేసే విషయంలో బంగారంపై పెట్టుబడి అనేది ఎప్పుడూ లాభసాటే. అందుకు తగ్గట్టుగా ఇప్పుడు పొదుపు రంగాల్లో.. క్రమం తప్పకుండా ఆదాయం రావాలని కోరుకునే వారికి 'బంగారం' లాంటి ప్రత్యామ్నాయ మార్గాలూ ఉన్నాయి. బంగారాన్ని నిజంగానే కొనే అవసరం లేకుండా బంగారపు మదుపు అవకాశాల కల్పించే గోల్డ్ ఎక్స్ఛేంజ్ ఫండ్స్, డిపాజిట్ పథకాలు ఇటీవల కాలంలో మదుపరులకు లాభసాటిగా మారుతున్నాయి. అవేంటి? వాటిలో చిన్నమొత్తంతో పొదుపు పథకాలను ఎలా ప్రారంభించాలి? అలాగే చిట్‌ఫండ్ పథకాలు లాభసాటా? కాదా? ప్రయివేటు చిట్టీల విషయంలో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి? అనే విషయాల గురించి ఈ వారం 'రూపాయి'లో తెలుసుకుందాం... బంగారాన్ని పొదుపు మార్గంలో పెట్టేందుకు గోల్డ్ ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్, గోల్డ్ హార్వెస్ట్ స్కీం, మ్యూచువల్ ఫండ్స్, గోల్డ్ డిపాజిట్, తాజాగా జీఎంఎస్ వంటి పథకాలు చాలానే ఉన్నాయి. ఇందులో గ్రామీణ బ్యాంకుల నుంచి పట్టణస్థాయి వరకూ గోల్డ్ డిపాజిట్ పథకం గురించి ఖాతాదారులకు అంతో ఇంతో పరిచయం ఉండే ఉంటుంది.

గోల్డ్ ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్స్

గోల్డ్ ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్స్‌ని గోల్డ్ ఈటిఎఫ్‌గా షార్ట్‌కట్స్‌లో పిలుస్తుంటారు. ఈ పథకంలో బంగారాన్ని డిపాజిట్ చేయడానికి మనదగ్గర ప్రత్యక్షంగా బంగారం ఉండాల్సిన పనిలేదు. స్థోమతను బట్టి పేపర్‌పై మాత్రమే బంగారాన్ని కొనుగోలు చేసి, బ్యాంకుల్లో పొదుపు చేసే పద్ధతిని గోల్డ్ ఈటీఎఫ్‌గా పేర్కొంటారు. దీన్నే డీమ్యాట్ పద్ధతి అంటారు. అంటే 'డిపాజిటరీ ఫండ్'. బ్యాంకుల్లో మాదిరిగా ప్రత్యేక పాస్‌బుక్‌లు, ఖాతాలు లేకుండా ఆన్‌లైన్ ద్వారా బ్యాంకుల్లో గోల్డ్ ఈటీఎఫ్ ఖాతాదారుడిగా చేరడానికి అవకాశం ఉంటుంది. షేర్లు కొని, మంచిధర వచ్చినప్పుడుగానీ, అవసరం మేరకుగానీ ఏవిధంగా అయితే షేర్లను బ్రోకర్ ద్వారా అమ్మడం జరుగుతుందో.. ఈ గోల్డ్ ఈటీఎఫ్‌లో పెట్టుబడుల్ని అదే పద్ధతిలో సంబంధిత ఫైనాన్షియల్ బ్రోకర్ ద్వారా అమ్మకానికి పెట్టొచ్చు. ఎప్పుడంటే అప్పుడు ఈ ఖాతాను తెరవచ్చు. మార్కెట్లో గోల్డ్ ధర ఆధారంగా ఒక్కోగ్రాముని ఒక యూనిట్‌గా కొనుగోలు చేయాల్సి ఉంటుంది. మార్కెట్ హెచ్చు తగ్గులు ఆధారంగా పెట్టిన పెట్టుబడిపై లాభనష్టాలు ఆధారపడి ఉంటాయి. దీంట్లో స్వల్పంగా లాభం వచ్చినా.. దీనిలోని ప్రధానమైన సౌలభ్యం ఏమంటే.. ప్రత్యక్షంగా బంగారాన్ని కొనాల్సిన అవసరం లేదు. కనీసంగా ఒక గ్రాము బంగారం విలువ నుంచి అపరిమితంగా ఎంతైనా పెట్టుబడి పెట్టుకోవచ్చు. అయితే ఇలాంటి ఈటీఎఫ్, మ్యూచ్‌వల్ ఫండ్స్ వంటి వివిధరకాల గోల్డ్ ఖాతాలు తెరిచే ముందు ఆర్థిక నిపుణుల సలహా, సూచనలు, స్వీయ అవగాహన, అధ్యయనం చాలా ముఖ్యం.



గోల్డ్ డిపాజిట్ పథకం

ప్రజలు, వివిధ సంస్థలు నేరుగా తమ బంగారాన్ని బ్యాంకులో డిపాజిట్ చేసుకుని, వడ్డీ రూపంలో లాభం పొందడం ఈ పథకానికున్న ప్రధాన లక్షణం. కనీసంగా 30 గ్రాముల 22 క్యారెట్ల స్వచ్ఛత కలిగిన బంగారంతో పథకంలో చేరవచ్చు. గరిష్టంగా ఎంతైనా దాచుకోవచ్చు. స్వల్పకాలిక, దీర్ఘకాలిక పద్ధతిలో బంగారం డిపాజిట్ చేసుకునే సౌలభ్యం ఉంది. బంగారాన్ని బ్యాంకులో ఉంచే కాలవ్యవధిని బట్టి 2.25 నుంచి 2.5 శాతం వడ్డీని బ్యాంకులు చెల్లిస్తాయి.



జీఎంఎస్

గోల్డ్ మోనిటైజ్ స్కీమ్.. ఇప్పుడు కొత్తగా ప్రభుత్వమే స్వయంగా బ్యాంకింగ్ రంగాల ద్వారా ఈ పథకాన్ని ముందుకు తెస్తోంది. వ్యక్తిగతంగా కానీ, సంస్థాగతంగా గానీ నిరుపయోగంగా ఉన్న బంగారం నిల్వల్ని డిపాజిట్ చేయడం ద్వారా లాభాలు ఆర్జించడం ఈ పథకం ముఖ్య ఉద్దేశ్యం. ఆభరణాల రూపంలో ఉన్న నగలను కరిగించి, 99.5 శాతం స్వచ్ఛమైన బంగారంగా మారుస్తారు. అలా కరిగించి, రూపమిచ్చిన బంగారానికి ప్రామాణికంగా విలువకట్టి, డిపాజిట్‌దారుడికి సర్టిఫికేట్ జారీ చేస్తారు. కనీసంగా 30 గ్రాములు గరిష్టంగా ఎంతైనా బ్యాంకుల్లో డిపాజిట్ చేసుకోవచ్చు. ఏడాది నుంచి 15 ఏళ్ళ కాలపరిమితి వరకు బ్యాంకుల్లో దాచిపెట్టుకోవచ్చు. కాలపరిమితి ఆధారంగా ఏడాదికి 2.25 నుంచి 2.5 శాతం వడ్డీ జమ అవుతుంటుంది. మధ్యలో ఈ స్కీమ్ నుంచి వైదొలగొచ్చు. అయితే కొంత పెనాల్టీ చెల్సించాల్సి ఉంటుంది. ఖాతాదారుడు పెట్టుబడి పెట్టిన బంగారాన్ని నగదు రూపంలోగానీ, బంగారు కడ్డీ, నాణేల రూపంలోగానీ తిరిగి పొందవచ్చు.

ఖాతాదారుడికి లాభం చేకూర్చే గోల్డ్ పథకాలనేవి ఆయా బ్యాంకు, కంపెనీల ఆధారంగా వాటి రూపం, స్వరూపాలు మారుతూ ఉంటాయి. పైన పేర్కొన్న కొన్ని అంశాలు, ఆయా బంగారు పథకాల వివరాలు పాఠకుల అవగాహన కోసం మాత్రమే. బంగారంతో పొదుపు పథకాలు ప్రారంభించే ముందు ఆర్థిక నిపుణుల సూచన, సలహాలు అవసరమని మర్చిపోవద్దు!



భారత్‌లోనే ఐపీఎల్

- ప్రకటించిన బీసీసీఐ

న్యూఢిల్లీ: ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 2019 సీజన్‌కి ముహూర్తం ఖరారైంది. ఈ ఏడాది ఐపీఎల్ జరిగే సమయంలో దేశంలో సార్వత్రిక ఎన్నికలు జరగనుండటంతో భద్రతా కారణాల దృష్ట్యా ఐపీఎల్‌ని విదేశాల్లో నిర్వహించనున్నట్లు వార్తలు వచ్చిన సంగతి తెలిసిందే. అయితే, బోర్డు మాత్రం ఐపీఎల్ 2019 సీజన్‌ను భారత్‌లోనే నిర్వహించాలని నిర్ణయించింది. ఈ మేరకు మంగళవారం బీసీసీఐ అధికారిక ప్రకటన చేసింది. 'ఐపీఎల్ 2019 సీజన్‌ను ఎక్కడ నిర్వహించాలనే దానిపై మంగళవారం బీసీసీఐ పాలకుల కమిటీ ఢిల్లీలో సమావేశమైంది. ప్రాథమిక చర్చల అనంతరం జాతీయ, రాష్ట్ర ఏజెన్సీల అంచనా ప్రకారం 12వ ఎడిషన్‌ను భారత్‌లోనే నిర్వహించాలని నిర్ణయించారు' అని బీసీసీఐ ఒక ప్రకటనలో తెలిపింది. 'మార్చి 23, 2019న ఐపీఎల్ 2019 సీజన్ ప్రారంభమవుతుంది. బోర్డు అధికారులతో సమావేశమైన తర్వాత పూర్తి షెడ్యూల్‌ను త్వరలోనే విడుదల చేస్తాం. ఐపీఎల్ 2019 షెడ్యూల్‌ను ప్రకటించడానికి ముందు స్టేక్ హోల్డర్స్‌తో బీసీసీఐ పాలకుల కమిటీ సమావేశం కానుంది' అని బీసీసీఐ అందులో పేర్కొంది.

క్రికెట్ అభిమానుల్ని ఉర్రూతలూగించేందుకు ఐపీఎల్ మళ్లీ వచ్చేస్తోంది. దాదాపు 60 రోజుల పాటు ఉత్కంఠ మ్యాచ్‌లతో వీక్షకుల్ని మునివేళ్లపై నిలబెడుతూ.. హిట్టర్ల సిక్సర్లు, బౌలర్ల సంబరాలతో దేశంలోని స్టేడియాలు హోరెత్తిపోనున్నాయి. మార్చి 23న ప్రారంభంకానున్న ఈ మెగా టోర్నీ మే నెల రెండో వారంలో ముగిసే అవకాశం ఉంది. ఈ మేరకు ప్రస్తుతం బీసీసీఐ షెడ్యూల్‌ని రూపొందిస్తుండగా.. డిఫెండింగ్ ఛాంపియన్ చెన్నై సూపర్ కింగ్స్ సొంత మైదానం చెపాక్‌లో ఈ టోర్నీ తొలి మ్యాచ్ జరగనుంది. గత ఏడాది ఏప్రిల్ 7న ప్రారంభమైన ఈ ఐపీఎల్ సీజన్.. ఈ ఏడాది సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో రెండు వారాలు ముందే ఆరంభంకానుంది.

ఐపీఎల్‌లో ఉన్న జట్లు: చెన్నై సూపర్ కింగ్స్, ముంబై ఇండియన్స్, సన్‌రైజర్స్ హైదరాబాద్, కోల్‌కతా నైట్‌రైడర్స్ , రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, కింగ్స్ ఎలెవన్ పంజాబ్, రాజస్థాన్ రాయల్స్ , ఢిల్లీ క్యాపిటల్స్ (ఢిల్లీ డేర్‌డెవిల్స్ పేరు మార్చుకుంది) ఇటీవల జైపూర్ వేదికగా జరిగిన ఐపీఎల్ 2019 సీజన్ ఆటగాళ్ల వేలంలో కొన్ని ఫ్రాంఛైజీలు పవర్ హిట్టర్లని ప్రత్యేకంగా కొనుగోలు చేశాయి. దీంతో.. వారు ఏ మేరకు టోర్నీలో సత్తాచాటుతారో..? అని సర్వత్రా ఆసక్తి నెలకొంది. దీనికి తోడు.. గత ఏడాది బాల్ టాంపరింగ్ కారణంగా నిషేధానికి గురైన డేవిడ్ వార్నర్ (సన్‌రైజర్స్ హైదరాబాద్ కెప్టెన్), స్టీవ్ స్మిత్ (రాజస్థాన్) మళ్లీ ఈ ఏడాది టోర్నీలోకి పునరాగమం చేయనున్నారు. వేలంలో హిట్టర్లని కొనుగోలు చేసిన జట్లని ఓసారి పరిశీలిస్తే..! సన్‌రైజర్స్ హైదరాబాద్ ఫ్రాంఛైజీ న్యూజిలాండ్ విధ్వంసక ఓపెనర్ మార్టిన్ గప్టిల్ (రూ. కోటి)ను కొనుగోలు చేసింది. శిఖర్ ధావన్ స్థానంలో అతను ఆడే అవకాశం ఉంది. ఇక బెంగళూరు ఫ్రాంఛైజీ.. విండీస్ హిట్టర్ హిట్మెయర్ (రూ. 4.2 కోట్లు)ను కొనుగోలు చేసింది. ఇటీవల భారత్‌పై హెట్మెయర్ విధ్వంసక ఇన్నింగ్స్‌లతో వెలుగులోకి వచ్చాడు. ముంబై ఇండియన్స్.. వెటరన్ ఆల్‌రౌండర్ యువరాజ్ సింగ్ (రూ. కోటి)ని చేజిక్కించుకుంది. అతను రాణించడంపై అనుమానాలు నెలకొన్నా.. ప్రపంచకప్ నేపథ్యంలో.. ఈ సీనియర్ హిట్టర్ చెలరేగే అవకాశమూ లేకపోలేదు. ఇక ఢిల్లీ క్యాపిటల్స్ ఫ్రాంఛైజీ.. హైదరాబాద్ నుంచి శిఖర్ ధావన్‌ని బదిలీపై తీసుకుంది. దీంతో.. ఈ గబ్బర్ సొంత నగరం జట్టు కోసం ఎలా చెలరేగుతాడో..? చూడాలి. కోల్‌కతా నైట్‌రైడర్స్.. 2016 టీ20 ప్రపంచకప్ 6,6,6,6 హీరో కార్లోస్ బ్రాత్‌వైట్ (రూ.5.2 కోట్లు)ని తీసుకుంది. మే 30 నుంచి ఇంగ్లాండ్ వేదికగా వన్డే ప్రపంచకప్ జరగనున్న నేపథ్యంలో.. ఆ టోర్నీకి కనీసం 15రోజులు ముందే ఐపీఎల్ 2019 సీజన్ ముగియాల్సి ఉంది. ఈ మేరకు లోధా కమిటీ బీసీసీఐకి గతంలోనే షరతు విధించింది. దీంతో.. ఫ్రాంఛైజీల అభిప్రాయాలని సేకరించనున్న బీసీసీఐ.. త్వరలోనే పూర్తి స్థాయిలో షెడ్యూల్ ప్రకటించనుంది.

టీమిండియాకు బీసీసీఐ నజరానా

న్యూఢిల్లీ: ఆస్ట్రేలియా గడ్డ మీద తొలి టెస్టు సిరీస్ గెలిచిన టీమిండియాకు బీసీసీఐ నజరానా ప్రకటించింది. జట్టు సభ్యులకు ఒక్కొక్కరికి రూ.15 లక్షల చొప్పున నగదు బహుమానం ఇవ్వనున్నట్టు తెలిపింది. ఆటగాళ్లు అందుకోబోయే బోనస్ మ్యాచ్ ఫీజ్‌కి సమానం. రిజర్వ్ ప్లేయర్లకు రూ. 7.5 లక్షల నజరానా అందించనున్నట్టు తెలిపింది. ఆటగాళ్లతోపాటు కోచ్‌లకు కూడా ప్రోత్సాహకాన్ని బీసీసీఐ ప్రకటించింది. కోచ్‌లకు రూ.25 లక్షల చొప్పున నగదు బహుమానం



అందించనున్నట్టు తెలిపింది. సపోర్టింగ్ స్టాఫ్‌కు వేతనంతో సమానమైన నజరానా అందజేయనున్నట్టు కమిటీ ఆఫ్ అడ్మినిస్ట్రేటర్స్ స్పష్టం చేసింది. గతంలో బీసీసీఐ మహిళా, అండర్-19 జట్లకు కూడా నజరానా ప్రకటించింది. 2017 వరల్డ్ కప్‌లో మెరుగైన ప్రదర్శన చేసిన భారత మహిళల జట్టుకు ఒక్కో క్రీడాకారిణికి రూ.50 లక్షల చొప్పున బీసీసీఐ నగదు రివార్డ్ అందజేసింది. అండర్-19 వరల్డ్ కప్ గెలిచిన కుర్రాళ్ల జట్టుకు కూడా బీసీసీఐ గతంలో బహుమానం ప్రకటించింది. ఒక్కో ఆటగాడికి రూ.30 లక్షలు ప్రకటించిన బీసీసీఐ.. ప్రధాన కోచ్ అయిన ద్రవిడ్‌కు రూ.50 లక్షలు, సహాయక సిబ్బందికి రూ.20 లక్షల చొప్పున నజరానా ప్రకటించింది. తనకంటే సిబ్బందికి తక్కువ రివార్డ్ ప్రకటించడం పట్ల ద్రవిడ్ అసంతృప్తి వ్యక్తం చేశాడు. తనకొచ్చే రివార్డ్ తగ్గించాలని కోరాడు. దీంతో అందరికీ సమానంగా రూ.25 లక్షల చొప్పున నజరానా అందజేసింది.

స్టార్క్‌కు మద్దతుగా కోహ్లీ

సిడ్నీ: ఇటీవల ముగిసిన టెస్టు సిరీస్‌లో ఆశించిన స్థాయిలో రాణించలేక విమర్శలు ఎదుర్కొంటున్న ఆసీస్ ప్రధాన పేసర్ మిచెల్ స్టార్క్‌కు టీమిండియా కెప్టెన్ విరాట్ కోహ్లీ మద్దతుగా నిలిచాడు. ఎంతోకాలంగా ఆసీస్ జట్టు విజయాల్లో కీలక పాత్ర పోషిస్తున్న స్టార్క్.. ఏదొక సిరీస్‌లో ఆకట్టుకోలేకపోతే ఆ దేశ మాజీలు ఒక్కసారిగా విమర్శలు ఎక్కుపెట్టడం తనను ఆశ్చర్యానికి గురి చేసిందన్నాడు విరాట్. కొన్ని సందర్భాల్లో ఎవరైనా గాడి తప్పడం సహజమేనని, అటువంటి తరుణంలో వారికి మద్దతుగా ఉండాలే



తప్ప ఇలా విమర్శలు చేయడం ఏమిటని ప్రశ్నించాడు. ఒక బెస్ట్ బౌలర్‌కు ఇచ్చే గౌరవం ఇదేనా అంటూ కోహ్లీ నిలదీశాడు. 'చాలా ఏళ్లుగా స్టార్క్ మీ జట్టులో నంబర్ వన్ బౌలర్‌గా కొనసాగుతున్నాడు. ఇప్పుడు అదే బౌలర్‌పై వరుసగా విమర్శలు చేయడం నన్ను ఆశ్చర్యానికి గురి చేసింది. స్టార్క్ మీ అత్యుత్తమ బౌలర్ అనుకుంటే అతనికి కొంత స్వేచ్ఛ ఇవ్వండి. మళ్లీ గాడిలో పడటానికి అతనికి మద్దతుగా నిలవండి. అంతే కానీ విమర్శలు చేస్తే అతనిపై మరింత ఒత్తిడి పెరుగుతుంది. అపార నైపుణ్యమున్న ఈ తరహా బౌలర్‌పై ఒత్తిడి పెంచి దూరం చేసుకోవద్దు. ఆస్ట్రేలియా సాధించిన ఎన్నో విజయాల్లో స్టార్క్ ప్రధాన పోషిస్తూ వస్తున్నాడు. అతని సేవల్ని కోల్పోవద్దు' అని కోహ్లీ పేర్కొన్నాడు. భారత్‌తో జరిగిన టెస్టు సిరీస్‌లో స్టార్క్ 13 వికెట్లు తీశాడు. దాంతో ఆసీస్ దిగ్గజ ఆటగాళ్ల షేన్ వార్న్, మిచెల్ జాన్సన్‌ల నుంచి విమర్శలు ఎదుర్కొన్నాడు స్టార్క్. కాగా, భారత్‌తో త్వరలో ఆరంభం కానున్న వన్డే సిరీస్ నుంచి స్టార్క్‌కు విశ్రాంతినిచ్చారు. యాషెస్ సిరీస్‌ను దృష్టిలో పెట్టుకుని స్టార్క్‌ను భారత్‌తో జరిగే వన్డే సిరీస్‌కు ఎంపిక చేయలేదు.

ధోనీని దాటేసిన పంత్

- పుజారాకు మూడో స్థానం
- ఐసీసీ టెస్టు ర్యాంకింగ్స్

దుబాయి: ఐసీసీ మంగళవారం ప్రకటించిన టెస్టు బ్యాట్స్‌మెన్ ర్యాంకింగ్స్‌లో భారత స్టార్ బ్యాట్స్‌మన్ పుజారా మూడో స్థానంలో నిలిచాడు. ఆస్ట్రేలియాతో జరిగిన టెస్టు సిరీస్‌లో అతడు 521 పరుగులతో టాప్ స్కోరర్‌గా నిలిచిన విషయం తెలిసిందే. అలాగే, ఆ సిరీస్‌లో 350 పరుగులు చేసిన టీమిండియా వికెట్ కీపర్ రిషబ్ పంత్ ఒక్కసారిగా 21 స్థానాలు ఎగబాకి 17వ స్థానంలో నిలిచాడు. ధోనీ టెస్టు కెరీర్‌లో 19వ ర్యాంకే అత్యుత్తమ ర్యాంక్‌గా ఉంది. అతని రికార్డును పంత్ అధిగమించాడు. 1973లో టీమిండియా వికెట్ కీపర్ ఫరూఖ్ ఇంజినీర్ టెస్టు బ్యాట్స్‌మెన్ ర్యాంకింగ్స్‌లో 17వ స్థానంలో నిలిచాడు. ఇప్పుడు ఆయన సరసన పంత్ నిలిచాడు. ఆస్ట్రేలియా పర్యటనకు వెళ్లే ముందు పంత్ 59వ స్థానంలో ఉన్నాడు. కాగా, టీమిండియా కెప్టెన్ విరాట్ కోహ్లీ మళ్లీ అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు. ఆస్ట్రేలియా సిరీస్‌లో రాణించిన రవీంద్ర జడేజా, మయాంక్ అగర్వాల్ కూడా బ్యాట్స్‌మెన్ ర్యాంకింగ్స్‌లో తమ స్థానాలను మెరుగుపర్చుకున్నారు. ఆరు స్థానాలు ఎగబాకిన భారత ఆల్‌రౌండర్ జడేజా 57వ స్థానంలో నిలవగా, మయాంక్ ఐదు స్థానాలు మెరుగుపర్చుకుని 62వ స్థానంలో నిలిచాడు. ఇక బౌలర్ల ర్యాంకింగ్స్‌లో పలువురు టీమిండియా బౌలర్లు తమ స్థానాలను మెరుగుపర్చుకున్నారు. కుల్‌దీప్ యాదవ్ ఏడు స్థానాలు ఎగబాకి 45వ స్థానంలో నిలవగా, జస్‌ప్రీత్ బుమ్రా 16, షమీ 22వ



స్థానాల్లో నిలిచారు. జడేజా ఒక స్థానం మెరుగుపర్చుకుని ఐదో స్థానంలో నిలిచాడు. ఐసీసీ బ్యాట్స్‌మెన్ ర్యాంకింగ్స్‌లో టాప్-5లో వరుసగా విరాట్ కోహ్లీ (భారత్), విలియమ్సన్ (న్యూజిలాండ్), పుజారా (భారత్), స్టీవ్ స్మిత్ (ఆస్ట్రేలియా), రూట్స్ (ఇంగ్లండ్) ఉన్నారు. బౌలింగ్ టాప్-5లో వరుసగా రబాడా (దక్షిణాఫ్రికా), అండర్సన్ (ఇంగ్లాండ్), ఫిలాండర్ (దక్షిణాఫ్రికా), కమిన్స్ (ఆస్ట్రేలియా), జడేజా (భారత్) ఉన్నారు.

కన్నీళ్లు పెట్టుకున్న గవాస్కర్

ముంబై: చరిత్రాత్మక టెస్ట్ సిరీస్ చేజిక్కించుకున్న అనంతరం సోమవారం టీమిండియా సిడ్నీలో బోర్డర్-గావస్కర్ ట్రోఫీని అందుకోవడం చూసి కన్నీటి పర్యంతమయ్యానన్నారు మాజీ క్రికెటర్ సునీల్ గావస్కర్. క్రికెట్ ఆస్ట్రేలియా నిర్వాహకుల తప్పిదం కారణంగా ఆయన ట్రోఫీ బహుకరణ కార్యక్రమానికి హాజరుకాలేపోయారు. ఆస్ట్రేలియాలో భారత్ 2-1 తేడాతో తొలిసారి చారిత్రక సిరీస్ విజయాన్ని సొంతం చేసుకుంది. 'చాలా గర్వంగా ఉంది. ఈ చారిత్రక సన్నివేశాన్ని చూసిన తర్వాత కన్నీటి పర్యంతమయ్యాను. ఇదొక గొప్ప రోజు కాబట్టి నేను అక్కడ ఉండి ట్రోఫీని అందిస్తే ఇంకా అద్భుతంగా ఉండేది. వారి గెలుపు, ట్రోఫీని అందుకోవడాన్ని చూడటం నిజంగా మధురానుభూతి' అని గవాస్కర్ మీడియాతో తన సంతోషాన్ని పంచుకున్నారు. అలెన్ బోర్డర్, సునీల్ గవాస్కర్ పేర్ల మీద ఏర్పాటు చేసిన ఈ ట్రోఫీ ప్రెజెంటేషన్ కార్యక్రమానికి ప్రతిసారి గావస్కర్ హాజరవుతారు. అయితే సిడ్నీలో జరిగిన చరిత్రాత్మక ఈవెంట్‌కు



మాత్రం ఆయన మిస్సయ్యారు. అక్కడికి వెళ్లలేకపోవడంపై మాజీ కెప్టెన్ అసంతృప్తి వ్యక్తం చేశారు.

ఆస్ట్రేలియా చేరుకున్న ధోనీ, రోహిత్

సిడ్నీ: ఆస్ట్రేలియాతో వన్డే సిరీస్ కోసం భారత్ జట్టు అగ్రశ్రేణి ఆటగాళ్లు మహేంద్రసింగ్ ధోనీ, రోహిత్ శర్మ మంగళవారం సిడ్నీకి చేరుకున్నారు. శనివారం ఉదయం 07:50 గంటల నుంచి సిడ్నీ వేదికగానే తొలి వన్డే ప్రారంభంకానుండగా.. వన్డే సిరీస్‌కి ఎంపికైన ధోనీ, కేదార్ జాదవ్, దినేశ్ కార్తీక్, చాహల్ తదితరులు భారత్ నుంచి బయల్దేరి మంగళవారం అక్కడికి చేరుకున్నారు. వీరితో పాటు ఇటీవల తన భార్య రితికకి పాప పుట్టడంతో చివరి టెస్టు నుంచి తప్పుకుని స్వదేశానికి వచ్చేసిన రోహిత్ శర్మ కూడా వెళ్లాడు. సోమవారం ఆఖరి టెస్టు మ్యాచ్ ఆడిన భారత టెస్టు జట్టు ప్రస్తుతం సిడ్నీలోనే ఉన్న విషయం తెలిసిందే. ఆస్ట్రేలియాతో మూడు వన్డేల సిరీస్‌లో తలపడే భారత్ జట్టులో మంగళవారం మేనేజ్ మెంట్ ఒక మార్పు చేసింది. నాలుగు టెస్టుల సిరీస్‌తో అలసిపోయిన ఫాస్ట్ బౌలర్ జస్‌ప్రీత్ బుమ్రాకి విశ్రాంతినిచ్చి అతని స్థానంలో హైదరాబాద్ ఫాస్ట్ బౌలర్ మహ్మద్ సిరాజ్‌కి అవకాశం కల్పించింది. ఈ మార్పు మినహా.. గతంలో సెలక్టర్లు ప్రకటించిన జట్టు అలానే ఉంది.





భారత్ వన్డే జట్టు : విరాట్ కోహ్లీ (కెప్టెన్), రోహిత్ శర్మ (వైస్ కెప్టెన్), కేఎల్ రాహుల్, శిఖర్ ధావన్, అంబటి రాయుడు, దినేశ్ కార్తీక్, కేదార్ జాదవ్, మహేంద్రసింగ్ ధోని (వికెట్ కీపర్), హార్దిక్ పాండ్య, కుల్‌దీప్ యాదవ్, చాహల్, రవీంద్ర జడేజా, భువనేశ్వర్ కుమార్, ఖలీల్ అహ్మద్, మహ్మద్ షమీ, మహ్మద్ సిరాజ్

ఆసీస్‌తో వన్డే సిరీస్‌కు బుమ్రా దూరం

సిడ్నీ: టెస్టు సిరీస్‌లో సరికొత్త చరిత్ర లిఖించిన కోహ్లీ సేన ఇక ఆస్ట్రేలియాతో వన్డే సిరీస్‌లకు సిద్ధమవుతోంది. ఈ సిరీస్ విజయంలో కీలక పాత్ర పోషించిన పేసర్ జస్‌ప్రీత్ బుమ్రాకు తదుపరి మ్యాచ్‌ల్లో బీసీసీఐ విశ్రాంతి కల్పించింది. ఆస్ట్రేలియాతో జరగబోయే వన్డే మ్యాచ్‌లు, న్యూజిలాండ్ పర్యటనలో బుమ్రా ఆడట్లేదని ప్రకటించింది. అతడి స్థానంలో హైదరాబాద్ కుర్రాడు మహ్మద్ సిరాజ్‌కు అవకాశం కల్పించింది. 'తర్వాతి సిరీస్‌లను దృ ష్టిలో పెట్టుకుని ప్రస్తుతం బుమ్రాకు విశ్రాంతి ఇవ్వడమే మంచిదని భావించాం. ఆస్ట్రేలియాతో వన్డే మ్యాచ్‌లు, న్యూజిలాండ్ పర్యటనలో బుమ్రా స్థానంలో మహ్మద్ సిరాజ్ ఆడుతాడు' అని బీసీసీఐ ఓ ప్రకటనలో తెలిపింది. తాజా టెస్టుల్లో బుమ్రా అద్భుత ప్రదర్శన చేసిన విషయం తెలిసిందే. కేవలం 12 నెలల క్రితమే టెస్టుల్లో అరంగేట్రం చేసిన బుమ్రా.. ప్రస్తుతం కీలక పేసర్‌గా మారిపోయాడు. ఆసీస్‌తో జరిగిన



నాలుగు టెస్టుల సిరీస్‌లో 21 వికెట్లు తీయడం విశేషం. జనవరి 12 నుంచి భారత్-ఆస్ట్రేలియా మధ్య మూడు వన్డేల సిరీస్ ప్రారంభం కానుంది. ఈ సిరీస్ అనంతరం ఐదు వన్డేలు, మూడు టీ20లు ఆడేందుకు టీమిండియా న్యూజిలాండ్ బయల్దేరుతుంది. జనవరి 23 నుంచి న్యూజిల్యాండ్ సిరీస్ ప్రారంభం కానుంది.

సచిన్, కోహ్లీ రికార్డులు బద్దలు చేసిన టేలర్

ముంబై: న్యూజిలాండ్ ఆటగాడు రాస్ టేలర్ (137 పరుగులు) అదరగొట్టాడు. శ్రీలంకతో జరిగిన చివరి వన్డేలో అద్భుత శతకం బాదేశాడు. ఈ ఘనతతో ఒకే ఫార్మాట్‌లో 20 శతకాలు సాధించిన న్యూజిలాండ్ తొలి ఆటగాడిగా టేలర్ అవతరించాడు. కొన్నాళ్లుగా అతడు వీరోచిత ఫామ్‌లో ఉన్నాడు. వరుసగా 50ం స్కోర్లు చేస్తున్నాడు. గత ఆరు వన్డేల్లో 181 నాటౌట్, 80, 86 నాటౌట్, 54, 90,



137 స్కోర్లు సాధించాడు. దీంతో సచిన్ టెండూల్కర్, విరాట్ కోహ్లీ రికార్డులు బద్దలయ్యాయి. గతంలో విరాట్ కోహ్లీ, సచిన్ వరుసగా ఐదు వన్డేల్లో 50ం పరుగులు చేశారు. టేలర్ వరుసగా ఆరు ఇన్నింగ్సుల్లో ఈ 50ం స్కోర్లు చేసి వారి రికార్డులను బద్దలుకొట్టాడు. అంతే కాకుండా న్యూజిలాండ్ సారథి కేన్ విలియమ్సన్, ఆంద్రూ జోన్స్, మహ్మద్ యూసఫ్ (పాక్), గోర్డన్ గ్రీనిడ్జ్ (వెస్టిండీస్), మార్క్ వా (ఆస్ట్రేలియా) ఘనతను సమం చేశాడు. అయితే జావెద్ మియాందాద్ (పాకిస్థాన్) 1987లో వరుసగా 9 సార్లు 50ం స్కోర్లు చేసి అందరికన్నా ముందున్నాడు.

Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam publications private limited, Printed at JAGATI PUBLICATIONS LIMITED, Sakshi Press, Survey No:127, Plot No:12, Mallapur Village, Nacharam, Medchal District. Telangana state and Published From H.No:6-3-864/4/B, SBN Arcade,4th&5th Floor, Green lands, Opp: Green Park Hotel, Hyderabad - 500016 Telangana State, EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.TELTEL/2016/72952. Phone No.040-46519999. E-mail Id: editor@manamnews.com.